గురువారం
24•1•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 8 • సంచిక 209
• పేజీలు : 16 + 16

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

కొలువుల భర్తీకి కొత్తవేగం

- వైద్యారోగ్య ఉద్యోగాల భర్తీకి ప్రత్యేక బోర్డు
- చైర్మన్‌గా వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి
- సిబ్బందిని కేటాయిస్తూ ఆర్థికశాఖ ఉత్తర్వులు
- ఇప్పటికే టీఎస్‌పీఎస్సీతోపాటు పలు బోర్డులు
- న్యాయవివాదాల నేపథ్యంలో సర్కార్ నిర్ణయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను తెలంగాణ సర్కారు వేగవంతం చేస్తున్నది. రాష్ట్రంలో ప్రభుత్వ కొలువులను టీఎస్‌పీఎస్సీ ద్వారా భర్తీచేస్తున్న ప్రభుత్వం.. నియామక ప్రక్రియల్లో న్యాయవివాదాలు లేకుండా, ప్రక్రియ వేగవంతం చేసేందుకు వీలుగా పలు ఉద్యోగ నియామక బోర్డులను కూడా నెలకొల్పింది. ఈ క్రమంలోనే తెలంగాణ పోలీస్ నియామక బోర్డు, తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషనల్ రిక్రూట్‌మెంట్ బోర్డులను ఇది వరకే ఏర్పాటుచేసింది. విద్యుత్ సంస్థలు మొదటినుంచీ సొంతంగా ఉద్యోగ నియామకాలు చేపడుతున్నాయి. తాజాగా వైద్య రంగంలో నియామక ప్రక్రియను వేగవంతం చేయడానికి వీలుగా మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎంహెచ్‌ఎస్‌ఆర్బీ)ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఈ నెల

మిగతా 2వ పేజీలో



సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో మహారుద్ర సహిత సహస్ర చండీయాగంలో భాగంగా బుధవారం మూడోరోజు చండీమండపంలో పూజలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు దంపతులు

దేవభూమిగా ఎర్రవల్లి క్షేత్రం

మూడోరోజు నిర్విఘ్నంగా సాగిన సహస్ర చండీయాగం

మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతికి సీఎం కేసీఆర్ దంపతుల పూజలు

పెద్దఎత్తున తరలివచ్చిన ప్రముఖులు, ప్రజాప్రతినిధులు

రేపు పూర్ణాహుతితో ముగియనున్న సహస్ర చండీయాగం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

వేద మంత్రాలు.. పురాణేతిహాస పారాయణాలు, వేదోక్తమైన హవనాలు, నవగ్రహారాధనలతో సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి దేవభూమిగా మారింది. మంగళనీరాజనాలు, జపతపాలతో తపోభూమిగా పరివర్తనం చెందింది. రాష్ట్ర ప్రజల సుఖ సంతోషాల కోసం ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు దంపతులు సంకల్పించిన మహారుద్ర సహిత సహస్ర చండీయాగం మూడోరోజు కన్నుల పండువగా కొనసాగింది. బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమైన యాగ ప్రక్రియ నిరంతరాయంగా రాత్రి ఏడు గంటలవరకు కొనసాగింది. సీఎం కేసీఆర్ దంపతులు.. ఇతర కుటుంబసభ్యులు యాగశాలకు చేరుకొని సంప్రదాయబద్ధంగా తొలిపూజలు నిర్వహించారు. మొదట రాజ శ్యామల మంటపంలో అమ్మవారిని అర్చించారు. ఆ తర్వాత మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి అమ్మవార్లకు బ్రహ్మ స్వరూపిణి మంటపంలో పూజలుచేశారు. అనంతరం పవిత్ర మంత్రోచ్చారణల మధ్య అమ్మవారికి అభిషేకం చేశారు. వేదపారాయణాలు జరుగుతున్న చతుర్వేద పారాయణ మంటపంలో ప్రార్థనలు చేశారు. సూర్యనమస్కారాలు చేశారు. చండీ మండపంలో

మిగతా 2వ పేజీలో



చక్రం తిప్పేది వీరేనా?

లోక్‌సభలో హంగ్ తప్పదంటున్న విశ్లేషకులు

తదుపరి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటులో కీలకం కానున్న టీఆర్ఎస్, వైసీపీ, బీజేడీ!

లోక్‌సభ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్నకొద్దీ అందరి చూపు దేశంలోని ముగ్గురు ప్రముఖ నాయకుల వైపు కేంద్రీకృతమవుతున్నది. వారే టీఆర్ఎస్ అధినేత, తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, వైసీపీ నాయకుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ఒడిశా సీఎం, బీజేడీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్. లోక్‌సభ ఎన్నికల అనంతరం హంగ్ పార్లమెంట్ ఏర్పడనుందన్న అంచనాల నేపథ్యంలో కేంద్రంలో ఏర్పడబోయే ప్రభుత్వానికి ఈ ముగ్గురు నేతల మద్దతు కీలకం కానుంది. దేశంలోని పలు పార్టీలు కాంగ్రెస్ లేదా బీజేపీ వెనుక చేరి కూటములుగా ఏర్పడుతున్న నేపథ్యంలో ఈ ముగ్గురు నేతల పార్టీలు మాత్రం తటస్థ వైఖరిని అవలంబిస్తున్నాయి. వీరు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ, ఏపీ, ఒడిశాలో 63 లోక్‌సభ స్థానాలుండగా, 45 నుంచి 50 వరకు సీట్లను వీరి పార్టీలే గెలుచుకొనే అవకాశం ఉందని సర్వేలు పేర్కొంటున్నాయి. కేంద్రంలో తదుపరి ఏర్పడబోయే ప్రభుత్వ మనుగడ ఈ మూడు పార్టీల మద్దతుపైనే ఆధారపడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వివరాలు 4వ పేజీలో

తెలంగాణలో ఏపీ వార్తలెందుకు?

తెలంగాణ వార్తలు ఆంధ్రా ఎడిషన్లలో ఎందుకు కనిపించవు?

తెలంగాణవాదాన్ని తొక్కిపట్టే ఆధిపత్య ధోరణికి ముగింపు పలుకాలి • టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు

- తెలంగాణ భావజాల పత్రికలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది
- జర్నలిస్టులకు సముచిత స్థానం కేసీఆర్ నిబద్ధతకు నిదర్శనం
- ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా తెలంగాణలో జర్నలిస్టుల సంక్షేమం
- ఎమ్మెల్యే క్రాంతికిరణ్ అభినందనసభలో కేటీఆర్
- 100 కోట్ల జర్నలిస్టు సంక్షేమ నిధి మరెక్కడా లేదు: అల్లం నారాయణ



బుధవారం పబ్లిక్‌గార్డెన్స్‌లోని ఇందిరాప్రియదర్శిని ఆడిటోరియంలో.. ఎమ్మెల్యేగా ఎన్నికైన జర్నలిస్టు క్రాంతికిరణ్ అభినందన సభలో మాట్లాడుతున్న టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఐదేండ్లు గడుస్తున్నా కొన్ని పత్రికలు, మీడియా సంస్థలు ఆంధ్ర భావజాల ఆధిపత్యాన్ని ప్రదర్శించే ప్రయత్నాన్ని మార్చుకోవడం లేదని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు విమర్శించారు. వాళ్లు ఏం చెప్తే అదే కరెక్ట్.. అదే వేదం అన్నట్టు ప్రవర్తిస్తున్నారని, ఆ ఆధిపత్య ధోరణికి ముగింపు పలుకాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. తాము ఎవరితోనూ వివాదాన్ని కోరుకోవటంలేదని, అదే సమయంలో ఎవరిపైనా ఆధిపత్యం చెలాయించాలని

మిగతా 2వ పేజీలో

స్టాంపుల సొమ్ము స్వాహా

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రిజిస్ట్రార్ పరిధిలో వెలుగుచూసిన మోసం

అసిస్టెంట్ రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ సహా ఐదుగురి సస్పెన్షన్

ఐదేండ్లుగా రూ. 90 లక్షలు గోల్‌మాల్

రూ. 12 లక్షలు రికవరీ చేసిన అధికారులు




2

రేపు రెండోవిడుత పంచాయతీ పోలింగ్

- 3,342 గ్రామపంచాయతీల్లో ముగిసిన ప్రచారం
- పోటీలో 10,668 మంది సర్పంచ్ అభ్యర్థులు
- 26,191 వార్డులకు బరిలో 63,480 మంది అభ్యర్థులు
- 788 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం
- ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో మద్యం దుకాణాలు బంద్

9



నేడు నింగిలోకి పీఎస్ఎల్వీ- సీ44

మొదలైన కౌంట్‌డౌన్

రాత్రి 11.37 గంటలకు ప్రయోగం

5

ప్రియాంక అరంగేట్రం



- ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా నియామకం
- పార్టీ తూర్పు ఉత్తరప్రదేశ్ బాధ్యతలు అప్పగింత
- తదుపరి యూపీ సీఎం అమేథీ నుంచే: రాహుల్

5

కేంద్రమంత్రి జైట్లీకి శస్త్రచికిత్స

రెండు వారాలపాటు అమెరికాలోనే విశ్రాంతి

11



ఆర్థికశాఖ బాధ్యతలు పీయూష్ గోయల్‌కు

ఆర్టీసీ డ్రైవర్‌కు ఛాతి నొప్పి

బస్సు ఆపి ప్రయాణికులను కాపాడిన డ్రైవర్

డ్రైవర్‌కు ప్రాథమిక చికిత్స చేసిన సింగరేణి డాక్టర్

గమ్యానికి బస్సు నడిపిన సింగరేణి డ్రైవర్

9



బుధవారం ఎర్రవల్లిలో మహారుద్రసహిత సహస్ర చండీయాగంలో భాగంగా కేరళ సంప్రదాయ వాయిద్యాలతో కళాకారులు



బగళాముఖి అమ్మవారికి హారతి ఇస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు దంపతులు. చిత్రంలో టీఎస్‌ఎండీసీ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి తదితరులు



మాజీ ఎమ్మెల్యేలు మాలోతు కవిత, కోవ లక్ష్మితో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

దేవభూమిగా ఎర్రవల్లి క్షేత్రం

మొదటిపేజీ తరువాయి...

చండీమాతకు పూజలు చేశారు. ఆ తర్వాత మహారుద్ర మంటపంలో రుద్రహవనం, రుద్ర పారాయణం జరిగింది. మూడో రోజు పూజాకార్యక్రమాల్లో సీఎం కేసీఆర్ దంపతులతోపాటు బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, టీఎస్‌ఎండీసీ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి దంపతులు కూర్చున్నారు. ప్రాతఃకాల పూజానంతరం 300 చండీ పారాయణాలు పూర్తి చేశారు. సాయంకాలం 4 నుంచి 2 లక్షల నవార్ణజపము పూర్తిసచేశారు.

మహారుద్ర యాగం

శాంతి పాఠముతో ప్రారంభమై ఆవాహిత దేవతా పూజ.. 41 ఏకాదశ రుద్ర అభిషేకములు పూర్తి చేసుకొని మధ్యాహ్నం 3 గంటల నుండి 41 ఏకాదశ హోమములు, క్రమార్చన హారతి, మంత్రపుష్ప సమర్పణ జరిగింది. అనంతరం జరిగిన భజన కార్యక్రమం సీఎం దంపతులను, భక్తులను ఆకర్షించింది.

రాజశ్యామల యాగము

రాజశ్యామల యాగంలో భాగంగా రాజశ్యామల మూల మంత్ర జపం, మూలమంత్ర హవనాలు, శరభ సాళువ మూల మంత్ర జపం హవనం , మాతంగి మహావిద్య హవనము, ప్రదోషకాల మంటప్రార్చనలు, కుంకుమార్చన, సహస్ర నామార్చన, హారతి మంత్రపుష్పము చతుర్వేద స్వస్తి పూజాకార్యక్రమాలు జరిగాయి.

బగళాముఖి

బగళాముఖి పూజలో భాగంగా మూడోరోజు పదివేల జపం పూర్తయింది. సాయంత్రం 4 గంటలకు హరిద్రన్నముతో 2 వేల మూల మంత్ర హవనము పూర్తిచేసి రాత్రి 7.30గంటలకు హారతి.. మంత్ర పుష్పము, తీర్థప్రసాద వితరణతో కార్యక్రమం పూర్తయింది. వీటితోపాటు అరుణ పారాయణము మహాసారము, పంచ కాటకముల పారాయణములు, నవగ్రహ జపానుష్ఠానములు, మహా మృత్యుంజయ జపము నిర్వహించారు. ప్రతి యాగ మంటపములో జరిగే హారతి, మంత్రపుష్ప కార్యక్రమాలకు ముఖ్యమంత్రి దంపతులు హాజరవుతున్నారు . సాయంత్రం ప్రదోషకాల వేళ చతుర్వేదాలను అవధారయ అని వినిపించి పూజలు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు మంగళనీరాజనం సందర్భంగా భక్తి కీర్తనల ఆలాపన ముఖ్యమంత్రి దంపతులను మంత్రముగ్ధులను చేసింది. అనంతరం మంత్ర పుష్ప సమర్పణ.. తీర్థ ప్రసాద వితరణతో మూడోరోజు కార్యక్రమాలు పూర్తయ్యాయి.

మూడోరోజు కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు అనురాగ్ శర్మ, హోంశాఖ మాజీమంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఎంపీలు బోయినపల్లి వినోద్‌కుమార్, నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత దంపతులు, జోగినిపల్లి సంతోష్‌కుమార్ దంపతులు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ మంత్రి ఈటలరాజేందర్, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, మర్రి జనార్దన్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి దంపతులు, రాజేందర్‌రెడ్డి దంపతులు, వరంగల్ ఈస్ట్ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, ఎం శ్రీనివాస్‌రెడ్డి, టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, టీఎస్ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, బేవరేజస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్‌రావు, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, టీఎస్‌టీఎస్‌సీ చైర్మన్ చిరుమళ్ల రాకేశ్, టీఎస్‌టీడీసీ చైర్మన్ పీ భూపతిరెడ్డి, రాష్ట్ర గ్రంథాలయసంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, బీసీ కమిషన్ సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్, టీఎస్ ఆగ్రోస్ చైర్మన్ కిషన్‌రావు, గొర్రెల అభివృద్ధి సంస్థ చైర్మన్ రాజయ్యయాదవ్, టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శులు పీ రాములు, బస్వరాజుసారయ్య, రావుల శ్రవణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఏనుగు రవీందర్‌రెడ్డి, కోవాలక్ష్మి, కే ప్రభాకర్‌రెడ్డి, వేముల వీరేశం, మాలోతు కవిత తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్ నుంచి మీడియా ప్రతినిధులు పెద్దఎత్తున హాజరయ్యారు. పూజలకు హాజరయ్యేవారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. యాగానికి వచ్చిన భక్తులందరికీ ప్రసాదాలతోపాటు ప్రత్యేకంగా భోజనాలు కూడా ఏర్పాటు చేశారు. భోజన సమయానికి వచ్చే ప్రతీ ఒక్కరు భోజనం చేసి వెళ్లాలని ముఖ్యమంత్రి కేసీఆర్ తన సిబ్బందికి ఆదేశించడమే కాకుండా తాను స్వయంగా వచ్చి భోజనం అందుతున్న తీరును గమనించారు. బుధవారం ఆయన స్వయంగా భోజ నం చేస్తున్న భక్తులను, అతిథులను పలకరించారు. మహిళలకు, పురుషులకు వేర్వేరుగా భోజనశాలలను ఏర్పాటుచేశారు. రుత్విక్కుల కోసం కూడా ప్రత్యేకంగా ఏర్పాటుచేశారు. యాగం శుక్రవారం పూర్ణాహుతితో పూర్తవుతుంది. ఈ కార్యక్రమానికి విశాఖ శారదాపీఠాధిపతి స్వామి స్వరూపానందేంద్ర సరస్వతి రానున్నారు.

సాగర్‌నీటిపై ఏపీ కన్ను

- ఎండీడీఎల్ దిగువన నీటికోసం పన్నాగం
- కుడికాల్వకు మరో ఐదు టీఎంసీల ఇండెంట్
- ఏపీ కుట్రతో అప్రమత్తమైన తెలంగాణ
- కృష్ణాబోర్డుకు ముందస్తు లేఖరాసిన ఈఎన్సీ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నాగార్జునసాగర్ నీటి వినియోగంపై ఏపీ తన కపటవైఖరిని కొనసాగిస్తూనే ఉన్నది. నీటినిల్వలు ఉన్నప్పుడు పోతిరెడ్డిపాడుద్వారా ఎడాపెడా నీటిని తరలించుకుపోతున్న ఏపీ.. ఆపై తాపీగా వాటా లెక్కలు చూసుకుంటున్నది. రిజర్వాయర్ల కనీస నీటి సేకరణ స్థాయి (ఎండీడీఎల్) ఎగువన తన వాటా అయిపోగానే.. ఎండీడీఎల్ దిగువన నీటిని కూడా వాడుకుంటామని లేఖలు రాయటం ఏపీకి ఆనవాయితీగా మారింది. యాసంగి పంటలు, తాగు అవసరాలకోసం సాగర్ కుడికాల్వ కింద అదనంగా ఐదు టీఎంసీలు కావాలని ఏపీ ఈఎన్సీ వెంకటేశ్వర‌రావు బోర్డు సభ్య కార్యదర్శికి లేఖరాశారు. దీనిని ముందే గ్రహించిన తెలంగాణ నీటిపారుదల శాఖ.. సాగర్ కుడికాల్వ కింద.. ఎండీడీఎల్ ఎగువన వాటా మేరకే విడుదలచేస్తామని బోర్డుకు తెలిపింది.

వాటా నీటిని ముందే వాడేసిన ఏపీ

శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో ఎండీడీఎల్ ఎగువన గత నెల 21న ఉన్న నీటినిల్వల ఆధారంగా తెలంగాణకు 33.400 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 46.900 టీఎంసీల విడుదలకు కృష్ణాబోర్డు ఉత్తర్వులిచ్చింది. ఈ నెల 21 వరకు అందులో తెలంగాణ 13.523 టీఎంసీలు వాడుకోగా, ఇంకా 33.377 టీఎంసీల వాటా ఉన్నది. ఆంధ్రప్రదేశ్ 22.309 టీఎంసీలు వాడుకోగా ఇంకా 11.091 టీఎంసీల వాటా ఉన్నది. ఇందులో సాగర్ కుడికాల్వ కింద ఏపీకి 18.61 టీఎంసీలకు బోర్డు ఉత్తర్వులు ఇచ్చింది. అందులో ఈ నెల 21 వరకు 14.631 టీఎంసీలను ఏపీ వాడుకున్నది. అంటే ఇంకా కేవలం 3.979 టీఎంసీలు వాడుకునేందుకే ఏపీకి అవకాశం ఉన్నది. పైగా ఎండీడీఎల్ ఎగువన అసలు ఏపీకి వాటాలేదు. ఇదే విషయాన్ని ఈ నెల 21న తెలంగాణ ఈఎన్సీ మురళీధర్‌రావు కృష్ణాబోర్డుకు రాసిన లేఖలో స్పష్టంచేశారు. బోర్డు ఉత్తర్వుల ప్రకారం 3.979 టీఎంసీలు మాత్రమే సాగర్ కుడికాల్వకు విడుదలచేయాల్సి ఉందని, ఈ ఏడాది మే వరకు ఉన్న నీటి అవసరాల దృష్ట్యా ఏపీకి కుడికాల్వ కింద అంతకంటే ఎక్కువ ఇవ్వలేమని ఏపీకి స్పష్టం చేయాలని పేర్కొన్నారు.

అదనంగా ఐదు టీఎంసీలు ఇవ్వండి..

తెలంగాణ ఈఎన్సీ లేఖరాసిన మరుసటిరోజే బుధవారం ఏపీ ఈఎన్సీ వెంకటేశ్వరరావు బోర్డుకు ఇండెంట్ సమర్పించారు. ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో సాగర్ కుడికాల్వ కింద 4.54 లక్షల ఎకరాల్లో వరి, మిర్చి సాగుచేస్తున్నారని, దీనితోపాటు తాగునీటి అవసరాలు కూడా ఉన్నాయని ఇండెంట్‌లో పేర్కొన్నారు. కుడికాల్వ కింద కేవలం 3.979 టీఎంసీల వాటా మాత్రమే ఉన్నదని, అది సరిపోనందున అదనంగా ఐదు టీఎంసీలు విడుదల చేయాలని కోరారు. పైగా.. ఎండీడీఎల్ ఎగువన ఏపీకి వాటా లేనందున, ఎండీడీఎల్ దిగువన 5 టీఎంసీల నీటిని వాడుకునేందుకు అనుమతినివ్వాలని కోరారు.

ముందు తెలియదా?

శ్రీశైలంలో నీటి నిల్వలు ఉన్నపుడు బోర్డు అనుమతించినా లేకున్నా పోతిరెడ్డిపాడుద్వారా ఎడాపెడా వాడేయటం ఏపీ ఏటా చేస్తున్న వ్యవహారమే. శ్రీశైలం వంతు అయిపోగానే.. సాగర్ కుడికాల్వ, డెల్టా కింద భారీ ఎత్తున ఇండెంట్లు పెట్టి నీటిని వాడుకుంటుంటుంది. వాస్తవానికి జలాశయాల్లోని నీటినిల్వలు, తాగు, సాగునీటి అవసరాలను బేరీజు వేసుకొని ఇండెంట్లు సమర్పించాలని బోర్డు మొదటినుంచీ చెప్తున్నది. తెలంగాణ ప్రణాళికాబద్ధంగా నీటిని వాడుకుంటుండగా, ఆంధ్రప్రదేశ్ ఇవేవీ పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా యాసంగిలో కుడికాల్వ కింద ఎంతమేర పంటలు వేస్తారనేది ఏపీ జలవనరులశాఖకు తెలియనిది కాదు. దాంతో అటు పోతిరెడ్డిపాడుద్వారా నీటి వాటాను తగ్గించుకొని, దిగువన కుడికాల్వ కింద వాడుకోవాలి. అది సాధ్యంకాకపోతే సాగర్ నుంచి ప్రణాళికాబద్ధంగా నీటిని వాడుకోవాలి. గత నెల కుడికాల్వ కింద 18.61 టీఎంసీల ఇండెంట్ సమర్పించిన ఏపీ అధికారులకు ఆ పరిమాణం సరిపోతుందా? లేదా? అనేది తెలియనిది కాదు. అవేవీ పట్టించుకోకుండా ఆ వాటా పూర్తికావస్తున్న సమయంలో ఎండీడీఎల్ ఎగువన వాటా లేకపోయినా దిగువన వాటా కోరడమనేది ఏపీ అధికారులు ముందుగా రచించిన పన్నాగమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎలాగూ శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు భారీగా తగ్గాయి. దీంతో సాగర్‌లో ఉన్న జలాలను ఈ ఏడాది ఆగస్టు వరకు తాగునీటి అవసరాలకు వాడుకోవాలి. కానీ జనవరి ముగియకముందే సాగర్ జలాశయంలో ఎండీడీఎల్ దిగువన నీటిని తోడేందుకు ఏపీ సిద్ధమవడం.. బోర్డు పర్యవేక్షణ లోపభూయిష్టంగా ఉన్నదనేందుకు నిదర్శనంగా నిలుస్తుంది. అంతే కాదు.. ఎండీడీఎల్ దిగువన వాటా అంటూ రంగంలోకి దిగే ఏపీ.. ఆ సాంకేతిక అంశం మాటున ఎండీడీఎల్ ఎగువన ఉన్న తెలంగాణ వాటాకు ఎసరుపెట్టే ప్రమాదమూ లేకపోలేదన్న చర్చ జరుగుతున్నది.



స్టాంపుల సొమ్ము స్వాహా

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రిజిస్ట్రార్ పరిధిలో వెలుగుచూసిన మోసం
- అసిస్టెంట్ రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ సహా ఐదుగురి సస్పెన్షన్
- ఐదేండ్లుగా రూ. 90 లక్షలు గోల్‌మాల్
- రూ. 12 లక్షలు రికవరీ చేసిన అధికారులు

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్టాంపుపేపర్లు విక్రయించగా వచ్చిన సొమ్మును ఖజానాకు జమచేయకుండా సొంతానికి వాడుకుంటున్న వైనం వెలుగులోకి వచ్చింది. ఐదేండ్లుగా దాదాపు రూ.90 లక్షలు స్వాహా అయినట్టు వెల్లడయింది. ఈ వ్యవహారంలో ఐదుగురు అధికారులను సస్పెండ్ చేయాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ కమిషనర్ చిరంజీవులు ఆదేశాల మేరకు రిజిస్ట్రేషన్‌శాఖ కరీంనగర్ డీఐజీ ట్వింకల్ జాన్ ఉత్తర్వులు జారీచేశారు. ఆదిలాబాద్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, లక్సెట్టిపేట, భైంసా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్‌కు అవసరమైన స్టాంపుపేపర్లను అమ్మగా వచ్చిన సొమ్మును 2014 నుంచి ఖజానాకు జమచేయడంలేదు. ఇటీవల నిర్వహించిన ఆడిట్‌లో ఈ విషయం బయటపడటంతో జిల్లా రిజిస్ట్రార్ ఆదిలాబాద్ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు ఆడిట్‌లో జరిగిన రూ.78 లక్షలకు సంబంధించిన రికార్డులు సరిగా లేకపోవడంతో రిజిస్ట్రార్ కార్యాలయం ఉద్యోగులు ఇంతియాజ్‌తోపాటు కపిల్‌ను అరెస్టు చేశారు. ఈ కుంభకోణంలో కార్యాలయ ఉద్యోగుల హస్తం ఉందన్న అనుమానంతో లోతుగా విచారణ జరిపించేందుకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ.. కరీంనగర్ డీఐజీ ట్వింకల్‌జాన్‌ను నియమించింది. బుధవారం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆయన జరిపిన విచారణలో జిల్లాలోని వివిధ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్టాంపుల అమ్మకాల ద్వారా వసూలైన సొమ్మును ట్రెజరీకి జమచేయకుండా సొంతానికి వాడుకున్నట్టు తేలింది. స్వాహాఅయిన సొత్తులో రూ.12 లక్షలను తిరిగి వసూలు చేశారు. ఇంత పెద్దమొత్తంలో కుంభకోణం జరిగినా పట్టించుకోలేదనే కారణంతో.. క్రమశిక్షణా చర్యల్లో భాగంగా ఆదిలాబాద్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఇమ్రాన్ ఖాన్, సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, జూనియర్ అసిస్టెంట్ అరుణ్‌కుమార్, నిర్మల్ జిల్లా భైంసా సబ్‌రిజిస్ట్రార్ సాయినాథ్, లక్సెట్టిపేట ఎస్‌ఆర్‌వో మనోహర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా రిజిస్ట్రార్ జైవంత్‌ను విధుల నుంచి తప్పించి ఆయన స్థానంలో హైదరాబాద్‌కు చెందిన రిజిస్ట్రార్ ఎం రవీందర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికే పలువురు ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌లుగా కొనసాగడంతో పెద్దఎత్తునే కుంభకోణం జరిగి ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మోసాలకు పాల్పడిన అధికారుల నుంచి రికవరీ చేసిన వివరాలు

అధికారి	మోసంజరిగింది (రూ.లో)	రికవరీ చేసినది	రికవరీ చేయాల్సినది
కే చంద్రశేఖర్	23,02,387	0	23,02,387
ఇమ్రాన్‌ఖాన్	13,76,953	2,47,500	11.29,453
ఆర్ సాయినాథ్	5,29,048	31,500	4,97,548
వీ అరుణ్‌కుమార్	10,98,150	0	10,98,150
జే మనోహర్	17,88,507	1,54,000	16,34,507
జే జయవంత్‌రావు	18,50,315	7,37,100	11,13,215
కే కల్పన	15,500	15,500	0
బీ సుజాత	12,000	12,000	0
సీహెచ్ కవిత	40,000	40,000	0
	90,12,860	**12,37,600**	**77,75,260**

కొలువుల భర్తీకి కొత్తవేగం

మొదటిపేజీ తరువాయి...

17న ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీచేసింది. వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి దీనికి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ మెంబర్ సెక్రటరీగా ఉంటారు. ఈ బోర్డుకు సపోర్టింగ్ స్టాఫ్ 14 మందిని డిప్యుటేషన్ కింద, ఇద్దరు చీఫ్ ప్రోగ్రామర్లను కాంట్రాక్ట్ పద్ధతిన, నలుగురు డీఈవోలను, మరో నలుగురు ఆఫీస్ సబార్డినేట్లను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించుకోవడానికి ఈ ఉత్తర్వుల్లో అనుమతి ఇచ్చింది. ఈ బోర్డు ద్వారా ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్యులు, నర్సింగ్ స్టాఫ్ భర్తీ ప్రక్రియలో వేగం పెరుగనున్నది.

కొలువుల భర్తీని అడ్డుకుంటున్న విపక్షాలు

వాస్తవంగా టీఎస్‌పీఎస్సీ ద్వారా ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ప్రభుత్వం నిర్వహిస్తున్నది. ఇప్పటికే దాదాపు 65 వేల పైచిలుకు ఉద్యోగాలను భర్తీచేసింది. 9,355 గ్రామ పంచాయతీ కార్యదర్శుల నియామక ప్రక్రియ పూర్తయినప్పటికీ న్యాయ వివాదం కారణంగా నియామక ఉత్తర్వులు ఇవ్వకుండా నిలిపివేయాల్సి వచ్చింది. టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ విడుదలచేసిన తరువాత విపక్షాలు ఏదో ఒకదశలో న్యాయవివాదాలు సృష్టించి ఉద్యోగాల భర్తీ ప్రక్రియను అడ్డుకుంటున్నాయి. తాజాగా గ్రామ పంచాయతీ కార్యదర్శుల నియామకాన్ని కూడా న్యాయవివాదంలోకి లాగారు. దీంతో ప్రక్రియ అంతా పూర్తయినప్పటికీ నియామకపు ఉత్తర్వులు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. దీనితో కీలకమైన శాఖలు స్వయంగా ఉద్యోగ నియామకాలు చేసుకోవడానికి వీలుగా ప్రత్యేక బోర్డులను ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఈ బోర్డుల ద్వారా నియామకాల ప్రక్రియ ఎలాంటి వివాదాలు లేకుండా పూర్తవుతున్నది. ఈ నేపథ్యంలోనే వైద్యరంగంలో నియామకాలకు కూడా ప్రత్యేకంగా బోర్డును ప్రభుత్వం ఏర్పాటుచేసింది. దీంతో ఉద్యోగ నియామకాలు వేగంగా జరుగుతాయని భావిస్తున్నారు.

ముహూర్తం



సూర్యోదయం: 6.53 గంటలకు



సూర్యాస్తమయం: 6.03 గంటలకు

విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, కృష్ణపక్షం, చతుర్థి రాత్రి 8.56 వరకు, తదుపరి పంచమి, నక్షత్రం: పుబ్బ సాయంత్రం 6.22 వరకు, తదుపరి ఉత్తర, అమృతఘడియలు: మధ్యాహ్నం 12.37 నుంచి 2.13 వరకు, రాహుకాలం మధ్యాహ్నం 1.52 నుంచి 3.16 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 3.04 నుంచి సాయంత్రం 4.34 వరకు, వర్జ్యం: తె. 3.59 నుంచి 5.35 వరకు, తిరిగి సాయంత్రం 6.44 నుంచి రాత్రి 8.20 వరకు.

లోకం పోకడ



'లంచం' అనే ఎరకు చిక్కాడు!

తెలంగాణలో ఏపీ వార్తలెందుకు?

మొదటిపేజీ తరువాయి...

కూడా అనుకోవటంలేదని స్పష్టంచేశారు. శాసనసభ్యుడిగా ఎన్నికైన జర్నలిస్టు క్రాంతికిరణ్ అభినందన సభ బుధవారం పబ్లిక్‌గార్డెన్స్‌లోని ఇందిరాప్రియదర్శిని ఆడిటోరియంలో టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 'అస్తిత్వ పోరాటంచేసి రాష్ట్రాన్ని సాధించుకున్న తర్వాత కూడా తెలంగాణలో తెల్లారిలేస్తే ఆంధ్ర వార్తలే కనిపిస్తున్నాయి. ఇక్కడి పత్రికల్లో ఆంధ్ర వార్తలు ప్రచురిస్తే మాకేమీ అభ్యంతరం లేదు. కానీ.. ఆంధ్ర ఎడిషన్‌లోనూ తెలంగాణ వార్తలు ప్రచురించాలి కదా? ఢిల్లీకి పోయి తెలుగు పత్రికలు చూస్తే తెలంగాణ వార్తలే ఉండవు. ఆంధ్రా ఎడిషన్‌లో తెలంగాణ వార్తలు రాయనప్పుడు.. తెలంగాణలో ఆంధ్రా వార్తలెందుకు?' అని కేటీఆర్ ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌కు వంతపాడుతున్న పత్రికల గురించి సీఎం కేసీఆర్ మాట్లాడితే కొంతమందికి కోపం వస్తున్నదని అన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని అణువణువునా నింపుకొని పనిచేస్తున్న పత్రికలను ప్రభుత్వం తప్పకుండా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని గతంలో సీఎం కేసీఆర్ చెప్పిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. కొన్ని పత్రికలు, మీడియా సంస్థలు ఆధిపత్య ధోరణిని అవలంబిస్తూ తెలంగాణవాదాన్ని తొక్కిపట్టే ప్రయత్నం చేస్తున్నాయని, ఈ డ్రామాలు ఇంకా నడువబోవని హెచ్చరించారు. తెలంగాణ భావజాల పత్రికలకు పెద్దపీట వేయాల్సిన బాధ్యత తమపై ఉన్నదన్న కేటీఆర్.. దీనికి తెలంగాణ జర్నలిస్టుల సహకారం కూడా అవసరమన్నారు. ఆధిపత్య ధోరణిపై ఎలాంటి చర్యలు తీసుకున్నా.. 'మీడియా హక్కులను హరిస్తున్నారు.. మీడియా గొంతు నొక్కేస్తున్నారు.. మొత్తం మీడియా మీద దాడి..' అంటూ చిత్రీకరిస్తారని చెప్తూ.. అలాంటి అరాచకపు ప్రయత్నానికి మన జర్నలిస్టులు లొంగిపోవద్దని కోరారు.



బుధవారం పబ్లిక్‌గార్డెన్‌లో టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో టీఆర్ఎస్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్,దుబ్బాక ఎమ్మెల్యే రామలింగారెడ్డిని సన్మానిస్తున్న టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చిత్రంలో మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటాచక్రపాణి, తెలంగాణ టుడే ఎడిటర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

టీఆర్ఎస్‌లో జర్నలిస్టులకు సముచిత స్థానం

ఉద్యమ సమయం నుంచీ కూడా సీఎం కేసీఆర్ జర్నలిస్టుల పాత్రను గుర్తిస్తూ, ఎప్పటికప్పుడు అవకాశాలు కల్పించారని కేటీఆర్ గుర్తుచేశారు. 2004లో దుబ్బాక నుంచి పోటీకి అనేకమంది కోటీశ్వరులు దరఖాస్తు చేసుకున్నా పేద జర్నలిస్టు రామలింగారెడ్డికి అవకాశం ఇవ్వటం కేసీఆర్ నిబద్ధతకు నిదర్శనమన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా సంగారెడ్డికి చెందిన ఆర్ సత్యనారాయణకు అవకాశం ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. తెలంగాణ వచ్చిన తర్వాత ఘంటా చక్రపాణి వంటి ఎంతోమంది జర్నలిస్టులను ప్రభుత్వం తగిన గుర్తింపునిచ్చిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లోనూ విద్యార్థి నాయకులు బాల్క సుమన్, గ్యాదరి కిశోర్, పిడమర్తి రవి తదితరులకు టిక్కెట్లు ఇచ్చినట్టు చెప్పారు. జర్నలిస్టులకు ఏ రాష్ట్రప్రభుత్వమూ చేయనన్ని సంక్షేమ కార్యక్రమాలు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్నదన్నారు.

ప్రభుత్వంలో ఉన్నా... లేకున్నా... మీకు నేనున్నా...

జర్నలిస్టులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని కేటీఆర్ పునరుద్ఘాటించారు. 'గతంలో చెప్పిన. ఇప్పుడు చెప్తున్న.. నేను ప్రభుత్వంలో ఉన్నా లేకున్నా, మీ సమస్యల పరిష్కార బాధ్యత నాది. అన్ని సమస్యలు పరిష్కరించుకుందాం' అని జర్నలిస్టులకు భరోసానిచ్చారు.

టీఆర్ఎస్ పథకాలను కాపీ కొడుతున్న చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబుకు టైమ్ దగ్గర పడిందని, ఎన్నికల్లో గెలిచేందుకు తెలంగాణలో టీఆర్ఎస్ అమలు చేసిన పథకాలను కాపీ కొడుతున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. 'ఏపీలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇస్తూ చంద్రబాబు జీవో ఇచ్చిండని క్రాంతి చెప్తున్నడు.. చంద్రబాబువి ఆపదమొక్కులు. ఆయన ఓడిపోయే టైం దగ్గరపడ్డది కాబట్టి ఆ విధంగా చేస్తున్నడు. టీఆర్ఎస్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను యథాతథంగా కా పీ చేస్తున్నడు' అని విమర్శించారు. చిత్తశుద్ధితో, కోర్టు వి వాదాలకు తావులేకుండా, భవిష్యత్‌లో ఎవరూ వేలెత్తి చూపకుండా మన జర్నలిస్టుల కోసం ఇండ్ల స్థలాలు, హెల్త్‌కార్డుల విషయంలో చర్యలు తీసుకుంటామని కేటీఆర్ చెప్పారు. వర్కింగ్ జర్నలిస్టుల సంఘ భవనం కోసం సీఎంను ఒప్పించేందుకు ప్రయత్నిస్తానన్నారు.

ప్రజలతోపాటు జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తా : ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

శాసనసభ్యునిగా ఎన్నికైనప్పటికీ జర్నలిస్టుల సమస్యలను పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే క్రాంతికిరణ్ హామీ ఇచ్చారు. దుష్ప్రచారాలను తీవ్రంగా ఖండించాలని టీయూడబ్ల్యూజే సభ్యులకు సూచించారు. పూర్వ జర్నలిస్టు, ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ రవాణాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు, బస్‌పాసులను ఇప్పించారని గుర్తుచేశారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ.. క్రాంతికిరణ్ ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కూడా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికే పరిమితం కావద్దని, ప్రజాసమస్యలపై ఎక్కువ దృష్టిపెట్టాలని సూచించారు. తెలంగాణ టుడే ఎడిటర్ శ్రీనివాస్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన క్రాంతికిరణ్‌కు అభినందనలు తెలిపారు. జర్నలిస్టులెప్పుడూ ఫాల్ట్ ఫైండింగ్ మిషన్‌గానే కాకుండా ఫ్యాక్ట్ ఫైండింగ్ మిషన్‌లా కూడా పని చేయాలన్నారు. ఈ సందర్భంగా క్రాంతికిరణ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు బండారు శ్రీనివాస్‌రావు, కే శ్రీనివాస్, రమణ, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

100 కోట్ల సంక్షేమ నిధి ఏ రాష్ట్రంలోనూ లేదు

జర్నలిస్టులకు వంద కోట్ల సంక్షేమ నిధి తెలంగాణలో మినహా మరెక్కడా లేదని మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ చెప్పారు. కాంగ్రెస్‌కు అమ్ముడుపోయి నోళ్లు, కాంగ్రెస్ కండువా కప్పుకొన్నోళ్లు అబద్ధపు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. జర్నలిస్టులకు అండగా సీఎం కేసీఆర్, కేటీఆర్ ఉన్నారని చెప్పారు.





కొలువుదీరిన
రాజశ్యామల అమ్మవారు

సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని సీఎం కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో నిర్వహిస్తున్న మహారుద్రసహిత సహస్ర చండీయాగం మూడోరోజైన బుధవారం పూజలో పాల్గొన్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, శోభ దంపతులు



మనుమడు హిమాన్షుతో
సీఎం కేసీఆర్ సతీమణి శోభ





మహారుద్రసహిత సహస్ర చండీయాగం పూజలో అమ్మవారికి హారతి ఇస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు దంపతులు

మహారుద్రసహిత సహస్ర చండీయాగం పూజలో పాల్గొన్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు దంపతులు, మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి దంపతులు, ప్రభుత్వ సలహాదారు అనురాగ్ శర్మ తదితరులు ఉన్నారు.



దంపతి పూజలో భాగంగా ప్రముఖ అష్టావధాని, సరస్వతీ ఉపాసకుడు అష్టకాల నరసింహరామశర్మ దంపతులకు పసుపు కుంకుమ, గంధం అందజేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ సతీమణి శోభ



చండీయాగంలో భాగంగా అమ్మవారి హారతి స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు దంపతులు. చిత్రంలో సీఎం కేసీఆర్ మనుమలు హిమాన్షు, ఆదిత్య కూడా ఉన్నారు



యాగానికి హాజరైన నమస్తే తెలంగాణ సీఎండీ దీవకొండ దామోదర్‌రావు, బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ప్రముఖ వాస్తు నిపుణుడు సుద్దాల సుధాకర్ తేజ



చండీయాగంలో పాల్గొన్న నిజామాబాద్ ఎంపీ కవిత, అనిల్‌కుమార్ దంపతులు, టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సతీమణి శైలిమ, రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్‌కుమార్, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి తదితరులు

ఏపీలో టీడీపీతో పొత్తు ఉండదు: కాంగ్రెస్

అమరావతి: తెలంగాణలో టీడీపీతో పొత్తు వికటించిన నేపథ్యంలో ఏపీలో జరిగే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగానే బరిలోకి దిగాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఎన్నికల్లో ఆ రాష్ట్ర అధికార పార్టీ టీడీపీతో ఎలాంటి పొత్తు ఉండబోదని ఏఐసీసీ జనరల్ సెక్రటరీ, కేరళ మాజీ సీఎం ఊమెన్ చాందీ స్పష్టంచేశారు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ సీట్లకు ఒంటరిగానే పోటీ చేస్తామని, టీడీపీతో పొత్తు జాతీయస్థాయిలో మాత్రమే ఉంటుందని ఆయన పేర్కొన్నారు. బుధవారం అమరావతిలో పీసీసీ ప్రతినిధులతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 31న మరోసారి భేటీఅయి ఎన్నికల సన్నద్ధతకు సంబంధించిన అంశాలపై చర్చిస్తామని చెప్పారు. ఫిబ్రవరిలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా బస్సుయాత్ర చేపట్టనున్నదని పేర్కొన్నారు.

కాళేశ్వరానికి 7785 కోట్ల పీఎఫ్‌సీ రుణం

అనుమతినిచ్చిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) నుంచి పొందిన భారీరుణానికి అనుమతినిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రాజెక్టులో భాగంగా గోదావరి నదిపై నిర్మిస్తున్న మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లతోపాటు పంపుహౌస్‌లను లింక్-1గా పరిగణిస్తారు. తాజాగా పీఎఫ్‌సీ నుంచి లింక్-1 పనులకు రూ.5405.39 కోట్ల రుణం వచ్చింది. దీనికి అనుమతినిస్తూ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్కే జోషి ఉత్తర్వులు జారీచేశారు. ప్యాకేజీ-21(ఏ)లో భాగంగా చేపడుతున్న పనులకు కూడా పీఎఫ్‌సీ నుంచి రూ. 2379.56 కోట్ల రుణం మంజూరైంది. దీనికి కూడా ప్రభుత్వం పాలనా అనుమతులిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

వీఆర్వో పీహెచ్‌సీ అభ్యర్థులకు 28 నుంచి వైద్య పరీక్షలు

టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో తేదీలవారీ షెడ్యూల్ వివరాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రామ రెవెన్యూ అధికారుల పోస్టులకు అర్హత సాధించిన దివ్యాంగ(పీహెచ్‌సీ) అభ్యర్థులకు వైద్య పరీక్షలు ఈ నెల 28 నుంచి 30 వరకు నిర్వహించనున్నట్టు టీఎస్‌పీఎస్సీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. దృష్టిలోపం ఉన్న వారికి హైదరాబాద్, మెహిదీపట్నంలోని సరోజిని కంటి వైద్యశాలలో, వినికిడి లోపం ఉన్నవారికి కోఠిలోని ఈఎన్టీ దవాఖానలో, కాళ్లు, చేతులకు సంబంధించిన వైకల్యం ఉన్నవారికి ఉస్మానియా జనరల్ దవాఖానలో వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపింది. అభ్యర్థుల తేదీల వారీ షెడ్యూల్‌ను www.tspsc.gov.inలో చూడవచ్చని సూచించింది.

కంటివెలుగు @1.35 కోట్లు

- 20,84,325 మందికి కండ్లద్దాలు పంపిణీ
- రాష్ట్రంలో విస్తృతంగా వైద్య శిబిరాల నిర్వహణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అంధత్వరహిత తెలంగాణ సాధన దిశగా రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాల్లో 1,35,62,571 మందికి పరీక్షలు నిర్వహించారు. పౌరులెవరూ కంటిచూపు కోల్పోవద్దన్న లక్ష్యంతో రాష్ట్రప్రభుత్వం వైద్య, ఆరోగ్యశాఖ అధ్వర్యంలో విస్తృతంగా కంటి వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నది. కార్యక్రమం ప్రారంభమైన నాటినుంచి బుధవారంవరకు రాష్ట్రవ్యాప్తంగా 8,143 గ్రామాల్లో, 669 వార్డుల్లో 1,35,62,571 మందికి కంటి పరీక్షలు చేయగా.. 20,84,325 మందికి కండ్లద్దాలను అందజేశారు. కాగా బుధవారం రాష్ట్రవ్యాప్తంగా 97,436 మందికి కంటి పరీక్షలు చేశారు.

కంటి వైద్య శిబిరాల్లో సేవలు పొందిన వారి సంఖ్య

క్యాటగిరీ	బుధవారం	మొత్తం శిబిరాల్లో
పరీక్షలు చేయించుకున్నవారు	97,436	1,35,62,571
రీడింగ్ అద్దాలు పొందినవారు	7,603	20,84,325
ప్రత్యేక అద్దాలకు ప్రతిపాదన	6,512	16,14,181
కంటి సమస్యలపై రెఫరల్	4,878	8,44,688



దగ్గరచూపు సమస్యతో బాధపడుతున్నా. ప్రభుత్వం ఉచితంగా కంటి వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నదని తెలిసి ఇక్కడకు వచ్చా. వైద్యులు పరీక్షలు చేసి.. కండ్లద్దాలు అవసరమని గుర్తించి వెంటనే ఇచ్చారు. ఇప్పుడు కండ్లు బాగా కనపడుతున్నాయి. - వెంకటరమణ, కొత్తగూడెం

దూరవిద్య బీఈడీకి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు

దరఖాస్తులకు ఫిబ్రవరి 15 తుది గడువు ▪ పది కేంద్రాల్లో 500 సీట్లకు అనుమతి

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్య విధానంలో 2018-19 విద్యా సంవత్సరానికి బీఈడీ అడ్మిషన్ల ప్రక్రియ మొదలైంది. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్లగొండ, మెదక్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల పరిధిలోని పది స్టడీ సెంటర్లలో ఒక్కో కేంద్రానికి 50 సీట్ల చొప్పున మొత్తం 500 సీట్లను కేటాయించనున్నారు. దూరవిద్య బీఈడీ ప్రవేశాలకు బుధవారంనాటికి ఆన్‌లైన్‌లో 110 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆసక్తిగల అభ్యర్థులు.. ముందుగా www.oucde.net లో ఫిబ్రవరి 15వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. రూ.200 ఆలస్యరుసుంతో ఫిబ్రవరి 20 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆయా కేంద్రాల్లోని రోస్టర్ ఆధారంగా ఎన్సీటీఈ నిబంధనల ప్రకారం సీట్లు కేటాయిస్తారు. దూరవిద్య విధానంలో బీఈడీ సీట్లకు సంబంధించి ఉన్న మెథడాలజీల ప్రకారం కోటాను నిర్దేశించారు. సాధారణంగా దూరవిద్య విధానంలో ఏ కోర్సు చదువాలనుకున్నా.. దేశంలోని ఏ ప్రాంతంవారైనా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది. కానీ, ఒక్క దూరవిద్య బీఈడీ లో మాత్రం తెలంగాణలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకే అవకాశం ఉంది. 2014 వరకు కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ పరిధిలో దూరవిద్య బీఈడీ కొనసాగింది. ఇది నిబంధనలకు విరుద్ధం కావడంతో బీఈడీని ఎన్సీటీఈ రద్దు చేసింది. దూరవిద్య విధానం ఆధ్వర్యంలోనే దూరవిద్య కోర్సులను నిర్వహించాలని తేల్చిచెప్పింది. ఓయూ దూరవిద్య విభాగం డైరెక్టర్ చింతా గణేశ్ ప్రత్యేక ఆసక్తితో ఎన్సీటీఈ అధికారులను వర్సిటీకి రప్పించి.. తీవ్ర ప్రయత్నాల అనంతరం తిరిగి 2018-19లో దూరవిద్యలో బీఈడీని ప్రవేశపెట్టేందుకు అనుమతినిచ్చింది.

> అభ్యర్థులు తెలంగాణ ప్రాంతానికి చెందినవారై ఉండాలి. సీట్ల కేటాయింపు మార్చి లోపు పూర్తిచేస్తాం. వేసవిలో తరగతులు ప్రారంభమవుతాయి. ఏటా రెండుసార్లు వేసవి, శీతాకాలంలో నేరుగా విద్యార్థులకు పాఠాలు బోధించేలా చూస్తున్నాం.
> - చింతా గణేశ్, డైరెక్టర్, ఓయూ డిస్టెన్స్ ఎడ్యుకేషన్

ఇంటర్ ఫస్టియర్‌కు ఆన్‌లైన్ ప్రశ్నపత్రాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఇంటర్ పరీక్షల నిర్వహణలో ఆన్‌లైన్ విధానాన్ని అమలుచేయడంలో భాగంగా ప్రశ్నపత్రాలను ఆన్‌లైన్‌లో పంపిణీ చేసే ప్రక్రియకు ఇంటర్మీడియట్ బోర్డు పూనుకుంది. ఈ నెల 28న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్, 31న ఎన్విరాన్‌మెంటల్ విద్యకు సంబంధించిన రెండు పరీక్షలకు తొలిసారి ఈ విధానం అమలు చేయబోతున్నారు. 2018-19 విద్యాసంవత్సరం నుంచే అమలుకు నిర్ణయం తీసుకున్నామని బుధవారం ఇంటర్‌బోర్డు సెక్రటరీ ఏ అశోక్ తెలిపారు. పరీక్ష ప్రారంభానికి అరగంట ముందు ఆన్‌లైన్‌లో ప్రశ్నపత్రాలు అందుబాటులో ఉంటాయి. యూజర్‌ఐడీ, పాస్‌వర్డ్‌ల ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవడానికి ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లకు అధికారాలు ఇచ్చారు. వాటిని జిరాక్స్ తీసి పరీక్షలు రాసే విద్యార్థులకు పంపిణీ చేయాలని ఆదేశించారు. పరీక్షలను ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు నిర్వహిస్తామని, కాలేజీ లాగిన్/bie.telengana.gov.in ద్వారా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని బోర్డు సెక్రటరీ తెలిపారు. పాత విద్యార్థులు కూడా ఈ పరీక్షలకు హాజరు కావాలనుకుంటే గతంలో జారీఅయిన హాల్‌టికెట్ల నంబర్లతోనే డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. రెండు పరీక్షల్లో అర్హత సాధించడం తప్పనిసరని కాలేజీలకు సమాచారం అందించారు.



చక్రం తిప్పేది వీరేనా?

వచ్చే లోక్‌సభలో హంగ్ ఏర్పడుతుందంటూ విశ్లేషకుల అంచనాలు

కేసీఆర్, జగన్, నవీన్‌ల మద్దతుతోనే సర్కారు ఏర్పడే అవకాశం

న్యూఢిల్లీ, జనవరి 23: వచ్చే లోక్‌సభ ఎన్నికల తర్వాత హంగ్ పార్లమెంట్ ఏర్పడనుందన్న అంచనాల నేపథ్యంలో కేంద్రంలో ఏర్పడబోయే ప్రభుత్వానికి తటస్థ పార్టీల మద్దతు కీలకం కానుంది. వచ్చే ఎన్నికల కోసం ఎన్డీయే పక్షాలు ఒకవైపు, దానికి వ్యతిరేకంగా ఎన్డీయేయేతర పార్టీలు మరోవైపు సిద్ధమవుతున్నాయి. ఈ రెండు కూటములలో ఏది అత్యధిక సీట్లు గెలుచుకున్నా సంపూర్ణ మెజారిటీని మాత్రం సాధించే అవకాశాలు లేవు. దీంతో ఏ కూటమిలోనూ భాగస్వాములుగా లేని తటస్థ పార్టీలు కీలకంగా మారే అవకాశాలున్నాయి. ఇటీవల కోల్‌కతాలో మమతా బెనర్జీ నిర్వహించిన విపక్షాల ఐక్యతా సభలో మూడు ప్రధాన ప్రాంతీయ పార్టీలు తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్‌ఎస్), వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ), బిజూ జనతాదళ్ (బీజేడీ) కనిపించలేదు. అటు ఎన్డీయేలోగానీ ఎన్డీయేయేతర కూటమిలో గానీ భాగస్వాములుగాలేని ఈ పార్టీలు మూడు రాష్ట్రాలు తెలంగాణ (టీఆర్‌ఎస్), ఆంధ్రప్రదేశ్ (వైసీపీ), ఒడిశా (బీజేడీ)లో పట్టు కలిగి ఉన్నాయి. ఈ మూడు రాష్ట్రాలలో కలిపి 63 లోక్‌సభ సీట్లుండగా, సింహభాగం స్థానాలను అవి గెలుచుకొనే అవకాశం ఉందని సర్వేలు తెలుపుతున్నాయి. దీంతో ఈ మూడు పార్టీల మద్దతుపైనే కేంద్రంలో తదుపరి ఏర్పడబోయే ప్రభుత్వ మనుగడ ఆధారపడి ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

కాంగ్రెస్‌కు ఎన్నడూ మద్దతునివ్వని బీజేడీ

1997లో ఏర్పడిన నాటి నుంచి బీజేడీ ఎన్నడూ కాంగ్రెస్ పార్టీకి మద్దతునివ్వలేదు. 1998 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో జట్టుకట్టిన ఆ పార్టీ 9 స్థానాలను గెలుచుకుంది. బీజేపీకి ఏడు లభించాయి. 2009 వరకూ బీజేపీతో పొత్తు కొనసాగించిన బీజేడీ అధినేత, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆ తరువాత ఒంటరిగా పోటీ చేయాలని నిర్ణయించారు. ఆయన నిర్ణయం గత ఎన్నికల్లో బీజేడీకి సీట్ల పంట పండించింది. అసెంబ్లీలో 145 సీట్లకు 103, లోక్‌సభలో 21 స్థానాలకు 14 ఆ పార్టీకి దక్కాయి. వచ్చే ఎన్నికల్లో మొత్తం 21 స్థానాలలోనూ బీజేడీ విజయం సాధించగలదని ఆ పార్టీ అంతర్గతంగా నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. పూర్వ చరిత్ర నేపథ్యంలో ఒకవేళ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి మద్దతునిచ్చినా అది వెలుపలి నుంచి మాత్రమేనని బీజేడీ సీనియర్ నేత చెప్పారు.

ఏపీకి హోదా ఎవరిస్తే.. వారికే మద్దతు: వైసీపీ

ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న వైసీపీ రాష్ట్ర ప్రాధాన్యాలకనుగుణంగా కేంద్రంలో ఏర్పడబోయే ప్రభుత్వానికి మద్దతునిచ్చే అంశంపై తమ నిర్ణయం ఉంటుందని అంటున్నది. ముఖ్యంగా ఏపీకీ ప్రత్యేక హోదాను ఎవరు ప్రకటిస్తే వారికే తమ మద్దతు అని ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు. దీంతో ఆ పార్టీ ఎన్నికలకు ముందు ఇటు కాంగ్రెస్ లేదా అటు బీజేపీతో జత కట్టే అవకాశాలు కనిపించడం లేదు. రాష్ట్రంలోని మొత్తం 25 లోక్‌సభ స్థానాల్లో ఆ పార్టీ సగానికి పైగా గెలుచుకోవచ్చని సర్వే అంచనాలు తెలుపుతున్నాయి. తదుపరి కేంద్ర ప్రభుత్వానికి తమ మద్దతు అవసరమైతే అది షరతులతో కూడినదై ఉంటుందని వైసీపీ నాయకుడొకరు పేర్కొన్నారు.

సమాన దూరం పాటిస్తున్న టీఆర్‌ఎస్

టీఆర్‌ఎస్ పార్టీ కాంగ్రెస్, బీజేపీలకు సమాన దూరాన్ని పాటిస్తున్నది. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కాంగ్రెస్, బీజేపీయేతర పార్టీలతో ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుకు కృషి చేస్తున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన టీఆర్‌ఎస్ ప్రస్తుతం జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో సైతం మెజార్టీ స్థానాలను గెలుచుకుంటున్నది. ఇదే ఊపు లోక్‌సభ ఎన్నికల్లో సైతం కొనసాగవచ్చని సర్వేలు తెలుపుతున్నాయి. రాష్ట్రంలోని మొత్తం 17 స్థానాల్లో టీఆర్‌ఎస్ 16 (మిగిలిన ఒకటి మిత్రపక్షం మజ్లిస్) గెలుచుకోగలదని భావిస్తున్న నేపథ్యంలో కేంద్రంలో ఏర్పడబోయే ప్రభుత్వానికి టీఆర్‌ఎస్ పార్టీ మద్దతు కీలకం కానుంది.

భారీ మంచు, వర్షాలతో
హిమాచల్ ఉక్కిరిబిక్కిరి



మనాలి/ జమ్ము కశ్మీర్ జనవరి 23: భారీగా కురుస్తున్న మంచు, వర్షాలతో హిమాచల్ ప్రదేశ్ ఉక్కిరిబిక్కిరి అవుతున్నది. ఎనిమిది జిల్లాల్లో ఈ సీజన్‌లోనే అత్యధికంగా మంచు కురిసింది. మరో నాలుగు జిల్లాలను భారీ వర్షాలు ముంచెత్తాయి. వీటికి తోడు చలిగాలుల తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు ప్రాంతాల్లో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ నెల 26 వరకు భారీగా మంచు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

జమ్ము కశ్మీర్ హైవేపై వందలకొద్దీ వాహనాలు..

జమ్ము కశ్మీర్‌ను మంచు కమ్మేసింది. దట్టంగా మంచు పేరుకుపోవడంతో శ్రీనగర్– జమ్ము జాతీయ రహదారి వెంట 270 కి.మీ పరిధిలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో వందలకొద్దీ వాహనాలు నిలిచిపోయాయి.కశ్మీర్ గేట్‌వేలోని జవహర్ టన్నెల్ వెంబడి భారీగా మంచు పేరుకుపోయింది. యంత్రాల సాయంతో మంచును తొలిగిస్తున్నారు.



నీటి ముత్యంలా ధగధగా మెరుస్తూ వయ్యారాలు వలుకబోస్తూ ప్రపంచ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునే నయాగరా జలపాతం గడ్డకట్టింది. అయినా దాని అందం ఏ మాత్రం తగ్గలేదు. తెల్లటి మంచు చీరెను కట్టుకున్నట్లు కనిపిస్తున్నది. కెనడా, అమెరికా సరిహద్దుల్లో ఉన్న ఈ జలపాతంలోని కొంతభాగం.. ప్రస్తుత చలికాలంలో ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోవడంతో గడ్డకట్టింది. దీంతో కొత్త సోయగాలు ఒలికిస్తున్న నయాగరాను చూడటానికి పర్యాటకులు పరుగులు తీస్తున్నారు. తమ కెమెరాలో దాని అందాలను బంధిస్తున్నారు.

ఓబీసీ క్రీమీలేయర్ కన్నా ఈబీసీ అర్హతలు కఠినం!

న్యూఢిల్లీ, జనవరి 23: అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారి కోసం ప్రకటించిన10 శాతం రిజర్వేషన్ల (ఈబీసీ) కోటాకు అర్హతల ప్రాతిపదిక ఓబీసీ కోటా విధానంతో సమానంగా ఉంటుందని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. రూ.8 లక్షల వార్షికాదాయం వచ్చే కుటుంబాలు ఈబీసీ రిజర్వేషన్లకు అర్హులని కేంద్ర సిబ్బంది, శిక్షణ మంత్రిత్వ శాఖ జారీ చేసిన మెమోరాండం పేర్కొంటున్నది. ఆదాయం అనగా అన్ని వనరుల నుంచి లభించేదని నిర్వచించింది. ఓబీసీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్‌కు విధించిన పరిమితుల కన్నా ఇది మరింత కఠినమైనదని విశ్లేషకులు పేర్కొంటున్నారు. రూ.8 లక్షలు లేదా అంతకన్నా అధిక ఆదాయం పొందే వ్యక్తులు ఓబీసీ క్రీమీలేయర్ పరిధిలోకి వస్తారు. వీరి ఆదాయంలో కుటుంబంలోని ఇతరుల వేతనాలు లేదా వ్యవసాయ భూములను పరిగణనలోకి తీసుకోరు. కానీ ఈబీసీ కోటా విషయంలో మాత్రం వీటినే లెక్కించనున్నారు. ఈబీసీ రిజర్వేషన్‌కు అర్హత పొందాలంటే కుటుంబంలోని అందరి ఆదాయాలు, వ్యవసాయ భూములనుంచి లభించే ఆదాయం కూడా ఏటా రూ.8 లక్షలకు మించకూడదు. పైగా ఐదెకరాల వ్యవసాయ భూమి, వెయ్యి గజాల్లో నివాస స్థలం, నోటిఫైడ్ మున్సిపాలిటీలో 100 గజాల ప్లాటు ఉన్నా ఈబీసీ కోటాకు అర్హులు కారు. ఈ కఠిన నిబంధనల కారణంగా ఎస్సీ/ఎస్టీ/ఓబీసీయేతరులలోని అత్యధికులు ముఖ్యంగా దిగువ మధ్యతరగతి వర్గాల వారు ఈడబ్ల్యూఎస్ కోటాకు అర్హత పొందలేకపోతారని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

గీతా గోపీనాథ్‌కు ప్రవాస భారతీయ సమ్మాన్ అవార్డు

- **మరో 29 మందికి కూడా.. రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారం**
- **దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని ఎన్నారైలకు కోవింద్ పిలుపు**



వారణాసి, జనవరి 23: భారతీయ అమెరికన్, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) చీఫ్ ఎకనమిస్ట్ గీతా గోపీనాథ్, నార్వే ఎంపీ హిమాంశు గులాటీ, దక్షిణాఫ్రికా దౌత్యవేత్త అనిల్ సూక్‌లాల్ 'ప్రవాస భారతీయ సమ్మాన్' పురస్కారానికి ఎంపికయ్యారు. వీరితోపాటు మొత్తం 30 మంది ప్రవాస భారతీయులు, భారత సంతతి వ్యక్తులు ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసిలో మూడు రోజుల పాటు జరిగిన ప్రవాసీ భారతీయ దివస్‌లో ఈ అవార్డులకు ఎంపికయ్యారు. టెక్నాలజీ రంగంలో కెన్యాలో స్థిరపడిన పీ వీ సాంబశివరావు, పోలండ్‌కు చెందిన పారిశ్రామికవేత్త మద్దుకూరి జగదీశ్వర్‌రావు కూడా ఈ అవార్డులను అందుకున్న వారిలో ఉన్నారు. బుధవారం జరిగిన ప్రవాసీ భారత్ దివస్ సదస్సు ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఈ అవార్డులను ప్రదానం చేశారు. సమావేశాలకు హాజరు కాని గీతా గోపీనాథ్‌తోపాటు ముగ్గురు మాత్రం అవార్డులను అందుకోలేదు. సదస్సు ముగింపు సందర్భంగా కోవింద్ మాట్లాడుతూ భారత్‌లోని 100 కోట్ల ఆలోచనలతో మమేకమై దేశ ప్రగతిలో భాగస్వాములు కావాల్సిందిగా ఎన్నారైలు, భారత సంతతి వ్యక్తులకు పిలుపునిచ్చారు.

ఈవీఎంల హ్యాకింగ్‌తో నా సోదరి
హత్యకు సంబంధం లేదు

గౌరీ లంకేశ్ సోదరి కవితా లంకేశ్ వెల్లడి



బెంగళూరు, జనవరి 23: తన సోదరి గౌరీ లంకేశ్ హత్యకు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం)ల హ్యాకింగ్‌కు సంబంధం ఉన్నదని సైబర్ నిపుణుడిగా ప్రకటించుకున్న సయ్యద్ సుజా చేసిన ఆరోపణలను ఆమె సోదరి కవితా లంకేశ్ కొట్టి పారేశారు. ఈవీఎంల హ్యాకింగ్ గురించి తమ పత్రికల్లో వెల్లడించడానికి సిద్ధమయ్యారని తెలియడం వల్లే గౌరీ లంకేశ్ హత్యకు గురయ్యారని సయ్యద్ సుజా చెప్పిన సంగతి తెలిసిందే. దీనిపై బుధవారం కవితా లంకేశ్ పీటీఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ 'ఈ విషయం గురించి నేను పూర్తి అవగాహనతో ఉన్నా. ఇది పూర్తిగా అసత్యం. ఇటువంటి అంశాలకే నా సోదరిని లక్ష్యంగా చేసుకున్నారనంటే నేను నమ్మబోను' అని చెప్పారు.

రూ.689 కోట్ల విరాళాలకు లెక్కలు లేవు

- **2017-18లో ఆరు జాతీయ పార్టీలకు రూ.1,293 కోట్ల విరాళాలు**
- **ఏడీఆర్ వెల్లడి**

న్యూఢిల్లీ, జనవరి 23: పలు జాతీయ పార్టీలకు 2017-18లో అందిన విరాళాల్లో దాదాపు 50 శాతానికిపైగా నిధులు గుర్తుతెలియని వ్యక్తులు, సంస్థల నుంచి వచ్చాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) తెలిపింది. ఈ విరాళాల్లో ఎలక్టోరల్ బాండ్స్, స్వచ్ఛందంగా అందజేసే నగదు ఉన్నాయని పేర్కొంది. దేశంలోని ఆరు ప్రధాన జాతీయ పార్టీలు ఎన్నికల సంఘానికి సమర్పించిన విరాళాల వివరాలు, ఆదాయపన్ను శాఖకు సమర్పించిన రిటర్న్‌లను పరిశీలించిన అనంతరం ఏడీఆర్ బుధవారం ఈ వివరాలను వెల్లడించింది. బీజేపీ, కాంగ్రెస్, సీపీఐ, బీఎస్పీ, టీఎంసీ, ఎన్సీపీ పార్టీలకు కలిపి 2017-18లో రూ.1,293.05 కోట్లు విరాళాల రూపంలో అందాయని ఏడీఆర్ తెలిపింది. ఇందులో రూ.689.44 కోట్లు గుర్తుతెలియని వ్యక్తులు, సంస్థల నుంచి అందాయని, మొత్తం విరాళాల్లో ఇది 53 శాతమని పేర్కొంది. కేవలం బీజేపీకే గుర్తుతెలియని వ్యక్తులు, సంస్థల నుంచి రూ.553.38 కోట్లు విరాళాలుగా అందాయని ఏడీఆర్ వెల్లడించింది. అజ్ఞాత విరాళాల్లో దాదాపు 80 శాతం విరాళాలు బీజేపీకే వచ్చాయని పేర్కొంది.

ఔషధాల ధరలపై త్వరలో కమిటీ

న్యూఢిల్లీ, జనవరి 23: ప్రజలకు అందుబాటు ధరల్లో ఔషధాలు, ఆరోగ్య పరికరాలు ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నది. ఇందులో భాగంగా త్వరలో ఓ కమిటీని ఏర్పాటు చేయనున్నది. ఈ కమిటీ మందులు, ఆరోగ్య పరికరాలు సరసమైన ధరలకు లభించేలా సూచిస్తుంది. ఈ సూచనలను పరిగణనలోకి తీసుకునే నేషనల్ ఫార్మాసూటికల్ ప్రైజింగ్ అథారిటీ (ఎన్‌పీపీఏ) ఔషధాలు, ఆరోగ్య పరికరాల ధరలను నిర్ణయిస్తుంది. నీతిఆయోగ్‌కు చెందిన ఆరోగ్య విభాగం సభ్యుడు కమిటీకి చైర్మన్‌గా వ్యవహరిస్తారు.



ఎర్రవల్లిలోని యాగక్షేత్రంలో ప్రత్యేక డైరీని ఆవిష్కరిస్తున్న సీఎం కేసీఆర్, అర్చక సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ. చిత్రంలో సీఎం సతీమణి

బ్రాహ్మణుల సంక్షేమానికి పెద్దపీట

- **సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలతో డైరీ: తెలంగాణ అర్చక సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బ్రాహ్మణుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని తెలంగాణ అర్చక సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ అన్నారు. అర్చకులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు ఇస్తున్న సీఎం కేసీర్‌కు కృతజ్ఞతాభావంతో ముద్రించిన ప్రత్యేక డైరీని ఎర్రవల్లిలోని యాగక్షేత్రంలో బుధవారం సీఎం కేసీఆర్ దంపతులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అర్చక సమాఖ్య తరపున రామచంద్రమూర్తి, భాస్కరబట్ల రామశర్మ, రాజేశ్వరశర్మ, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నరేందర్, మాజీ మంత్రి బస్వరాజుసారయ్య, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, సాంస్కృతికశాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ పాల్గొన్నారు.

■ ఉద్యమకారుడికి రూ.5 లక్షల సాయం



తెలంగాణ ఉద్యమకారుడు నల్లగొండ పట్టణానికి చెందిన ఆవుల అంజయ్య అనారోగ్యంతో బాధపడుతున్నట్టు పత్రికల ద్వారా తెలుసుకున్న టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. బుధవారం ఆయనను పిలిపించి ప్రభుత్వ పరంగా రూ.5 లక్షల చెక్కును అందించారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఉన్నారు. **- హైదరాబాద్, నమస్తే తెలంగాణ**

■ ఆటో కార్మికుడి కుటుంబానికి రూ.5 లక్షలు



సిద్దిపేటకు చెందిన ఆటో కార్మికుడు కనకయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, టీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రమాద బీమా పథకం కింద ఆయన భార్య లక్ష్మికి బుధవారం తెలంగాణభవన్‌లో రూ.5లక్షల చెక్కును అందజేస్తున్న టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రూప్‌సింగ్ తదితరులు

- హైదరాబాద్, నమస్తే తెలంగాణ

సౌకర్యవంతంగా సంక్షేమ హాస్టళ్లు

ప్రత్యేక చర్యలు తీసుకొంటున్న రాష్ట్రప్రభుత్వం ■ పెంచిన డైట్ చార్జీలతో అందుతున్న నాణ్యమైన పోషకాహారం

కార్పొరేట్ హాస్టళ్లకు దీటుగా మౌలిక సదుపాయాలు ■ 2,56,948 మంది విద్యార్థులకు చేకూరుతున్న ప్రయోజనం

త్వరలో అన్ని హాస్టళ్లలో అమలులోకి బయోమెట్రిక్ విధానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు సౌకర్యవంతంగా మారాయి. పేద విద్యార్థులు ఎలాంటి ఆటంకం లేకుండా చదువు కొనసాగించేందుకు వీలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో అన్నిరకాల మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పించింది. నాణ్యతా ప్రమాణాలు పెంచడంతో హాస్టళ్లలో విద్యార్థుల డ్రాప్‌ఔట్ సంఖ్య గణనీయంగా తగ్గింది. విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండేలా వసతిగృహాలను ప్రభుత్వం తీర్చిదిద్దుతున్నది. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్ల విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం సన్నబియ్యంతో అన్నం ఏర్పాటుచేసింది. గత విద్యాసంవత్సరం నుంచి ప్రతి ఆదివారంతోపాటు పండుగ దినాల్లో కూడా చికెన్‌కర్రీతో భోజనాన్ని అందిస్తున్నారు. బ్రాండెడ్ వస్తువులను అందుబాటులోకి తెచ్చారు. కార్పొరేట్ హాస్టళ్లలో ఉండే విధంగా ఆర్ ఆర్ వాటర్ ప్లాంట్లు, డీవీఆర్, సీసీ కెమెరాలు, మానిటర్, బంకర్ బెడ్లు, ఉలెన్ బ్లాంకెట్లు, పరుపు, దిండ్లు, స్కూల్ బ్యాగ్ వంటివి అందజేశారు. ప్రభుత్వ చర్యలతో ఎస్సీ, ఎస్టీ, బీసీ 2,191 వసతిగృహాల్లోని 2,56,948 మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతున్నది.

క్యాటగిరీవారీగా హాస్టళ్లు, విద్యార్థులు

విభాగం	హాస్టళ్ల సంఖ్య	విద్యార్థులు
ఎస్సీ	842	56,628
ఎస్టీ	613	1,33,537
బీసీ	736	66,783
మొత్తం	2,191	2,56,948



త్వరలో బయోమెట్రిక్ విధానం

సంక్షేమ హాస్టళ్లలో బయోమెట్రిక్ విధానాన్ని అమలుచేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ హాజరు విధానాన్ని ప్రయోగాత్మకంగా బీసీ సంక్షేమ వసతిగృహాల్లో ఈ ఏడాది మొదలుపెట్టారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి మిగతా హాస్టళ్లలో ప్రవేశపెట్టేందుకు తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ సహాయం తీసుకొంటున్నారు. విద్యార్థుల హాజరు మేరకు నిధులు ఖర్చుచేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం బయోమెట్రిక్ విధానాన్ని తీసుకువచ్చింది.

పెరిగిన డైట్ చార్జీలు

నిరుపేద కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ చూపడంతోపాటు బడిమానేసే పరిస్థితులు తలెత్తకుండా ఉండేందుకు సన్న బియ్యం పంపిణీ చేపట్టిన ప్రభుత్వం.. దాంతో పాటు డైట్ చార్జీలు కూడా పెంచింది. ఫలితంగా నాణ్యమైన భోజనం అందించేందుకు వీలు చిక్కింది. ఎస్సీ అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలోని హాస్టళ్ల విద్యార్థులకు 2012 నాటికి ఉన్న డైట్ చార్జీలు, 2017లో ప్రభుత్వం పెంచిన డైట్ చార్జీలు ఈ విద్యా సంవత్సరం నుంచి అమలుచేస్తున్నారు.

పెరిగిన డైట్ చార్జీలు ఇలా..

తరగతులవారీగా హాస్టల్ విద్యార్థులు	2012 నాటికి డైట్‌చార్జీ రూ.	2017లో పెంచిన డైట్‌చార్జీ రూ.
3 నుంచి 7 వరకు	750	950
8 నుంచి 10 వరకు	850	1,100
ఇంటర్ నుంచి పీజీ	1,050	1,400

యూనివర్సిటీ హాస్టళ్లతో సమానంగా మెనూ



యూనివర్సిటీ విద్యార్థుల మాదిరిగానే ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు ప్రతి రోజు పాలు, గుడ్డు, అల్పాహారం అందించడం, వారానికోసారి మాంసాహారం వంటి వాటితో పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. డైట్ చార్జీలను ప్రభుత్వం ఏకమొత్తంలో పెంచడంతో ప్రత్యేక మెనూ అమలుకు వీలుపడింది. ప్రతిరోజు ఉదయం 6 గంటలకు రాగిమాల్ట్ అందిస్తున్నారు. అల్పాహారంలోకి రవ్వ, సేమియా, అటుకుల ఉప్మా, పులిహోర, ఇడ్లీ, చట్నీ, అరటిపండు ఇస్తున్నారు. పాఠశాల పనిదినాల్లో విద్యార్థులు అక్కడే మధ్యాహ్న భోజనం చేస్తుండగా.. ఆదివారం, ఇతర సెలవుదినాల్లో మధ్యాహ్నభోజనంలోకి బగారా అన్నం, చికెన్‌కర్రీ, రైతా, సాంబారు పెడుతున్నారు. సాయంత్రం వేళల్లో బొబ్బర్లు, సేమియా స్వీటు, శనగలు, పల్లీపట్టి, పెసర్లు, బిస్కట్లను స్నాక్స్‌గా ఇస్తున్నారు. రాత్రివేళలో అన్నం, గుడ్డు వడ్డిస్తూనే.. ఏదైనా కూరగాయ, పప్పు, ఆకుకూర, సాంబారు, పెరుగు అందిస్తున్నారు.

హైదరాబాద్ హాస్టళ్లలో సకల వసతులు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ : చలితీవ్రత నుంచి హాస్టళ్ల విద్యార్థులను సంరక్షించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అన్ని వసతిగృహాల్లో సకల వసతులు కల్పిస్తున్న ప్రభుత్వం.. చలికాలం ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు వేడినీటి కోసం సోలార్ వాటర్ హీటర్లు ఏర్పాటుచేయడమే కాకుండా స్వెట్టర్లు, మంకీక్యాపులను అందజేయనున్నది. రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని ఫ్యాన్లు ఏర్పాటుకు చర్యలు తీసుకొంటున్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి హాస్టల్‌లో వ్యాయామశాల ఏర్పాటుచేయనున్నారు. ఎస్సీ కులాల అభివృద్ధిశాఖ ద్వారా హైదరాబాద్‌లో మొత్తం 34 హాస్టళ్లలో 3,158 మంది విద్యార్థులు ఉండి చదువుకొంటున్నారు. వారంరోజుల వ్యవధిలో టెండర్ల ప్రక్రియను పూర్తిచేసి సరఫరా చేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు ఎస్సీ కులాల అభివృద్ధిశాఖ డీడీ జాటోతు రామారావు తెలిపారు.

మోడల్ టౌన్‌గా యాదగిరిగుట్ట

- **మోడల్ బస్‌స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపండి**
- **వైటీడీఏ పనుల పురోగతిపై సమీక్షలో సీఎస్ జోషి**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: యాదగిరిగుట్టను మోడల్‌టౌన్‌గా అభివృద్ధిచేయడానికి చర్యలు తీసుకోవాలని యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ (వైటీడీఏ) అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఆదేశించారు. మోడల్ బస్‌స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని పేర్కొన్నారు. బుధవారం సచివాలయంలో వైటీడీఏ అధికారులతో సీఎస్ జోషి సమీక్ష నిర్వహించారు. యాదగిరిగుట్టలో ఎవెన్యూప్లాంటేషన్, స్మార్ట్ స్ట్రీట్ లైటింగ్, పార్కులు, మార్కెట్లు, జంక్షన్ల అభివృద్ధి, రోడ్లు, డ్రైనేజీ, ఫుట్‌పాత్‌ల నిర్మాణం, డంపింగ్‌యార్డు పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని సూచించారు. యాదగిరిగుట్టలో కమాండ్ కంట్రోల్‌సెంటర్, ఫైర్‌స్టేషన్, రోడ్లవెడల్పు, గండిచెరువు అభివృద్ధి, మాస్టర్‌ప్లాన్ అమలు, మంచినీటి సరఫరా, వేద పాఠశాల, శ్రీలక్ష్మీనరసింహ శిల్ప, నిర్మాణ విజ్ఞాన సంస్థ ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏప్రిల్ 15నాటికి పెద్దగుట్టలో 132/33 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని పూర్తిచేయాలని కోరారు.



బుధవారం సచివాలయంలో వైటీడీఏ అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి

వందకోట్లకు మించి మొక్కలు నాటేందుకు సిద్ధంకండి

వచ్చే వానకాలం హరితహారంలో వందకోట్ల మొక్కలు నాటాలన్న లక్ష్యాన్ని అధిగమించేందుకు అన్నిశాఖల అధికారులు, ఉద్యోగులు సిద్ధంగా ఉండాలని సీఎస్ ఎస్కే జోషి పిలుపునిచ్చారు. ఐదోవిడుత హరితహారం ఏర్పాట్లపై బుధవారం సచివాలయంలో జరిగిన రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్బన్‌పార్కులను జూలైలో ప్రారంభించాలని సీఎం కేసీఆర్ డెడ్‌లైన్ పెట్టారని, చర్యలు చేపట్టాలని హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ, పర్యాటకశాఖలను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల ప్రత్యేక, ముఖ్యకార్యదర్శులు అజయ్‌మిశ్రా, సునీల్‌శర్మ, జయేశ్‌రంజన్, శ్రీదేవి, ప్రియాంక వర్గీస్, పీసీసీఎఫ్ పీకే ఝా తదితరులు పాల్గొన్నారు.

నిజమైన దేశభక్తుడు నేతాజీ

- **కొనియాడిన టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎంపీ కవిత**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ 122వ జయంతి సందర్భంగా దేశానికి ఆయన అందించిన సేవలను టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు, నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత గుర్తుచేసుకొన్నారు. బుధవారం నేతాజీ జయంతి సందర్భంగా కేటీఆర్, కవిత ట్విట్టర్ వేదికగా స్పందించారు. నేతాజీ నిజమైన దేశభక్తుడు, గొప్ప పోరాటయోధుడు అని కేటీఆర్ కొనియాడారు. నేతాజీ జయంతి సందర్భంగా ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని, ఆయన పోరాటస్ఫూర్తి సజీవంగా ఉన్నదని కవిత ట్వీట్ చేశారు. ఆయన చేసిన ఐక్యత, ఒప్పందం, త్యాగం నినాదాలను గుర్తుచేసుకొన్నారు.



ప్రయోగానికి సిద్ధంగా ఉన్న పీఎస్ఎల్వీ సీ44

నేడు నింగిలోకి పీఎస్ఎల్వీ సీ44

మొదలైన కౌంట్‌డౌన్ ■ నేడు రాత్రి 11.37 గంటలకు ప్రయోగం

■ మైక్రోశాట్ ఆర్, కలాంశాట్ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపనున్న ఇస్రో

చెన్నై, జనవరి 23: పీఎస్ఎల్వీ సీ44 ప్రయోగానికి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా శ్రీహరికోటలో ఉన్న సతీశ్ ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం (షార్) నుంచి గురువారం రాత్రి 11.37 గంటలకు ఈ ప్రయోగాన్ని చేపట్టేందుకు శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు. ప్రయోగానికి సంబంధించిన కౌంట్‌డౌన్ ప్రక్రియ బుధవారం రాత్రి 7.37 గంటలకు ప్రారంభమైంది. ఇది నిరంతరాయంగా 28 గంటల పాటు కొనసాగిన అనంతరం గురువారం రాత్రి 11.37 గంటలకు పీఎస్ఎల్వీ సీ44 నింగిలోకి దూసుకెళ్లనుంది. భారత రక్షణ, పరిశోధన సంస్థ(డీఆర్‌డీవో)కు సంబంధించిన ఇమేజింగ్ శాటిలైట్ 'మైక్రోశాట్ ఆర్'తోపాటు చెన్నై విద్యార్థులు రూపొందించిన కలాంశాట్ ఉపగ్రహాన్ని పీఎస్ఎల్వీ సీ44 ద్వారా ఇస్రో నింగిలోకి పంపుతున్నది. ప్రయోగించిన 13 నిమిషాల అనంతరం 277 కిలోమీటర్ల ఎత్తులో మైక్రోశాట్ ఆర్ ఉపగ్రహం వాహకనౌక నుంచి వేరుపడనుంది. పీఎస్ఎల్వీ సీ 44 ప్రయోగంలో బరువును తగ్గించి, పరిమాణాన్ని పెంచేందుకు తొలిసారి నాలుగోదశలో అల్యూమినియం ట్యాంక్‌ను వినియోగిస్తున్నట్లు ఇస్రో చైర్మన్ కే శివన్ వెల్లడించారు. పీఎస్ఎల్వీ ప్రయోగాన్ని నాలుగు దశల్లో చేపట్టనున్నారు. సాధారణంగా పీఎస్ఎల్వీ మొదటి దశలో ఆరు స్ట్రాపాన్ బూస్టర్లను వినియోగిస్తారు. కానీ పీఎస్ఎల్వీ సీ44లో కేవలం రెండు స్ట్రాపాన్ బూస్టర్లనే వాడారు. దీంతో దీన్ని పీఎస్ఎల్వీ- డీఎల్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ తరహా రాకెట్‌ను ఇస్రో ఉపయోగిస్తుండడం ఇదే తొలిసారి. వాహకనౌకలోని పీఎస్4(నాలుగో దశ) దశను పలు పరిశోధనలకు పునర్వినియోగించుకునేలా దాన్ని అంతరిక్షలోనే ఉంచనున్నారు. కలాంశాట్ మొట్టమొదటిగా పీఎస్4 దశను వినియోగించుకోనుంది.


విద్యుత్ వినియోగం 178 యూనిట్లు బిల్లు రూ.23 కోట్లు



లక్నో, జనవరి 23: దాదాపు 178 యూనిట్ల విద్యుత్‌ను వినియోగిస్తే వచ్చిన బిల్లు రూ.23 కోట్లు. ఈ వింత ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లో వెలుగుచూసింది. కన్నౌజ్ నివాసి అబ్దుల్ బాసిత్ నెల మొత్తానికి 178 యూనిట్ల విద్యుత్‌ను వినియోగించారు. బిల్లును లెక్క చేయడానికి వచ్చిన ఉద్యోగి ఏకంగా రూ.23,67,71,524 అని లెక్కతేల్చి బిల్లు రశీదును బాసిత్ చేతిలో పెట్టి వెళ్లాడు. ఆ బిల్లును చూసిన బాసిత్ నోరెళ్లబెట్టాడు. ఈ బిల్లు తన ఇంటిదేనా.. లేక రాష్ట్రంలోని అందరీ బిల్లు కలిపి తన చేతిలో పెట్టాడా అని ఆశ్చర్యపోయాడు. జీవితాంతం కష్టపడినా ఈ బిల్లు చెల్లించలేనని చెప్పారు. ఈ ఘటనపై విద్యుత్ అధికారులు స్పందిస్తూ పొరపాటున ఇలా జరిగిందేమోనని, తప్పును సరిచేసిన తర్వాతే బిల్లు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ ఆరోగ్యం విషమం

ఆయన హృద్రోగ సమస్యలతో బాధపడుతున్నారన్న వ్యక్తిగత వైద్యుడు అద్నాన్‌ఖాన్



లాహోర్, జనవరి 23: అవినీతి కేసులో జైలుపాలైన పాకిస్థాన్ మాజీ ప్రధాని నవాజ్‌షరీఫ్ ఆరోగ్య పరిస్థితి హృద్రోగ సమస్యలతో విషమించిందని ఆయన వ్యక్తిగత వైద్యుడు డాక్టర్ అద్నాన్ ఖాన్ బుధవారం వెల్లడించారు. ఏమాత్రం జాప్యం చేయకుండా ఆయనను దవాఖానకు తరలించాలన్నారు. హృద్రోగ సమస్యలకు జైలులో ఆయనకు వైద్య చికిత్స లభించడం కష్టమని తెలిపారు. అవినీతి కేసులో కోర్టు ఏడేండ్ల జైలుశిక్ష విధించడంతో ప్రస్తుతం లాహోర్ జైలులో జైలు శిక్షను అనుభవిస్తున్న నవాజ్ షరీఫ్.. మంగళవారం ఛాతిలో సమస్యగా ఉన్నదనడంతో దవాఖానకు తరలించారు. వైద్య పరీక్షలు జరిపిన తర్వాత తిరిగి జైలుకు తీసుకెళ్లారు. ఇంతకుముందు జైలులోని ప్రత్యేక వైద్య బృందం కూడా షరీఫ్‌కు తనిఖీలు చేసి, ఆయనను దవాఖానకు తరలించాలని సూచించినా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవడం లేదని డాక్టర్ అద్నాన్ అన్నారు. షరీఫ్ కూతురు మార్యం షరీఫ్ స్పందిస్తూ తన తండ్రి అనారోగ్యం గురించి మీడియా ద్వారానే తెలుసుకుంటున్నానని చెప్పారు.

ప్రియాంక అరంగేట్రం



'ప్రియాంక.. కష్టపడే తత్త్వం, పట్టుదల ఉన్న నేత. ఆమె అత్యంత సమర్థురాలు. యూపీ ఎన్నికల ప్రచారంలో ఆమె నాకు తోడుగా ఉండడం సంతోషంగా ఉంది.

- రాహుల్

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా నియామకం	పార్టీ తూర్పు ఉత్తర్‌ప్రదేశ్ ప్రాంత బాధ్యతలు అప్పగింత	కాంగ్రెస్‌లో నయా జోష్.. దేశవ్యాప్తంగా సంబురాలు	మరో ప్రధాన కార్యదర్శిగా జ్యోతిరాధిత్య సింధియా.. పశ్చిమ యూపీ బాధ్యతలు	బీజేపీ, ఎస్పీ-బీఎస్పీ కూటమిని ధీటుగా ఎదుర్కొనే ఎత్తుగడ

నా సోదరి అత్యంత సమర్థురాలన్న కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ ■ తదుపరి యూపీ సీఎం అమేథీ నుంచే ఉంటారని ప్రకటన ■ రాయ్‌బరేలీ నుంచి ప్రియాంక బరిలోకి?

లక్నో/న్యూఢిల్లీ, జనవరి 23: కాంగ్రెస్‌లో సరికొత్త జోష్.. దేశంలోనే అతి పురాతన 133 ఏండ్ల పార్టీకి జవసత్వాలు, నూతనోత్తేజం కల్పించే దిశగా కాంగ్రెస్ అడుగులేసింది. సార్వత్రిక ఎన్నికల వేళ అనూహ్య నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకూ తెరవెనుక మంత్రాంగం నడిపిన మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ, సోనియా గారాలపట్టి ప్రియాంక గాంధీ వాద్రా (47) రాజకీయ అరంగేట్రానికి రంగం సిద్ధమైంది. నేడు, రేపు అంటూ సుమారు దశాబ్దకాలంగా తన రాజకీయ ప్రవేశంపై ఊరిస్తున్న ప్రియాంక ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఆమెను పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ.. ఉత్తర్‌ప్రదేశ్‌లోని తూర్పు ప్రాంత ఇంచార్జిగా ఆమెకు కీలక బాధ్యతలు అప్పగించినట్లు ఏఐసీసీ తెలిపింది యూపీలో కాంగ్రెస్‌కు ప్రియాంక స్టార్ క్యాంపెయినర్‌గా వ్యవహరించనున్నారు. ఫిబ్రవరి తొలి వారంలో ఆమె బాధ్యతలు స్వీకరించనున్నట్లు పేర్కొంది. యూపీలో ప్రచార బాధ్యతల్ని ప్రియాంకకు అప్పజెప్పి అత్యధిక స్థానాల్లో పాగా వేయాలనేది కాంగ్రెస్ వ్యూహం. బీజేపీని దెబ్బకొట్టాలంటే ముందు యూపీలో ఆ పార్టీని ఓడించాలని, ఆ దిశలో తొలి అడుగే ప్రియాంక నియామకమని పార్టీ వర్గాలు అంటున్నాయి. యూపీ తూర్పు ప్రాంతంలో బీజేపీ తరుపున స్టార్ క్యాంపెయినర్ యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను ప్రియాంక ఢీకొట్టనున్నారు. ఇటీవల యూపీలో పొత్తు పెట్టుకున్న ఎస్పీ-బీఎస్పీలు తమ కూటమిలో తనకు చోటివ్వకపోవడంతో కాంగ్రెస్‌లో అంతర్మథనం ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ తురుపుముక్కగా ప్రియాంకను రంగంలోకి దించిందని నేతల కథనం. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా జ్యోతిరాధిత్య సింధియాను నియమించి.. పశ్చిమ యూపీ బాధ్యతలు అప్పగించారు. సీనియర్‌నేత గులాంనబీ ఆజాద్‌ను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా హర్యానా బాధ్యతలు కట్టబెట్టారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శిగా నియమించారు.



ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం వద్ద పార్టీ శ్రేణుల సంబురాలు

దేశవ్యాప్తంగా సంబురాలు.. నేతల ప్రశంసలు

ప్రియాంక రాజకీయ ప్రవేశంపై దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు చేసుకున్నాయి. బాణాసంచా పేల్చి, మిఠాయిలు పంచుకొన్నారు. ఢిల్లీ సహా దేశంలోని కాంగ్రెస్ కార్యాలయాల్లో కొత్త జోష్ కనిపించింది. ప్రియాంక రాజకీయ ప్రవేశం కేవలం యూపీకే పరిమితం కాదని, దేశవ్యాప్తంగా ఆమె ప్రభావం ఉంటుందని కాంగ్రెస్ సీనియర్ నేత మోతీలాల్ వోరా అన్నారు. ప్రియాంక నియామకం భవిష్యత్‌లో కాంగ్రెస్ అభివృద్ధికి ఉత్ప్రేరకంగా పనిచేస్తుందని ఆ పార్టీ నేత కపిల్‌సిబల్ పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు నూతనోత్సాహం తెస్తుందని కేంద్ర మాజీ మంత్రి వీరప్పమొయిలీ అన్నారు. 'అభినందనలు. నీ జీవితంలో ప్రతి దశలోనూ ఎల్లప్పుడూ నీ వెంటే నేను. అత్యుత్తమంగా దూసుకెళ్లు' అని ఆమె భర్త రాబర్ట్ వాద్రా ట్వీట్ చేశారు. ప్రియాంక నియామకం కాంగ్రెస్‌కు జవసత్వాలు అందిస్తుందని మధ్యప్రదేశ్ సీఎం కమల్‌నాథ్ అన్నారు. ప్రియాంక, జ్యోతిరాదిత్య జోడీ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో ఘన విజయానికి దోహదపడుతుందని అన్నారు.

బీజేపీ అంటే కార్యకర్తలు.. కాంగ్రెస్ అంటే కుటుంబం: మోదీ

వంశపారంపర్య రాజకీయాలపై ప్రధాని మోదీ నిప్పులు చెరిగారు. ప్రజాస్వామ్య విలువలకనుగుణంగా బీజేపీ పయనిస్తే.. కుటుంబ ప్రయోజనాలే పరమావధిగా ఇతర పార్టీలు పనిచేస్తాయని పరోక్షంగా ప్రియాంక నియామకాన్ని ఎద్దేవా చేశారు. మహారాష్ట్రలోని బారామతి, గడ్చిరోలి, హింగోలి, నాందేడ్ జిల్లాల బూత్‌పార్టీ కార్యకర్తలతో మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. 'బీజేపీకి పార్టీనే కుటుంబం.. కానీ, కొందరికి కుటుంబమే పార్టీ' అని చురకలంటించారు.

పునర్వైభవం దిశగా అడుగులు

1980 దశాబ్ది వరకు ఉత్తర్‌ప్రదేశ్ కాంగ్రెస్‌కు కంచుకోట. తర్వాత పార్టీ ప్రతిష్ఠ క్రమంగా మసకబారింది. 80 స్థానాలున్న యూపీలో ఎక్కువ స్థానాలు గెలిచిన పార్టీనే కేంద్రంలో అధికారం చెలాయిస్తుంది. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున రాయ్‌బరేలీ నుంచి యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, అమేథీ నుంచి రాహుల్ విజయం సాధించారు. నాయనమ్మ ఇందిరాగాంధీ లాంటి రూపు, కలుపుగోలుతనం, పార్టీ శ్రేణులతో, ప్రజలతో ఇట్టే కలిసిపోయే మాట చాతుర్యం ఉన్న ప్రియాంకను యూపీలో స్టార్ క్యాంపెయినర్‌గా కాంగ్రెస్ భావిస్తున్నది. తన తల్లి ప్రాతినిధ్యం వహిస్తున్న రాయ్‌బరేలీ నుంచి ప్రియాంక బరిలో దిగే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సోనియాగాంధీ వచ్చే ఎన్నికల్లో పోటీ చేయకపోవచ్చునేది పార్టీ వర్గాల కథనం.

రాహుల్ విఫలమయ్యాడని అంగీకరించినట్లే: బీజేపీ

ప్రియాంకను రాజకీయాల్లోకి తీసుకురావడంపై కాంగ్రెస్‌పై బీజేపీ చురకలు వేసింది. కాంగ్రెస్ నిర్ణయంతో ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఫెయిలైనట్లు, ఆ పార్టీ నైరాశ్యంలో ఉన్నట్లు వెల్లడవుతున్నదని విమర్శించింది. 'ప్రియాంక నియామకం ద్వారా రాహుల్ విఫలమైనట్లు కాంగ్రెస్ బహిరంగంగా అంగీకరించినట్లైయింది. తన కుటుంబంలోనే ప్రియాంక రూపంలో ఒక ఊతకర్ర లభించింది. మహాకూటమిలో కాంగ్రెస్‌ను అన్ని పక్షాలు దూరం పెట్టడంతో గత్యంతరంలేని పరిస్థితుల్లో తన కుటుంబం నుంచే ఒక ఊతకర్రను రాహుల్ సాయంగా తెచ్చుకున్నారు' అని బీజేపీ అధికారప్రతినిధి సంబిత్‌పాత్ర ఎద్దేవా చేశారు. ప్రియాంక నియామకం తమకు సవాల్ కానేకాదని యూపీ బీజేపీ అధ్యక్షుడు మహేంద్రనాథ్ పాండే అన్నారు. ఇది కాంగ్రెస్ అంతర్గత వ్యవహారం అని పేర్కొన్నారు. 'యూపీలో కాంగ్రెస్ ఎప్పుడో తెరమరుగై, ప్రజలకు దూరమైంది. ప్రియాంక నియామకం వల్ల ఒరిగేదేమీ లేదు. కాకపోతే ప్రచారంలో కాంగ్రెస్‌కు కొంత గ్లామర్ తోడవుతుంది. ఆమె ఒక్క శాతం కూడా మాకు సవాల్ కాదు. ఆమె తన తల్లి, సోదరుడు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలపై దృష్టిసారిస్తే బాగుంటుంది' అని విమర్శించారు.

సానుకూల మార్పునకు సంకేతం



తన సోదరి ప్రియాంక ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడం తనకు అత్యంత ఆనందదాయకమని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ అన్నారు. 'ప్రియాంక.. కష్టపడే తత్త్వం, పట్టుదల ఉన్న నేత. ఆమె అత్యంత సమర్థురాలు. యూపీ ఎన్నికల ప్రచారంలో ఆమె నాకు తోడుగా ఉండడం సంతోషంగా ఉంది. యూపీ రాజకీయాల్లో సరికొత్త ఆలోచనలకు, సానుకూల మార్పుకు ప్రియాంక నియామకం దోహదపడుతుంది. తనకు అప్పగించిన బాధ్యతలు నిర్వహించడంలో ఆమె అత్యంత సమర్థురాలు' అని చెప్పారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం అమేథీ చేరుకున్న రాహుల్ భారీ జన సమూహాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. 'కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ప్రియాంకగాంధీని నియమించాను. అంటే దీనర్థం 2019లో కేంద్రంలో సంకీర్ణ సర్కారు ఏర్పడేవరకు మాత్రమే కాదు.. యూపీలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చే వరకూ ఈ పోరాటం కొనసాగుతుంది. తదుపరి యూపీ ముఖ్యమంత్రి అమేథీ నుంచే ఉంటారు' అని ప్రకటించారు. ప్రియాంక, జ్యోతిరాధిత్య సింధియా ఇద్దరూ డైనమిక్ లీడర్లు అని కితాబునిచ్చారు. వారిద్దరి సారథ్యం, సహకారంతో యూపీలో త్వరలో సరికొత్త చరిత్రను తాము లిఖించనున్నామని చెప్పారు. యూపీలో బీజేపీ పూర్తిగా కనుమరుగవుతుందని అన్నారు. ప్రియాంక, సింధియాలిద్దరూ యూపీలో చెరో 40 ఎంపీ స్థానాల బాధ్యతలను చూస్తారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తాము 'ఫ్రంట్ ఫుట్'పైనే పోరాటం చేస్తామని రాహుల్ అన్నారు. 'కాంగ్రెస్ బ్యాక్‌ఫుట్‌పై ఆడే పార్టీ కాదు. ఎక్కడైనా సరే ఫ్రంట్ ఫుట్‌పైనే ఆడతాం. అది గుజరాత్ అయినా, యూపీలోనైనా..' అని చెప్పారు. ఎస్పీ-బీఎస్పీ పొత్తుపై ఆయన మాట్లాడుతూ.. 'వారి పొత్తును మేం స్వాగతిస్తున్నాం. అఖిలేశ్, మాయావతితో నాకు ఎలాంటి వైరం లేదు. మా ముగ్గురి మధ్య భావసారూప్యత ఉంది. మా అంతిమ లక్ష్యం బీజేపీ ఓటమి. ఇందుకోసం ఎవరితోనైనా కలిసేందుకు మేం సిద్ధం' అని పేర్కొన్నారు. ప్రియాంక రాజకీయ ప్రవేశంపై అప్పుడే బీజేపీ నేతల్లో ఆందోళన మొదలైందని ఎద్దేవా చేశారు. 'అమేథీ కే ఎంపీ.. 2019 కే పీఎం' పోస్టర్లతో కాంగ్రెస్ శ్రేణులు అమేథీ వీధుల్ని ముంచెత్తారు.

33 వేల రుద్రాక్షలతో ఠాక్రే చిత్రపటం

బాల్ ఠాక్రే స్మారకానికి ఉద్ధవ్, ఫడ్నవీస్ సంయుక్తంగా భూమిపూజ



ముంబై: శివసేన వ్యవస్థాపకుడు బాల్‌ఠాక్రే 93వ జయంతి సందర్భంగా చేతన్ రౌత్ అనే ముంబై కళాకారుడు 33 వేల రుద్రాక్షలతో ఠాక్రే చిత్రపటాన్ని రూపొందించారు. ముంబైలోని శివసేన కార్యాలయం ముందు దీన్ని ప్రదర్శించారు. 'రుద్రాక్షలతో ఠాక్రేకు ప్రత్యేక అనుబంధం ఉంది. అందుకే 33 వేల రుద్రాక్షలతో ఆయన చిత్రపటం రూపొందించి ప్రపంచ రికార్డు సాధించాలని ప్రయత్నించా' అని చేతన్ రౌత్ తెలిపారు. కాగా, ఇటీవల మిత్రపక్షం బీజేపీపై తరచూ విమర్శలు చేస్తున్న శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే బుధవారం ఠాక్రే జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో కరచాలనం చేసి క్షేమ సమాచారం తెలుసుకున్నారు. దాదర్‌లోని శివాజీ పార్క్‌లో బాల్ ఠాక్రే స్మారక నిర్మాణానికి ఇరువురు నేతలు సంయుక్తంగా భూమి పూజ నిర్వహించారు. తర్వాత ఆ ఫొటోలను ఫడ్నవీస్ ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. ఠాక్రే తనకు స్ఫూర్తిప్రదాత అని పేర్కొన్నారు. బాల్‌ఠాక్రే జయంతి సందర్భంగా ప్రధాని మోదీ ఆయనను స్మరించుకున్నారు.

కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే గణేశ్‌పై లుకౌట్ నోటీసు

త్వరలో అరెస్ట్ చేస్తాం: రాష్ట్ర హోంమంత్రి ఎంబీ పాటిల్



బెంగళూరు: సహచర ఎమ్మెల్యే ఆనంద్‌సింగ్‌పై హత్యాయత్నానికి పాల్పడినట్లు అభియోగాలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే జేఎన్ గణేశ్‌పై కర్ణాటక పోలీసులు లుకౌట్ నోటీసు జారీచేశారు. దీన్ని రాష్ట్ర హోంమంత్రి ఎంబీ పాటిల్ ధ్రువీకరించారు. ప్రస్తుతం పరారీలో ఉన్న గణేశ్‌ను త్వరలోనే అరెస్ట్ చేస్తామని చెప్పారు. పార్టీ (కాంగ్రెస్) నుంచి సస్పెండ్ చేశామని పాటిల్ బుధవారం మీడియాతో అన్నారు. కాగా, గణేశ్ ఆచూకీ కనుగొనేందుకు రామనగర పోలీసులు మూడు ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటుచేశారు. బెంగళూరు నగర శివార్లలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బసచేసిన ఈగల్టన్ రిసార్ట్‌లో గత శనివారం అర్ధరాత్రి ఎమ్మెల్యేలు ఆనంద్ సింగ్, గణేశ్ మధ్య ఘర్షణకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

ఎర్రకోటలో 'క్రాంతి మందిర్'

■ మూడు మ్యూజియంలను ప్రారంభించిన ప్రధాని

■ నేతాజీ, జలియన్‌వాలా బాగ్, భారతీయ చిత్రకళలపై విడివిడిగా ప్రదర్శనశాలలు

న్యూఢిల్లీ: నేతాజీ సుభాష్ చంద్రబోస్ 122వ జయంతి సందర్భంగా ఢిల్లీలోని ఎర్రకోటలో 'క్రాంతి మందిర్' పేరిట ఏర్పాటు చేసిన మూడు మ్యూజియంల సముదాయాన్ని ప్రధాని నరేంద్రమోదీ బుధవారం ప్రారంభించారు. ఒక మ్యూజియం సుభాష్ చంద్రబోస్‌పై కాగా, రెండోది జలియన్‌వాలాబాగ్- మొదటి ప్రపంచయుద్ధానికి సంబంధించినది, మూడోది భారతీయ చిత్రకళపై ఏర్పాటు చేశారు. నేతాజీపై ఏర్పాటు చేసిన మ్యూజియంలో బోస్, భారత జాతీయ సైన్యం (ఐఎన్ఏ)కు సంబంధించిన పలు వస్తువులను ఉంచారు. వాటిలో నేతాజీ వాడిన ఒక కుర్చీ, కత్తి ఐఎన్ఏ సైనికుల దుస్తులు, బ్యాడ్జీలు, పతకాలు ఉన్నాయి. బోస్‌పై రూపొందించిన ఒక డాక్యుమెంటరీ చిత్రాన్నీ మ్యూజియంలో ప్రదర్శిస్తున్నారు. ఈ డాక్యుమెంటరీకి బాలీవుడ్ నటుడు అభిషేక్ బచ్చన్ వ్యాఖ్యానం చేశారు. ఇక జలియన్‌వాలా బాగ్‌పై 'యాద్-ఏ-జలియన్' పేరిట ఏర్పాటుచేసిన మ్యూజియంలో 1919, ఏప్రిల్ 13న బ్రిటిష్ సైనికులు భారతీయులపై సాగించిన ఊచకోత ఘటనలను చిత్రాల రూపంలో ప్రదర్శించారు. మొదటి ప్రపంచ యుద్ధంలో భారత సైనికుల వీరోచిత పోరు, వారి సాహసం, శౌర్యాల చిత్రాలను ఉంచారు. బ్రిటిష్ వారి తరఫున పోరాడిన భారత సైనికులపై సరోజినీ నాయుడు రాసిన కవిత కూడా ఈ మ్యూజియంలో ఉంది. భారతీయ చిత్రకళలపై 'దృశ్యకళ' పేరిట ఏర్పాటు చేసిన మరో మ్యూజియంలో అమృతా షేర్గిల్, రాజా రవివర్మ గీసిన పలు అద్భుత కళాఖండాలను ప్రదర్శనకు ఉంచారు. దాదాపు గంటపాటు ప్రధాని మోదీ ఈ ప్రదర్శనశాలలను సందర్శిస్తూ గడిపారు. నేతాజీ జయంతిని జాతీయ సెలవుదినంగా ప్రకటించకపోవడాన్ని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తప్పు పట్టారు. బీజేపీ నేతలు నేతాజీని జాతీయ నేతగా పరిగణించడం లేదేమోనన్నారు.



ఎర్రకోటలోని నేతాజీ మ్యూజియంలో బోస్‌కు నివాళులర్పిస్తున్న ప్రధాని మోదీ

ప్రతి దీపావళికి ఐదు రోజులు అడవికి వెళ్లేవాడిని: మోదీ

ప్రతి దీపావళికి ఐదు రోజులు ఒంటరిగా అడవిలో గడిపే అలవాటు తనకుండేదని ప్రధాని మోదీ చెప్పారు. ఆ అలవాటే తనకు జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనే శక్తిని ఇస్తున్నదని 'హ్యూమన్స్ ఆఫ్ బాంబే' ఫేస్‌బుక్ పేజీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మోదీ తన జీవిత విశేషాల వివరాలను తెలిపారు. 'చాలామందికి తెలియదు. నేను ప్రతి దీపావళికి ఐదు రోజులు ఒంటరిగా అడవిలోకి వెళ్లేవాడిని. జనసంచారం లేని, స్వచ్ఛమైన నీరు దొరికే స్థలం వెతుక్కొనేవాడిని. ఐదురోజులకు సరిపడ భోజనం తీసుకెళ్లేవాడిని. అక్కడ రేడియో, వార్తా పత్రికలు లభించవు. ఆ కాలంలో టీవీ, ఇంటర్నెట్ లేవు' అని పేర్కొన్నారు. 'ఆ సమయంలో నన్ను నేను సింహావలోకనం చేసుకుంటూ గడిపేవాడిని. ఆ ఒంటరి సమయంలో నాకు లభించిన శక్తి జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు దోహదపడుతున్నది' అని చెప్పారు. 'ఎవరిని కలువడానికి వెళుతున్నావని ఎవరైనా అడిగితే.. నన్ను నేను కలుసుకోవడానికి వెళుతున్నాను అని చెప్పేవాడిని' అని తెలిపారు. వేగవంతమైన జీవితంలో యువత కొంత సమయం వెచ్చించి తమను తాము ఆత్మపరిశీలన చేసుకోవడానికి ప్రయత్నించాలని ప్రధాని సూచించారు.

ఇండోనేషియాలో కుండపోత

భారీ వర్షాలకు 8 మంది మృతి

9 జిల్లాల్లో వరద ప్రభావం

జకార్తా: ఇండోనేషియాలో కురుస్తున్న కుండపోత వర్షాలతో డ్యాంలు ఉప్పొంగి, కొండచరియలు విరిగిపడి ఇద్దరు చిన్నారులతోపాటు ఎనిమిది మంది మరణించారు. 2000 మంది నిరాశ్రయులయ్యారు. మంగళవారం అర్ధరాత్రి మొదలైన వరదలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. వరదల్లో నలుగురు గల్లంతయ్యారు. 9 జిల్లాలు వరద ముంపుకు గురయ్యాయి. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. 'భారీ వర్షాల వల్ల బిలి బిలి డ్యాం పొంగిపోతున్నది. దీంతో ప్రమాద నివారణకు నీళ్లను కిందకు వదిలాం. వరద ఒక్కసారిగా పెరిగిపోవడంతో 8 మంది మరణించారు. వాస్తవంగా ముందస్తు హెచ్చరిక జారీ చేయాలనుకున్నా డ్యాంలో నీళ్లు ప్రమాద స్థాయికి చేరుకోవడంతో నీళ్లను కిందకు వదలాల్సి వచ్చింది' అని అధికారులు తెలిపారు. విరిగిపడిన కొండచరియలను తొలగిస్తున్నామన్నారు.



బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న దృశ్యం



కెర్చ్ జలసంధి అగ్నిప్రమాదంలో ఆరుగురు భారతీయులు మృతి

■ మరో ఆరుగురి గల్లంతు

మాస్కో/ న్యూఢిల్లీ: రష్యా-క్రెమియాలను విడదీసే కెర్చ్ జలసంధి వద్ద జరిగిన అగ్ని ప్రమాదంలో ఆరుగురు భారతీయ నావికులు మృతిచెందారు. మరో ఆరుగురి ఆచూకీ గల్లంతైంది. సోమవారం అగ్ని ప్రమాదం జరిగిన నౌకల్లో ఇంకా అగ్ని కీలలు ఎగసిపడుతూనే ఉన్నాయి. గల్లంతైన నావికుల కోసం రష్యా అధికారులు బుధవారం కూడా గాలింపు చేపట్టారు. ఈ ఘటనపై స్పందించిన భారత్ విదేశాంగశాఖ 'రష్యాకు చేరువలో సముద్రంలో రెండు నౌకల మధ్య జరిగిన అగ్ని ప్రమాదంలో భారతీయ నావికుల మృతి విచారకరం' అని ఒక ప్రకటనలో తెలిపింది. మృతులను పినల్‌కుమార్ భరత్‌భాయి టాండెల్, విక్రమ్‌సింగ్, సర్వనన్ నాగరాజన్, విశాల్ దోద్, రాజ్ దేబ్‌నారాయణ్ పాణిగ్రాహి, కరణ్‌కుమార్ హరిభాయి టాండెల్‌గా గుర్తించామన్నది. గల్లంతైన ఆరుగురు నావికులు సిద్ధార్థ్ మెహెర్, నీరజ్‌సింగ్, సెబాస్టియన్ బ్రిట్టో బ్రిజ్లిన్, సహాయరాజ్, రుషికేశ్ రాజు సక్పాల్, అక్షయ్ బాబన్ జాదవ్, ఆనందశేఖర్ అవినాశ్‌గా గుర్తించినట్లు తెలిపింది.

కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. ముగ్గురు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఈ సంఘటన బుధవారం బారాముల్లా జిల్లా బిన్నర్ ప్రాంతంలో జరిగింది. ఈ ప్రాంతంలో ఉగ్రవాదులు సంచరిస్తున్నారన్న సమాచారం మేరకు గాలింపు చేపట్టిన భద్రతా బలగాల రాకను గుర్తించిన ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. సైనికులు ఎదురుకాల్పులు జరిపారు. దీంతో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. తర్వాత ఘటనాస్థలంలో సైనికులు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.



రాష్ట్రాల్లో ప్రతిపక్ష ఐక్య కూటమిలో ఒక భాగస్వామిగా ఉండటానికి కాంగ్రెస్ పార్టీ అంగీకరించడం లేదు. ఈ నేపథ్యంలో కుటుంబంలోని ఓ ఊతకర్ర కోసం వెతుకుతున్నది. రాహుల్ కుటుంబంలో ప్రియాంక ఒక ఊతకర్ర వంటిది. రాహుల్‌గాంధీ విఫలమయ్యారని కాంగ్రెస్ పార్టీ బహిరంగంగానే ప్రకటించింది. అతన్ని నిలబెట్టడానికి వాళ్ల కుటుంబంలోనే ఒకరి ఆధారం అవసరమనుకుంటున్నది.


సంబిత్ పాత్ర,బీజేపీ అధికార ప్రతినిధి

పార్టీ తీసుకున్న మంచి నిర్ణయానికి అభినందనలు. ప్రియాంక రాకతో యూపీలోనే కాదు, దేశంలోనే కాంగ్రెస్‌కు జవసత్వాలు వస్తాయి. ఆమె రాకతో బీజేపీ వణికిపోతున్నది. ఎందుకంటే ఆమె యూపీకి ప్రాతినిధ్యం వహిస్తున్నది.

రాజీవ్ శుక్లా, కాంగ్రెస్ నేత



చరిత్రలో నేడు



1839

రాయల్ సొసైటీ సభ్యుడిగా చార్లెస్ డార్విన్.

1857

దక్షిణాసియాలో మొదటి కలకత్తా విశ్వవిద్యాలయం ప్రారంభం.





1924

ఫాసిస్టేతర సంఘాలను నిషేధించిన ముస్సోలిని.

2020 ఫిబ్రవరి ఆరంభంలో జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికల రేసు అప్పడే ఆరంభమైంది. అధ్యక్ష ఎన్నికల రేసులో డెమోక్రటిక్ పార్టీ తరఫున పోటీచేసే అభ్యర్థుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. ట్రంప్‌కు ఉన్న ప్రజా వ్యతిరేకతను వినియోగించుకొని అధ్యక్ష పీఠాన్ని ఎక్కేందుకు పోటీ పడుతున్నవారి సంఖ్య 34కు చేరుకున్నది. మొదటిసారి సెనెట్‌కు ఎన్నికైన కమలా హారిస్ కూడా ఎన్నికల బరిలో ఉండటం అందరినీ ఆశ్చర్యపరుస్తున్నది. మొత్తం మీద ట్రంప్ వ్యతిరేకతను సొమ్ము చేసుకునేందుకు డెమోక్రాట్లలో పోటీ తీవ్రంగా కనపడుతున్నది.

ది హిందూ

రిజర్వేషన్ కోటా వాదనలు, ఉద్యమాలు సమాజ విభజనకు దారితీసే దిశగా సాగుతున్నాయి. ఈ మధ్య కేంద్రం అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్ల ప్రకటన తర్వాత జనాభా దామాషా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఉండాలన్న డిమాండ్ పుంజుకున్నది. బీహార్ సీఎం నితీశ్‌కుమార్, ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్, అప్నాదళ్ నేత అనుప్రియా పటేల్ లాంటి వారు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఏదేమైనా ఈ రిజర్వేషన్ల డిమాండ్‌తో సమాజం విభజన దిశగా సాగుతున్న తీరు ఆందోళనకరమైనది.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

ప్రియాంక ప్రవేశం

నెహ్రూ కుటుంబం నుంచి వచ్చిన ప్రియాంక ఎట్టకేలకు క్రియాశీల రాజకీయాల్లో అడుగు పెట్టారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్నందున, పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ప్రియాంకను ఉత్తరప్రదేశ్ రాష్ట్ర తూర్పు ప్రాంతం బాధ్యతలు నిర్వహించే ప్రధాన కార్యదర్శిగా నియమించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన బలమైన నాయకుడు జ్యోతిరాదిత్య సింధియాకు పశ్చిమ ప్రాంత బాధ్యతలను అప్పగించారు. ప్రియాంక ఇప్పటివరకు ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉన్నారు. తమ కుటుంబీకులు ప్రాతినిధ్యం వహించే రాయ్‌బరేలీ, అమేథీ లోక్‌సభ నియోజకవర్గాలలో మాత్రమే ఆమె ప్రచారం సాగించేవారు. అంతరంగిక చర్చలలో చురుకుగానే పాల్గొంటారని మాత్రం చెప్పుకుంటారు. కానీ కీలకమైన సంస్థాగత బాధ్యతలు నిర్వహించడం ఇదే మొదటి సారి. తొలిసారిగా ప్రత్యక్ష రాజకీయాల్లో అడుగుపెట్టిన ప్రియాంకకు ఈ బాధ్యతలు అగ్ని పరీక్ష వంటివి. యూపీలో కాంగ్రెస్ పార్టీ అత్యంత బలహీనంగా ఉన్నది. గతంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన బీజేపీ ఒకవైపు కాచుకొని ఉన్నది. రాష్ట్రంలోని రెండు బలమైన పార్టీలైన ఎస్పీ, బీఎస్పీ ఏకమై మరోవైపు మోహరించి ఉన్నాయి. ఈ రెండుపక్షాలను ఢీకొని కాంగ్రెస్‌కంటూ కొన్నిసీట్లు గెలిపించడం ఎంత కష్టపడినా సాధ్యమా? నెహ్రూ కుటుంబ నాయకురాలిగా తన జనాకర్షణను, నిర్మాణ దక్షతను నిరూపించుకోగలిగితే ఆమె రాజకీయ జీవితానికి గట్టి పునాది పడుతుంది. ఎవరికి ఇష్టమైనా కాకున్నా, ఆమె పాత్రను బలహీనపరుచడం కష్టం.

ప్రియాంకకు పార్టీలో ఓ మోస్తరు బాధ్యతలు అప్పగించడం రాహుల్‌గాంధీ వైఫల్యానికి సూచన అనే వ్యాఖ్యానాలు వినబడుతున్నాయి. రాహుల్‌గాంధీ రాజకీయాలలో ఘోరంగా విఫలమయ్యారనేది వాస్తవమే. కానీ ప్రియాంకకు ఈ మాత్రం బాధ్యతలు అప్పగించడానికి కారణం మాత్రం ఆయన వైఫల్యం కాదు. రాహుల్ తన వైఫల్యాన్ని అంగీకరించడం లేదు. ఆయనను కాదనే పరిస్థితి కాంగ్రెస్ పార్టీకి లేదు. ఆయనను కాదనే వారెవరూ కాంగ్రెస్‌లో మిగిలిలేరు. విఫలమో, సఫలమో రాహుల్ గాంధీ మాత్రమే కాంగ్రెస్ నాయకుడు. కాంగ్రెస్ పార్టీ పతనమైనా, పునరుత్థానమైనా ఆయన నాయకత్వంలో జరుగవలసిందే. ప్రియాంకకు ఈ అవకాశం ఇవ్వడం ద్వారా వారసురాలిని తయారు చేస్తున్నారా అనే సందేహానికి తావులేదు. నెహ్రూ కుటుంబ వారసుడిగా సోనియా గాంధీ తన కుమార్తెను కాకుండా కుమారుడినే ఎంచుకున్నారు. ప్రియాంకను జాతీయస్థాయిలో ప్రచారకర్తగా కూడా ఇప్పటివరకు ఉపయోగించుకోలేదు. ఆమె పర్యటనలకు వెళ్ళి జనాలు భారీగా తరలివస్తే, రాహుల్ నాయకత్వం మరింత మసకబారుతుంది. ఉత్తర ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ముందు ఆమెను ముఖ్యమంత్రి అభ్యర్థిగా నిలుపాలనే సూచనలు వచ్చాయి. కానీ పార్టీ నాయకత్వం ఆ ప్రయత్నం కూడా చేయలేదు. అదే కనుక జరిగి, ప్రియాంక ఏమాత్రం నిలదొక్కుకున్నా ఆమె పేరు దేశమంతా మార్మోగేది. కానీ ఆ అవకాశం 'పార్టీ నాయకత్వం' ఇవ్వలేదు. రాహుల్‌గాంధీ నాయకత్వం పట్ల పార్టీ శ్రేణులు పూర్తి నిరాశచెంది ఉన్నాయి. రాహుల్ వైదొలిగి ప్రియాంకకు బాధ్యతలు అప్పగించాలనే ప్రదర్శనలు గతంలో అక్కడక్కడా పెల్లుబికాయి. ప్రియాంక సమర్థురాలు, రాజనీతిజ్ఞురాలు అని చెప్పలేం. కానీ మొదట్లోనే రాహుల్‌కు బదులుగా అవకాశం లభిస్తే, కొంత చురుకుగా వ్యవహరించేవారు.

రాహుల్‌గాంధీ ప్రియాంకకు యూపీ బాధ్యతలు అప్పగించడం ఆయన రాజకీయ అవగాహనను ప్రశ్నార్థకం చేస్తున్నది. బీజేపీతో ముఖాముఖి తలపడే గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రియాంకను ఉపయోగించుకోలేదు. లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఈ దిశగా ఆలోచించడం లేదు. యూపీలో ఎస్పీ-బీఎస్పీ కూటమి ఏర్పడి మోదీకి సవాలు విసురుతున్న ది. ఈ దశలో యూపీలో కాంగ్రెస్ పార్టీ ఒంటరిగా పోటీ చేసి వీలైతే తమవంతుగా కొన్ని సీట్లు గెలుచుకోవాలె. తాము గెలువకపోయినా ఎస్పీ-బీఎస్పీ కూటమి గెలువడం ద్వారా బీజేపీ దెబ్బతినాలని కోరుకోవాలె.

రాహుల్‌గాంధీ ప్రియాంకకు యూపీ బాధ్యతలు అప్పగించడం ఆయన రాజకీయ అవగాహనను ప్రశ్నార్థకం చేస్తున్నది. బీజేపీతో ముఖాముఖి తలపడే గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రియాంకను ఉపయోగించుకోలేదు. లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఈ దిశగా ఆలోచించడం లేదు. యూపీలో ఎస్పీ-బీఎస్పీ కూటమి ఏర్పడి మోదీకి సవాలు విసురుతున్నది. ఈ దశలో యూపీలో కాంగ్రెస్ పార్టీ ఒంటరిగా పోటీ చేసి వీలైతే తమవంతుగా కొన్ని సీట్లు గెలుచుకోవాలె. తాము గెలువకపోయినా ఎస్పీ-బీఎస్పీ కూటమి గెలువడం ద్వారా బీజేపీ దెబ్బతినాలని కోరుకోవాలె. కానీ తమతో పొత్తు పెట్టుకోలేదనే కారణంగా యూపీలో ప్రియాంకను, జ్యోతిరాదిత్య సింధియాను దింపడం సరైన ఎత్తుగడ కాదు. జ్యోతిరాదిత్య మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి పదవి దక్కలేదనే అసంతృప్తితో ఉన్నారు. ఆయనకు యూపీ పశ్చిమ ప్రాంత బాధ్యతలు అప్పగిస్తే, తీరుబడి లేకుండా మారుతారు. కాంగ్రెస్ పార్టీ అక్కడ గెలువక పోతే అది జ్యోతిరాదిత్య వైఫల్యంగా కనిపిస్తుంది. తూర్పు యూపీలో ప్రియాంక పరిస్థితీ అదే విధంగా ఉంటుంది. కానీ వ్యూహాత్మకంగా కాంగ్రెస్‌కు కలిగే ప్రయోజనం ఏమీ లేదు. ఎనభై సీట్లు ఉన్న యూపీపై ఆశ వదులుకోవాలని కాదు. కానీ తమ శక్తియుక్తులను ఎప్పుడు ఎక్కడ ఉపయోగించుకోవాలనేది యుద్ధ వ్యూహంలో ప్రధానం. ప్రియాంక, జ్యోతిరాదిత్యలను బీజేపీకి వ్యతిరేకంగా ఇతర రాష్ట్రాలలో ఉపయోగించుకుంటే కాంగ్రెస్ పార్టీ మరింత బలంగా మారేది. ప్రధాన శత్రువును వదిలి తటస్థులను శత్రువులుగా మార్చుకోవడం వల్ల లోక్‌సభ ఎన్నికల అనంతర పరిస్థితి ప్రతికూలంగా మారే ప్రమాదం ఉన్నది.

జనగళం

ఆడపిల్లను కాపాడుకుందాం

2008 నుంచి స్త్రీ, శిశు సంక్షేమ శాఖ నుంచి ప్రతి జనవరి 24న భారత జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నది. బాలికల సంరక్షణ పట్ల అవగాహన కల్పించడానికి, బాలికల హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజికంగా ఎదుగుదల అంశాలపై అవగాహన కల్పించడానికి ఈ దినోత్సవం నిర్వహిస్తున్నారు. కానీ ఇది సరిపోతుందా? తాజా జనగణన లెక్కల్లోనూ స్త్రీ, పురుష నిష్పత్తిలో చాలా తేడా కనిపిస్తున్నది. గత జనాభా లెక్కల ప్రకారం.. అక్షరాస్యత శాతాన్ని చూస్తే మహిళల అక్షరాస్యత శాతం 68.4 శాతంగా ఉన్నది. ప్రతి వెయ్యిమంది పురుషులకు 940 మంది మాత్రమే మహిళలున్నట్లు తేలింది. అలాగే, ఆరేండ్ల లోపు ఆడపిల్లలైతే ప్రతి 1000 మంది మగ పిల్లలకు 914 మంది మాత్రమే ఉన్నట్లు జనాభా లెక్కల్లో వెలుగుచూసింది. దీని ప్రభావం కొన్నేండ్లలో కనబడుతుంది.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమైననప్పటికీ భారత్‌లో రెండు దశాబ్దాల కాలంలో కోటి మంది ఆడ శిశువులను పొట్టన పెట్టుకున్న వైనాన్ని బ్రిటన్‌కు చెందిన ఇండిపెండెంట్ పత్రిక బట్టబయలు చేసింది. లింగ వివక్ష వల్ల ప్రతి ఆరుగురిలో ఒక బాలిక చావుకు గురవుతున్నది. యాభై శాతం బాలికలకు పోషకాహారం అందడం లేదు. బాలికల్లో ఇద్దరిలో ఒకరు సరైన పోషకాహారం పొందడం లేదు. ప్రస్తుత లెక్కల ప్రకారం దేశంలో 7 లక్షల మంది అమ్మాయిలు బాల కార్మికులుగా ఉన్నారు. ఈ జాతీయ బాలికా దినోత్సవాన్ని ప్రభుత్వం ప్రారంభించి తొమ్మిదేండ్లు నిండాయి. కానీ అప్పటినుంచి పరిస్థితుల్లో చెప్పుకోదగ్గ మార్పు రాలేదు. బాల్య వివాహాలు జరుగుతూనే ఉన్నాయి. బాలకార్మికులు పెరుగుతూనే ఉన్నారు. ఆడపిల్లల అక్రమరవాణా కొనసాగుతున్నది. వివక్ష కొనసాగుతున్నది. వాటిని రూపుమాపేలా పాఠశాలస్థాయిలో నైతిక, మానవతా విలువలను నేర్పించే విద్యను ప్రవేశపెట్టాలి. బాలికల చదువుకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. బాలికల బంగారు భవిష్యత్ కోసం సమాజం, ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు సమష్టిగా కృషి చేయాలి. వీటిని అరికట్టి బాలికలకు సమాజంలో రక్షణ ఉందనే నమ్మకాన్ని కల్పించే బాధ్యత ప్రభుత్వం, సమాజం తీసుకోవాలి.

- కాళంరాజు వేణుగోపాల్, సీనియర్ ఉపాధ్యాయుడు

(నేడు జాతీయ బాలికా దినోత్సవం)

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

ఆలోకన



టంకశాల అశోక్

'మాయమైన' కులాలు

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కన్పించిన ఒక స్థితి గురించి ఎవరూ మాట్లాడటం లేదు, రాయటం లేదు. వర్గీకరణ వివాదం కారణంగా చిరకాలం పాటు వేర్వేరు పార్టీల మధ్య చీలిపోయి ఓటు చేస్తుండిన మాల-మాదిగలు ఈ ఎన్నికల్లో అదంతా మరిచిపోయి, తక్కిన సమాజంతో పాటు కలిసికట్టుగా సంక్షేమం-అభివృద్ధికి మాత్రమే ఓటు వేశారు. మరొక మాటలో చెప్పాలంటే, ఆర్థికాంశానికి మాత్రమే. దళిత బహుజనవర్గాలకు, సాధారణ సమాజానికి, పార్టీలకు, ప్రభుత్వానికి కూడా ఇందులో అర్థం చేసుకొని అనుసరించదగినది ఎంతైనా ఉన్నది.

వర్గీకరణ పూర్వాపరాలు, ఆ కోరిక న్యాయమైనదన్నది అందరికీ తెలిసిన విషయాలే. అదేవిధంగా, ఆ వివాదాన్ని కాంగ్రెస్, టీడీపీలు చిరకాలంగా తమ రాజకీయ ప్రయోజనకాలం ఎట్లా ఉపయోగించుకుంటూ వస్తున్నాయో, అందువల్ల మాల-మాదిగ విభేదాలు ఎంతకూ పరిష్కారం కాకుండా ఎట్లా పెచ్చరిల్లుతూ వస్తున్నాయో కూడా తెలిసిన విషయమే. ఈ 2018 ఎన్నికల్లోనూ ఈ స్థితిని ఉపయోగించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ఎంఆర్‌పీఎస్‌ను తమ కూటమిలో చేర్చుకున్నది. తెలంగాణలో మాదిగలు ఎక్కువ గనుక అందువల్ల ఓట్లరీత్యా లాభపడవచ్చునని ఆ పార్టీ ఆశించింది. కానీ ఫలితాలు వెలువడిన తర్వాత రోజుల్లో ఈ రచయిత చేసిన విచారణలో తేలిన విషయం మరొక విధంగా ఉన్నది. మాదిగలలో అత్యధికులు టీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేశారు. రాష్ట్రవ్యాప్తంగా అదే జరిగింది. అంతే గమనించదగినది మాలలు కూడా అదే పద్ధతిలో ఓటు వేయటం. ఆ రెండు కులాల మధ్య తేడాలు ఎక్కడా కన్పించలేదు. అందరూ కలసికట్టుగా సంక్షేమం, అభివృద్ధికి ఓటు చేసారు.

దీని అర్థం వారు వర్గీకరణ అంశాన్ని పూర్తిగా వదిలివేశారని కాదు. కానీ దానిని విస్మరించటానికి కొన్ని కారణాలున్నట్లు తేలుతున్నది. వర్గీకరణ విషయం ఎంతకాలం గడిచినా తేలటం లేదు. అందుకు కారణాలు ఏవైనా కావచ్చు. అది తేలగల అవకాశాలు కనుచూపు మేరలో లేవు. ఈ వివాదం మొదలైన తర్వాత ఈ సరికి రెండవ తరం కూడా వచ్చింది. పోతే, వర్గీకరణ అంశం చదువుకున్న వారిది, మధ్య తరగతిది తప్ప మిగిలిన దళితులది కాకుండాపోయింది. సామాన్య దళితులకు గతంలో వలెనే ఇప్పుడు కూడా దైనందిన జీవిత సమస్యలు, ఆర్థిక విషయాలు ప్రధానమయ్యాయి. వర్గీకరణ జరిగితే తమ చదువుకున్న పిల్లలకు ఉపయోగపడుతుందని తొలి దశలో భావించిన మాదిగ కుటుంబాలకు, ఆ పని జరిగే అవకాశం ఎంతకూ కన్పించకపోవటంతో కొంతకాలం క్రితమే దానిని వదిలివేశారు. ఇతర జీవిత సమస్యలు మళ్లీ ప్రధానమయ్యాయి. ఈ అంశాన్ని పార్టీలు ఓట్ల కోసం వాడుకుంటున్నాయి తప్ప జరిగేది ఉండదని కూడా వారిలో కొందరికి అర్థమైనట్లుంది. డిమాండ్ ఎంత న్యాయమైనది అయినప్పటికీ పరిస్థితులు తమను ఓడించినప్పుడు ఏర్పడే నిస్పృహ ఇది.

ఇటువంటి పరిస్థితుల మధ్య తెలంగాణ వాదం ముందుకువచ్చింది. లోగడ కరీంనగర్ లోక్‌సభ ఉప ఎన్నికల్లో కేసీఆర్‌కు, 2014 ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా మాదిగల ఓటును ఎంఆర్‌పీఎస్ ఏ మేరకు ప్రభావితం చేసిందో తెలియదు గాని, ఈ 2018లో మాత్రం అది శూన్యమని చెప్పాలి. ఒకవేళ మాదిగలు కొందరు కాంగ్రెస్‌కు ఓటువేసి ఉంటే అందుకు ఇతర కారణాలు ఉండవచ్చుగాని, వర్గీకరణ వివాదం వల్లనో ఎంఆర్‌పీఎస్ ప్రచారం వల్లనో మాత్రం కాదు. తెలంగాణ ఎంఆర్‌పీఎస్ అంటూ వేరు గా ఏర్పడటం కూడా ఇందుకు కొంత కారణం కావచ్చు. ఇవనీ ఎట్లున్నా సాధారణ మాదిగ జనులకంతా సంక్షేమం, అభివృద్ధి నిర్ణయాత్మక అంశాలు అయాయన్నది గుర్తించవలసిన విషయం.

అంతే గుర్తించవలసిన విషయం, మాదిగలు టీఆర్‌ఎస్‌కు ఓటు చేస్తున్నారనే కారణంతో మాలలు మరొక పార్టీ వైపు తిరుగకపోవటం. మొత్తం తెలంగాణ సమాజానికి, దానిలో భాగంగా దళితులందరికీ సంక్షేమం, అభివృద్ధి అంశాలుగా మారాయని పైననే చెప్పుకున్నాము గనుక, మాదిగల కారణంగా మాలలు మరొకవైపు మారటమన్న ప్రసక్తే రాదు. అందరూ ప్రజలుగా ఓటు వేశారు. సంక్షేమం, అభివృద్ధి ప్రజలందరి కోరికలు గనుక ఆ ప్రకారం వేశారు.

మూడెకరాల భూమి పంపిణీపై దళితులు ఒకవైపు ఆశపెట్టుకున్నారని, అదే సమయంలో మరొకవైపు అది ఆచరణలో ఇంచుమించు అసాధ్యమైనదనే విషయాన్ని కూడా గుర్తించారన్నది ఈ రచయితకు రెండేండ్ల క్రితమే దృష్టికి వచ్చింది. ప్రభుత్వం ఆలోచన మంచిదేనని, కాని ఇద్దామన్నా తమ ఊళ్లలో భూములు లేవని, ప్రాజెక్టులు వస్తున్నందున భూములు అమ్మేందుకు రైతులు సిద్ధంగా లేరని, ధరలు కూడా విపరీతంగా పెరుగుతున్నాయని స్వయంగా దళితులు ఈ రచయితతో అన్నారు. కనుక ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పిస్తే చాలునని, ఏదైనా బతుకుదెరువు కోసమే గదానన్నది వారి సూచన. ఏవో కొన్ని తేడాలతో బహుశా ఇదే పరిస్థితి రాష్ట్రమంతటా ఉన్నదనుకోవాలి. భూమి విషయమై ఎన్నికల సమయంలో ప్రతిపక్షాలు ఎంత ప్రచారం చేసినా ప్రభావం లేకపోవటానికి ఇదొక ముఖ్య కారణమని భావించాలి. పైన చెప్పినట్లు, సంక్షేమం-అభివృద్ధితో ఇతరత్రా కలుగుతున్న సంతృప్తి మరొక ముఖ్య కారణంగా చెప్పాలి. దళితులపై ప్రభుత్వ ఆధ్వర్యాన లైంగికదాడులు అంటూ ఒకటి రెండు ఉదంతాలపై సాగించిన ప్రచారాలను దళిత జన సామాన్యం సీరియస్‌గా తీసుకోకపోవటం కూడా ఈ కారణాల మధ్యనే జరిగిందనుకోవాలి.

వాస్తవానికి ఈ సారి ఓటింగ్‌లో అసలు ఏ కుల గుర్తింపు గాని, విభేదాలు గాని పనిచేయలేదు. తెలంగాణ ప్రజానీకమంతా ఏకోన్ముఖంగా అభివృద్ధికి, సంక్షేమానికి ఓటు చేశారు. ఇవి రెండూ క్రమంగా అనుభవంలోకి వస్తూ ప్రభుత్వంపై నమ్మకం ఏర్పడినా కొద్దీ కులాలతో పాటు అన్ని విషయాలు, తారతమ్యాలు అరొకర విమర్శలు ఏవైనా ఉంటే అవీ వెనుకకుపోయాయి. ఇదే దళితులు, లేదా మాల-మాదిగల విషయంలో కూడా జరిగింది. వీటన్నింటి నుంచి ఆయా కులాలు, ప్రతిపక్షాలు, సాధారణ సమాజం, విమర్శకులు, మేధావులు, ప్రభుత్వం తీసుకోవలసిన పాఠాలు ఏమిటో వేరే వివరించి చెప్పనక్కరలేదు. ఒక్క మాటలో చెప్పుకోవాలంటే ప్రభుత్వం తన పనితీరును మరింత సమర్థవంతంగా కొనసాగించటం, ప్రతిపక్షాలు తమ దృష్టిని మార్చుకోవటం అవసరం.

> తెలంగాణ ప్రజానీకమంతా ఏకోన్ముఖంగా అభివృద్ధికి, సంక్షేమానికి ఓటు చేశారు. ఇవి రెండూ క్రమంగా అనుభవంలోకి వస్తూ ప్రభుత్వంపై నమ్మకం ఏర్పడినా కొద్దీ కులాలతో పాటు అన్ని విషయాలు, తారతమ్యాలు అరొకర విమర్శలు ఏవైనా ఉంటే అవీ వెనుకకుపోయాయి. ఇదే దళితులు, లేదా మాల-మాదిగల విషయంలో కూడా జరిగింది. వీటన్నింటి నుంచి ఆయా కులాలు, ప్రతిపక్షాలు, సాధారణ సమాజం, విమర్శకులు, మేధావులు, ప్రభుత్వం తీసుకోవలసిన పాఠాలు ఏమిటో వేరే వివరించి చెప్పనక్కరలేదు.

భావ ప్రకటనే దేశద్రోహమా?

జాతీయం



మేక్‌పీస్ సిట్‌లో

అభిప్రాయాలను వ్యక్తం చేయటమే ఈశాన్య భారతంలో దేశద్రోహమైపోయింది. భావప్రకటనా స్వేచ్ఛతో తమ అభిప్రాయాలను వ్యక్తపర్చటాన్నే ప్రభుత్వాన్ని కూల్చటానికి కుట్ర పన్నారని ప్రభుత్వం అంటున్నది. అయితే ఇది ఈశాన్య రాష్ట్రాల్లో కొత్త కాదు. 1980 దశకం నుంచి ఈశాన్య రాష్ట్రాల్లో జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ), చట్టపరంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూల్చటానికి కుట్రపన్నారనే నెపంతో కేసులు పెట్టడం పరిపాటి అయ్యింది. అయితే ఈ మధ్య మరింత దూకుడుగా ప్రభుత్వం మేధావులు, కార్యకర్తలు, జర్నలిస్టులపై దేశ ద్రోహనేరం మోపి జైల్లో పెట్టడం పట్ల దేశవ్యాప్తంగా నిరసన వ్యక్తమవుతున్నది.

ఈ నెల జనవరి 10న అస్సాం సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత హిరేన్ గోహైన్, కృషక్ ముక్తి సంగ్రామ్ సమితి నేత అఖిల్ గొగోయ్, ప్రముఖ జర్నలిస్టు మంజిత్ మహంతాలను దేశద్రోహ నేరం కింద ప్రభుత్వం అరెస్టు చేసింది. వీరిపై 124ఏ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా యుద్ధం ప్రకటించారన్న ఆరోపణలతో (121,123)పలు సెక్షన్లపై కేసులు నమోదు చేసింది. వారు జనవరి 7న ఓ సభలో పౌరసత్వ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ఉపన్యసించటమే ఈ కేసులు మోపటానికి కారణం.

గొగోయ్‌పై ఇలాంటి కేసులు పెట్టడం కొత్త కాదు. గతంలోనూ ఆయనపై ఇలాంటి కేసులు ప్రభుత్వం పెట్టింది. 2017లోనూ ఆయనను జాతీయ భద్రతా చట్టం కింద అరెస్టు చేసింది. హిరేన్ గోహైన్‌పై బీజేపీ ప్రభుత్వం ఇలాంటి తీవ్ర చట్టాలు ప్రయోగించటం పట్ల సర్వత్రా విమర్శలు చెలరేగుతున్నాయి. ఓ మేధావిగా గోహైన్ తన అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించటమే అస్సాం ప్రభుత్వం నేరంగా పరిగణిస్తున్నది. ప్రజా కార్యకర్తలను కట్టడి చేయటం కోసం అస్సాం ఉద్యమం తీవ్రంగా నడిచిన సందర్భంలోనూ ఇలాంటి కేసులనే ప్రభుత్వం ప్రయోగించింది. 1979-85 మధ్యకాలంలో అస్సాం ఉద్యమం తీవ్రంగా నడుస్తున్నకాలంలో ఉద్యమ నేతలను ఇలాంటి తీవ్ర నేరారోపణలతోనే నిర్బంధించారు. 1990 ప్రాంతంలో ఉల్ఫా ఉద్యమం ఉచ్ఛస్థాయిలో నడుస్తున్నకాలంలో భద్రతా బలగాలు, సైన్యం పెద్ద ఎత్తున మానవహక్కుల ఉల్లంఘనలకు పాల్పడ్డాయన్న ఆరోపణలున్నాయి. ఆ సందర్భంలో జర్నలిస్టులు అజిత్ భుయాన్, పరాగ్‌కుమార్ దాస్, న్యాయవాది నిలోయ్‌దత్తా తదితరులు మానవ్ అధికార్ సంగ్రామ్ సమితి(ఎంఎస్ఎస్) తరపున హక్కుల ఉల్లంఘనను వెలుగులోకి తెచ్చారు. వారు ఈ వివరాలతో ఢిల్లీలో పత్రికా సమావేశం ఏర్పాటు చేసి అస్సాంలో భద్రతా బలగాలు చేస్తున్న లైంగికదాడులను, దౌర్జన్యాలను ప్రపంచానికిచాటారు. దీంతో ఆగ్రహించిన ప్రభుత్వం వారిపై నాసా చట్టం ప్రయోగించి అరెస్టులు చేసింది. ఎలాంటి నిర్దిష్ట ఆరోపణలు లేకుండానే కేవలం భద్రతా బలగాల లైంగికదాడులను ప్రశ్నించినందుకు జాతీయ భద్రతా చట్టాన్ని ప్రయోగించారని భుయాన్ తెలిపారు. ఇది మొదలు ఈ దశాబ్దాల కాలంలో ఆయనను ఎన్నోసార్లు ప్రభుత్వం అరెస్టు చేసింది. టాడా లాంటి క్రూర చట్టాన్ని ఆయనపై మోపింది. మానవ హక్కుల ఉల్లంఘనలను, ప్రభుత్వ అవినీతిని ఎండగట్టినందుకే ప్రభుత్వం కక్షగట్టి కేసులు బనాయించి నిర్బంధించింది. ప్రభుత్వం పెట్టిన కేసులేవీ కోర్టుల్లో నిలువలేదు. అన్నింట్లో నిర్దోషిగా ఆయనను కోర్టులు తేల్చాయి. మరోవైపు ప్రభుత్వ కక్షసాధింపు చర్యలు మరింత పెరిగాయి. పరాగ్‌కుమార్ దాస్‌ను పట్టపగలే గుర్తు తెలియని వ్యక్తులు హత్యచేశారు. ఆయన అస్సాం రాజధాని గౌహతిలో తన కుమారున్ని పాఠశాల నుంచి ఇంటికి తీసుకు వస్తుండగా దుండగులు దాడిచేసి ప్రాణాలు బలిగొన్నారు. అక్రమ నిర్బంధాలు, అరెస్టులు అటుంచి, అజిత్ భుయాన్‌ను అనేకమార్లు బెదిరింపులకు గురిచేశారు. ప్రఫుల్ల కుమార్ మహంత హయాంలో ఆయనపై పలు మార్లు హత్యాయత్నాలు కూడా జరిగాయి. అయినా ఆయన మహంతాకు ఎల్లప్పుడు మద్దతుదారుగానే ఉన్నారు.



ప్రముఖ కవి సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత హరికృష్ణ దేకా 90వ దశకం తర్వాతికాలంలో నాసా లాంటి చట్టాలను చాలా అరుదుగా ప్రయోగించటం జరిగిందని తెలిపారు. తరుణ్ గొగోయ్ హయాంలో అస్సాం డీజీపీగా పనిచేసిన ఆయన అరుదైన సందర్భాల్లోనే నాసా చట్టాలను వినియోగించామని చెప్పుకొచ్చారు. కానీ జనవరి 7న గోహైన్ లాంటి మేధావులపై దేశద్రోహ నేరం మోపటం దారుణమంటున్నారు. ఒక రకంగా బీజేపీ ప్రభుత్వం సాధారణ ఎన్నికలకు ముందు ఇలాంటి చర్యలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నదని విమర్శించారు. ఇద్దరు అస్సాం మాజీ ముఖ్యమంత్రులు తరుణ్ గగోయ్, ప్రఫుల్ల కుమార్ మహంత, ప్రముఖ సీపీఎం నేతల లాంటివారు కూడా బీజేపీ తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ బిల్లును విమర్శిస్తున్నారు. వారిపై కూడా ప్రభుత్వం దేశద్రోహ నేరం మోపుతుందా అని ప్రశ్నిస్తున్నారు. తాజాగా గోహైన్, గొగోయ్, మహంతాలపై మోపిన దేశ ద్రోహం కేసులు అభిప్రాయ ప్రకటనకు వ్యతిరేకంగానే పెట్టినవిగా అర్థమవుతున్నదని, ఇది అస్సాం పరిస్థితికి అద్దం పడుతున్నదని తెలిపారు.

జాతీయ నేరగణాంక బ్యూరో ప్రకారం.. 2014 తర్వాత ఈశాన్యరాష్ట్రాల్లో రాజద్రోహం లాంటి తీవ్ర చట్టాల ప్రయోగించిన ఉదంతాలు తక్కువగానే ఉన్నాయి. కానీ ఐపీసీ సెక్షన్లు 121, 121ఏ, 122, 123 లాంటి వాటి కింద కేసుల నమోదు ఎక్కువగానే ఉన్నది. ముఖ్యంగా ఈశాన్యరాష్ట్రాలైన అస్సాం, మేఘాలయ, మణిపూర్‌లలో ఈ కేసులు ఎక్కువగా మోపబడ్డాయి. ఇలాంటి కేసులు ముఖ్యంగా తీవ్రవాద గ్రూపులపై మోపారు. ముందు జాగ్రత్త చర్య ల్లో భాగంగా వ్యక్తులను నిర్బంధించటం కూడా పరిపాటిగా సాగింది. ప్రభుత్వాన్ని కూలదోయటానికి కుట్రపన్నారనే అభియోగం మోపటాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టి నా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం అలాంటి కేసులు మోపుతూనే ఉన్నాయి. గత 40 ఏండ్లలో నాసా చట్టాల లాంటి ప్రయోగాన్ని 95 శాతం కేసుల్లో తొలిగించింది.

ఇదే సందర్భంలో ఇలాంటి నల్ల చట్టాలను అనేక రాజకీయ పార్టీలు కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. బ్రిటిష్ కాలం నాటి నల్ల చట్టాలను ఇప్పుడు కూడా యథాతథంగా ప్రయోగించటాన్ని తప్పుబడుతున్నారు. కానీ ఈశాన్య రాష్ట్రాల బీజేపీ అధికార ప్రతినిధిగా ఉన్న రామ్ మాధవ్ మాత్రం ఈ ప్రాంతంలోని విచ్ఛిన్నకర ఉద్యమాలను చట్టపరిధిలోనే కట్టడి చేస్తామని చెప్పుకొస్తున్నారు. ఈ నేపథ్యంలోనే గౌహతి హైకోర్టు గోహైన్, గొగోయ్‌లకు ముందస్తు బెయిల్ ఇచ్చింది. జర్నలిస్టు మహతాకు పూర్తి బెయిల్ మంజూరుచేసింది. కానీ జర్నలిస్టు కిశోర్ చంద్రవాంగ్ ఖేమ్‌ను మాత్రం గత రెండు నెలలుగా అక్రమ నిర్బంధంలోనే ఉంచింది.

వాంగ్‌ఖేమ్ 2018 నవంబర్ 20న దేశ ద్రోహనేరంపై అరెస్టు చేయబడ్డారు. ఆయనను మణిపూర్ ముఖ్యమంత్రిని వీడియోల ద్వారా, సోషల్ మీడియాలో విమర్శించినందుకు గాను దేశద్రోహ నేరం మోపారు. ఆయనపై మోపిన కేసును దేశద్రోహ నేరంగా పరిగణించజాలమని ఇంఫాల్ కోర్టు ఆయనను నిర్దోషిగా ప్రకటించి విడుదల చేసింది. ఈ సందర్భంగా కోర్టు వెలిబుచ్చిన అభిప్రాయం గమనించదగ్గది. ప్రభుత్వం ముఖ్యంగా ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి తదితరులను విమర్శించినంత మాత్రాన దేశద్రోహంగా పరిగణించటం తగదని హితవు పలికింది. ఇలాంటి ఉదంతాలను ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్నో చెప్పుకోవచ్చు. ప్రభుత్వాలను విమర్శించినందుకు వారిపై దేశద్రోహ నేరం మోపి అక్రమ నిర్బంధాలకు పాల్పడ టం జరుగుతున్నది. అలాగే మణిపూర్ యూనివర్సిటీ విద్యార్థులను కూడా ప్రభుత్వాన్ని కూల్చటానికి కుట్రపన్నారన్న అభియోగాలపై అరెస్టు లు చేశారు. జైళ్లలో నిర్బంధించారు. ఇది ఒకరకంగా ప్రభుత్వ అసహనానికి తార్కాణంగా చెప్పుకోవచ్చు.

> ప్రభుత్వం ముఖ్యంగా ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి తదితరులను విమర్శించినంత మాత్రాన దేశద్రోహంగా పరిగణించటం తగదని హితవు పలికింది. ఇలాంటి ఉదంతాలను ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్నో చెప్పుకోవచ్చు. ప్రభుత్వాలను విమర్శించినందుకు వారిపై దేశద్రోహ నేరం మోపి అక్రమ నిర్బంధాలకు పాల్పడటం జరుగుతున్నది. అలాగే మణిపూర్ యూనివర్సిటీ విద్యార్థులను కూడా ప్రభుత్వాన్ని కూల్చటానికి కుట్రపన్నారన్న అభియోగాలపై అరెస్టు లు చేశారు. జైళ్లలో నిర్బంధించారు. ఇది ఒకరకంగా ప్రభుత్వ అసహనానికి తార్కాణంగా చెప్పుకోవచ్చు.

(వ్యాసకర్త: ఈశాన్య ప్రాంత వ్యవహారాల విశ్లేషకులు, పాత్రికేయురాలు)

'దివైర్' సౌజన్యంతో...

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

నేటి నుంచి జాన్‌పహాడ్ ఉర్సు

■ రేపు గంధం ఊరేగింపు



పాలకవీడు: నాలుగు వందల ఏండ్ల చరిత్ర కలిగి, హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీకగా నిలిచే జాన్ పహాడ్ ఉర్సు గురువారం నుంచి ప్రారంభం కానున్నది. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం జానపహాడ్‌లో 24, 25, 26 తేదీల్లో నిర్వహించే వేడుకకు తెలంగాణ ప్రభుత్వం, రాష్ట్ర వక్ఫ్ బోర్డు అన్ని ఏర్పాట్లు చేసింది. నిర్వహణకు ప్రభుత్వం రూ.6.50 లక్షలు కేటాయించింది. గురువారం తెల్లవారుజామున నమాజ్ రసూల్ షరీఫ్ కార్యక్రమంతో ఉర్సు ప్రారంభం అవుతుంది. శుక్రవారం గంధం ఊరేగింపు జరుగనుంది. శనివారం ప్రత్యేక దీపారాధనతో ఉత్సవం ముగుస్తుంది. ఈ ఉర్సుకు తెలంగాణ నుంచే కాకుండా ఆంధ్ర తదితర ప్రాంతాల నుంచి లక్ష మంది భక్తులు వస్తారని అంచనా.

పెద్దగట్టు జాతరకు రూ.1.70 కోట్లు విడుదల



సూర్యాపేట జిల్లా కేంద్రంలో సీఎం కేసీఆర్, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న యాదవులు

సూర్యాపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ: సూర్యాపేట జిల్లా కేంద్రం సమీపంలోని దురాజ్‌పల్లిలో జరిగే పెద్దగట్టు లింగమంతులస్వామి జాతరకు ప్రభుత్వం రూ.1.70 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు బుధవారం జీవో విడుదలచేసింది. తెలంగాణ ఏర్పాటు అనంతరం సీఎం కేసీఆర్ ఈ జాతర నిర్వహణకు 2015లో రూ.2.10 కోట్లు, 2017లో రూ.1.29కోట్లు మంజూరు చేశారు. వరుసగా మూడోసారి.. వచ్చే నెలలో జరుగబోయే జాతరకు నిధులు మంజూరు చేయడంపై యాదవులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద జాతరగా పేరొందిన పెద్దగట్టు లింగమంతుల జాతరపై ఉమ్మడి రాష్ట్రంలో నిర్లక్ష్యం ప్రదర్శించారని, సీఎం కేసీఆర్ రెండేండ్లకు ఒకసారి నిధులవరద పారిస్తున్నారని చెప్పారు. ఈ నిధులతో ఆలయం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. నిధుల మంజూరుపై హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద యాదవులు సీఎం కేసీఆర్, మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

రాష్ట్రంలో నేడు, రేపు వానలు!

■ చలిగాలులతో కనిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గొచ్చు

హైదరాబాద్ సిటీబ్యూరో/ హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉత్తర తమిళనాడు తీరానికి దగ్గరలో ఉన్న నైరుతి బంగాళాఖాతంలో 0.9 కిలోమీటర్ల ఎత్తువరకు ఏర్పడిన ఉపరితల ఆవర్తనానికి అనుబంధంగా తెలంగాణ నుంచి రాయలసీమ వరకు 0.9 కిలోమీటర్ల ఎత్తువరకు ఉపరితల ద్రోణి ఏర్పడిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఈ ప్రభావంతో రాష్ట్రంలో గురు, శుక్రవారాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో రాగల 36 గంటల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురువొచ్చన్నారు. ఉత్తర భారతదేశం నుంచి చలిగాలులు వీస్తుండటంతో చలి పెరిగొచ్చని చెప్పారు.

గ్రేటర్‌పై మరో రెండురోజులు పొగమంచు

హైదరాబాద్ వాతావరణ కేంద్రం బుధవారం వెల్లడించింది. రెండు రోజులపాటు పొడి వాతావరణం, పొగమంచు ఏర్పడొచ్చని పేర్కొన్నది. మరోవైపు బుధవారం నగరంలో ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. గరిష్ఠ ఉష్ణోగ్రత సాధారణం కంటే 0.4 డిగ్రీలు పెరిగి 31.4 డిగ్రీలుగా, కనిష్ఠ ఉష్ణోగ్రత సాధారణం కంటే 0.9 డిగ్రీలు పెరిగి 17.9 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైందని అధికారులు తెలిపారు.

చలికాలం

జిల్లా	కనిష్ఠం	గరిష్ఠం	జిల్లా	కనిష్ఠం	గరిష్ఠం
సంగారెడ్డి	12.6	34.7	సిద్దిపేట	16.6	33.3
నాగర్‌కర్నూల్	12.8	34.6	మంచిర్యాల	16.8	31.0
సూర్యాపేట	13.0	31.0	ఆసిఫాబాద్	16.8	31.0
జనగామ	13.3	33.1	ఆదిలాబాద్	16.8	31.0
మహబూబ్‌నగర్	13.3	34.6	వరంగల్ అర్బన్	17.0	29.5
కరీంనగర్	14.1	34.6	వరంగల్ రూరల్	17.0	31.0
యాదాద్రి	14.2	34.6	ఖమ్మం	17.0	31.0
వికారాబాద్	14.4	29.3	జయశంకర్	17.0	31.0
వనపర్తి	14.5	35.0	హైదరాబాద్	17.9	31.4
నిర్మల్	15.0	31.0	మేడ్చల్‌మల్కాజిగిరి	17.9	31.4
మెదక్	15.1	34.6	రంగారెడ్డి	17.9	31.4
జోగులాంబ గద్వాల	15.3	34.6	నిజామాబాద్	17.9	32.5
మహబూబాబాద్	15.8	34.6	నల్లగొండ	18.0	29.4
భద్రాద్రి కొత్తగూడెం	16.0	32.0	రాజన్న సిరిసిల్ల	18.0	32.0
			జగిత్యాల	18.0	32.0
			పెద్దపల్లి	18.4	30.0
			కామారెడ్డి	19.0	29.0



ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలో ఖాందేవ్ జాతర వైభవంగా కొనసాగుతున్నది. బుధవారం భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. - నార్నూర్



ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముక్రా (కే) పంచాయతీ పాలకవర్గం, గ్రామస్థులు బుధవారం సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. తమ గ్రామాన్ని పంచాయతీగా ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతగా ఈ కార్యక్రమం నిర్వహించినట్టు వారు తెలిపారు. - ఇచ్చోడ



సిద్దిపేటలో మహిళలకు జూట్ బ్యాగులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిద్దాం

■ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపు

సిద్దిపేట కలెక్టరేట్, నమస్తే తెలంగాణ: ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నిషేధిద్దామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం సిద్దిపేటలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డితోకలిసి పలు సామూహిక భవనాలకు ప్రారంభోత్సవాలు, రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఒక మొక్క పెంచాలని కోరారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంతో పట్టణం మరింత పరిశుభ్రంగా రూపుదిద్దుకుంటుందన్నారు. నూతనంగా గెలుపొందిన సర్పంచులు, వార్డు మెంబర్లు, కార్యకర్తలు, ఆయాగ్రామాల ప్రజలు ఎమ్మెల్యే హరీశ్‌రావును కలిసేందుకు తరలివస్తున్నారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గాలకు ఎమ్మెల్యే హరీశ్‌రావు అభినందనలు తెలిపారు.

వన్యప్రాణులను చంపితే నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టాలి

■ ఢిల్లీ హైకోర్టు లాయర్ మృదుల, ఏటీఆర్ ఫీల్డ్ డైరెక్టర్ వినోద్

అమ్రాబాద్ రూరల్: వన్యప్రాణులను చంపినవారిపై అటవీసంరక్షణ చట్టం ప్రకారం నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని.. అప్పుడే మరో ఘటనకు ఆస్కారం ఉండదని ఢిల్లీ హైకోర్టు న్యాయవాది మృదుల, ఏటీఆర్ ఫీల్డ్ డైరెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూర్ వన్యప్రాణి విజ్ఞానకేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. అటవీ జంతువులు మరణించినప్పుడు ప్రాథమిక నివేదిక చాలా జాగ్రత్తగా రాయాలని.. దాని ఆధారంగానే ఘటనకు కారకులైన వ్యక్తులపై కఠినచర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. నిందితులకు ఏడేండ్లకు పైబడి శిక్షపడేలా జాగ్రత్తవహిస్తే బెయిల్ వచ్చే అవకాశం ఉండదన్నారు.


ఓటేయలేదని తిట్టడంతో ఆత్మహత్యాయత్నం

తిరుమలాయపాలెం: పంచాయతీ ఎన్నికల్లో తాము ఇచ్చిన డబ్బులు తీసుకొని ఓట్లు వేయలేదని కొంత మంది కాంగ్రెస్ సానుభూతి పరులు తిట్టడంతో మనస్తాపం చెందిన ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించి ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతున్నది. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన పులుసు రోజాను బుధవారం సాయంత్రం కొంత మంది కాంగ్రెస్ నాయకులు డబ్బులు తీసుకొని ఓటు ఎందుకు వేయలేదంటూ అసభ్య పదజాలంతో దుర్భాషలాడారు. దీంతో ఆమె ఉరివేసుకొని ఆత్మహత్యకు యత్నించింది. ప్రాణాపాయస్థితిలో ఉన్న ఆమెకు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్సలు చేయిస్తున్నారు. ఈ విషయమై కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయనున్నారని టీఆర్ఎస్ నాయకుడు జడల నగేశ్ తెలిపారు.

సిరిసిల్లలో 4.99 లక్షలు స్వాధీనం

గంభీరావుపేట: గంభీరావుపేట మండలంలోని పెద్దమ్మ చెక్‌పోస్టు వద్ద బుధవారం రాత్రి రూ.4.99 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఫ్లైయింగ్ స్క్వాడ్ ఎన్నికల అధికారులు తెలిపారు. మహారాష్ట్ర నాగ్‌పూర్‌కు చెందిన మహ్మద్ రిజ్వాన్ అనే వ్యాపారి వద్ద కారులో నగదును పట్టుకున్నట్లు ఆర్ఐ ప్రవీణ్ తెలిపారు.

రూ.50 వేల విలువైన మద్యం పట్టివేత



మహబూబ్‌నగర్ జిల్లాలో ఎక్సైజ్ పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన మద్యం కాటన్లు

జడ్చర్ల టౌన్ : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం గంగాపూర్ గ్రామ శివారులో బుధవారం ఎక్సైజ్ పోలీసులు రూ.50 వేల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ ఖలీద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రెండో విడత పంచాయతీ ఎన్నికల సందర్భంగా రూట్‌వాచ్‌లో భాగంగా పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా.. అర్షద్, గోపాల్ అనే అనే వ్యక్తులు రెండు కార్లలో మద్యం తీసుకెళ్తుండగా ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

గ్రామస్వరాజ్యమే లక్ష్యం

టీఆర్ఎస్ హయాంలో గ్రామాలకు మహర్దశ ■ సర్పంచ్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేసిన ఎమ్మెల్యేలు ■ మరోసారి అభివృద్ధికే పట్టం కట్టాలని పిలుపు



నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: గ్రామ స్వరాజ్యమే టీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పేర్కొన్నారు. టీఆర్ఎస్ హయాంలోనే గ్రామాలకు మహర్దశ పట్టిందని, సీఎం కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నదని స్పష్టంచేశారు. బుధవారం ఆయన నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలంలోని తాండ్ర, పంజుగుల, చారకొండ, శిరుసనగండ్ల, తుర్కలపల్లి, తిమ్మాయిపల్లి గ్రామాల్లో, రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం మంగళపల్లి, పోలేపల్లి, ఆకుతోటపల్లిలో టీఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేశారు.

ఒక్క గుంటనూ ఎండనివ్వను

ఒక్క గుంట కూడా ఎండకుండా రెండు పంటలకు సాగునీరు అందేలా చూస్తానని ఎమ్మెల్యే సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని బలిజపల్లి, పామిరెడ్డిపల్లి, దొడగుంటపల్లి, చీకర్‌చెట్టు తండా, వీరాయిపల్లి, చిన్నమందడి, అల్వాల, పెద్దమందడి, మోజర్ల, గట్లఖానాపూర్ గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుతం మండలంలోని అన్ని గ్రామాల్లో పెద్దమందడి బ్రాంచ్ కెనాల్ ద్వారా సాగునీటిని తీసుకువచ్చి ఒక పంటకు నీరిచ్చామని, రెండు పంటలకు సాగునీరు అందించే బాధ్యత తనదేనన్నారు. టీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రతిపక్ష అభ్యర్థులకు ఓటేస్తే ఎలాంటి ఉపయోగం ఉండదని, వాళ్లు గెలిస్తే కాళ్లకు కట్టెలు అడ్డం పెట్టినట్టు అవుతుందని స్పష్టంచేశారు.

టీఆర్ఎస్ మద్దతుదారులనే గెలిపించండి

గ్రామపంచాయతీ ఎన్నికల్లో టీఆర్ఎస్ మద్దతుతో బరిలో ఉన్న సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరు మండలం ఇప్పలపల్లి, గాజులపేట గ్రామాల్లో టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులకు మద్దతుగా ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.



వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

25న జరుగనున్న ఎన్నికల్లో గాజులపేటలో వెంకటయ్య గుర్తు బ్యాట్, ఇప్పలపల్లిలో రామేశ్వర్‌రావు గుర్తు ఉంగరంకు ఓటు వేయాలని కోరారు. టీఆర్ఎస్ పార్టీ మద్దతిచ్చిన అభ్యర్థులను గెలిపిస్తే అభివృద్ధి జరుగుతుందని చెప్పారు.

రెండో విడుతలోనూ గులాబీ హవా

రెండోవిడత పంచాయతీ ఎన్నికల్లో టీఆర్ఎస్ మద్దతుదారులు అధిక స్థానాల్లో గెలుపొంది గులాబీ హవా కొనసాగాలని ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్‌రూరల్ మండలంలోని కోటకదిర, పోతన్‌పల్లి, మాచన్‌పల్లి తండా, హన్వాడ మండలం గుడిమల్కాపూర్‌లో టీఆర్ఎస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే, పంచాయతీ ఎన్నికల్లోనూ అభివృద్ధిని చూసి ఓటేయాలని కోరారు.

టీఆర్ఎస్ మద్దతుదారులను ఆశీర్వదించండి

పంచాయతీ ఎన్నికల్లో టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం నీలిపల్లి, ఎల్కూర్, మల్దకల్, పెద్దొడ్డి గ్రామాల్లో జెడ్పీ చైర్మన్ బండారి భాస్కర్‌తోకలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో అభివృద్ధి జరుగాలంటే సర్పంచ్ ఎంతో కీలకమన్నారు. టీఆర్ఎస్ మద్దతుదారులు గెలిస్తే ఎంతో అభివృద్ధి జరుగుతుందని అన్నారు.



మహబూబ్‌నగర్ జిల్లా మాచన్‌పల్లి తండాలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్

రంగారెడ్డిలో మళ్లీ టీఆర్ఎస్ హవా

రెండోవిడుత ఎన్నికల్లోనూ రంగారెడ్డిజిల్లాలో టీఆర్ఎస్‌హవా కొనసాగుతుందని మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, టీఆర్ఎస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పట్నం అవినాశ్‌రెడ్డితోకలిసి పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలు మహారాష్ట్ర ప్రజలకు ఆదర్శంగా నిలిచాయని, అక్కడి నుంచి ఎంతోమంది ప్రజలు తెలంగాణకు వలస వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

ఇరిగేషన్ ప్రాజెక్టుల పనుల్లో వేగం పెంచాలి

■ నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
■ సీఎం కార్యాలయ కార్యదర్శి స్మితా సబర్వాల్ ఆదేశం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీజీకొత్తూరు వద్ద సీతారామ ప్రాజెక్టు మెయిన్‌పంప్‌హౌస్ పనులను పరిశీలిస్తున్న సీఎం కార్యాలయ కార్యదర్శి స్మితా సబర్వాల్

జయశంకర్ భూపాలపల్లి (కన్నాయిగూడెం)/భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ/భీమారం(వరంగల్): నీటి పారుదల ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలని సీఎం కార్యాలయ కార్యదర్శి స్మితా సబర్వాల్ అధికారులను ఆదేశించారు. బుధవారం భూపాలపల్లి జిల్లా దేవాదుల ప్రాజెక్టుకు సంబంధించిన తుపాకులగూడెం బరాజ్‌వద్ద, వరంగల్ అర్బన్ జిల్లా హసన్‌పర్తి మండలం దేవన్నపేట, ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల వద్ద జరుగుతున్న పంప్‌హౌస్, సర్జిపూల్, టన్నెల్ పనులను, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు జరుగుతున్న సీతారామ ప్రాజెక్టు ఎత్తిపోతల పథకం ప్రధాన పంప్‌హౌస్ ప్రధానపనులను ఆమె పరిశీలించారు. తుపాకులగూడెం బరాజ్ నిర్మాణంలో వేగంపెంచాలని అధికారులను ఆదేశించారు. బరాజ్ నిర్మాణానికి సంబంధించి వివరాలు ఇంజినీర్ ఇన్ చీఫ్ మురళీధర్‌ను అడిగి తెలుసుకున్నారు. బరాజ్‌వద్ద నదీ ఒడ్డు వైపు, గోదావరి నదీలో జరుగుతున్న పియర్స్ నిర్మాణ కాంక్రీటు పనులను పరిశీలించారు. పనులు వేగంగా కాకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బరాజ్‌కు సంబంధించి కొన్ని డిజైన్‌లు అప్రూవల్ కాకుండా పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు వివరించారు. ఈ నెలాఖరులోగా అన్ని డిజైన్లు అందచేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఆమె హామీఇచ్చారు. వచ్చే నెల 10 నుంచి పనులో వేగం పెంచాలని ఆదేశించారు. దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా ఫేజ్-3 పనులను 2020 జూన్ నాటికి పూర్తి చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించారని, ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్మితాసబర్వాల్ అధికారులను ఆదేశించారు. దేవాదుల ఎత్తిపోతల పథకంలో భాగంగా దేవన్నపేట- ఉనికిచర్ల వద్ద నిర్మిస్తున్న పంపుహౌస్‌ను, సర్జ్‌పూల్‌ను స్మితాసబర్వాల్ పరిశీలించారు.

సీతారామ ప్రాజెక్టు పనులపై ప్రతీరోజు నివేదికలు పంపాలి

భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోని సుమారు ఏడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే సీతారామ ప్రాజెక్టు ఎత్తిపోతలపథకం పనులను వేగవంతం చేయాలని, ప్రతీ రోజు పనుల పురోగతిపై నివేదికలు పంపాలని ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి స్మితా సబర్వాల్ ఆదేశించారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న వరంగల్ సీపీ విశ్వనాథ్ రవీందర్

నకిలీ నక్సల్స్ ముఠా అరెస్ట్

■ మూడు నాటు తుపాకులు.. రూ.5.56 లక్షల నగదు సీజ్

నయీంనగర్, (వరంగల్): నాటు తుపాకులతో బెదిరించి దోపిడీలకు పాల్పడుతున్న నకిలీ నక్సలైట్ ముఠాను వరంగల్ పోలీసులు అరెస్ట్ చేశా రు. మూడు తుపాకులు, 10 తూటాలను స్వాధీ నం చేసుకున్నారు. కేసు వివరాలను వరంగల్ సీపీ విశ్వనాథ్ రవీందర్ బుధవారం వెల్లడించా రు. జనగామ జిల్లా కొడకండ్ల మండలం చెరువుముందు తండాకు చెందిన ఇస్లావత్ శంకర్, నల్గొండ జిల్లా పేరేపల్లికి చెందిన గంగారపు స్వామి గతంలో జనశక్తిపార్టీ అనుబంధ రైతు సంఘంలో పనిచేశారు. అక్రమంగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో.. నల్లగొండ జిల్లా చిట్యాల మండలానికి చెందిన నారబోయిన మల్లేశం, పాలకుర్తి మండలం చెన్నూరుకు చెందిన పిట్టల శ్రీనివాస్, చిలూరి పరమేశ్, నల్లగొండ జిల్లా ఎన్‌జీ కొత్తపెల్లికి చెందిన సరిపంగి విప్లవ్‌ను కలుపుకొని ముఠాగా ఏర్పడ్డారు. ఈ నెల 15న జనగామ జిల్లా కొడకండ్ల వైన్‌షాపు సిబ్బంది డబ్బు తీసుకొని వెళ్తుండగా మొండ్రాయి సమీపంలో వారిపై దాడిచేసి రూ.5.56 లక్షల దోచుకెళ్లారు. బాధితుల ఫిర్యాదుమేరకు పోలీసులు ముఠాను అరెస్టుచేశారు. రూ.5.56 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

కోడలిని చంపిన మామ

కృష్ణ: వివాహేతర సంబంధం పెట్టుకుందన్న అనుమానంతో మామ.. కోడలిని హతమార్చిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగింది. కృష్ణ మండలం ముడుమాల్‌కు చెందిన లక్ష్మి(40) భర్త పదేండ్ల కిందట మృతి చెందాడు. ఆమె వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నదన్ని మామ పోతుల సాంతప్ప అనుమానం పెంచుకున్నాడు. మంగళవారం అర్ధరాత్రి లక్ష్మి నిద్రిస్తుండగా రోకలి బండతో కొట్టిచంపాడు. అనంతరం పోలీసులకు లొంగిపోయాడు.

ఏఆర్ ఎస్సై షకీల్ పాషా సస్పెన్షన్

నిజామాబాద్ క్రైం: ఇటీవల ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ ప్రాంతంలో కలప అక్రమరవాణా చేస్తూ పట్టుబడిన ముఠాలో నిజామాబాద్ ఏఆర్ ఎస్సై షకీల్ పాషా ఉన్నట్టు పోలీసులు నిర్ధారించారు. దీంతో షకీల్ పాషాను సస్పెండ్ చేస్తూ నిజామాబాద్ రేంజ్ డీఐజీ ఎన్ శివశంకర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

ఇంట్లో పేలిన గ్యాస్ సిలిండర్



సిలిండర్ పేలడంతో చెల్లాచెదురైన సామగ్రి

ముత్తారం: పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని కేశనపల్లిలో బుధవారం ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలింది. మూనిఘుళ వాణి ఇంట్లో గ్యాస్ పొయ్యిపై బియ్యం పెట్టి, ఇంటి ముందు వేరే పనిచేసుకుంటున్నది. కొద్దిసేపటికే ఒక్కసారిగా పెద్దశబ్దంతో గ్యాస్ సిలిండర్ పేలింది. ఇంట్లోని సామగ్రి చెల్లాచెదురుగా పడిపోయింది. ప్రమాదసమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.

టీఆర్ఎస్‌లోకి చేరికల జోష్



జనగామ జిల్లా పాలకుర్తిలో టీఆర్ఎస్‌లో చేరినవారితో ఎమ్మెల్యే ఎర్రబెల్లి

నెట్‌వర్క్ నమస్తే తెలంగాణ: టీఆర్ఎస్‌లోకి వలసలు కొనసాగుతున్నాయి. బుధవారం వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డుసభ్యులు భారీసంఖ్యలో పార్టీలో చేరారు. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం ఆర్లెగూడెం, నారాయణపురం గ్రామాలకు చెందిన 150 మంది కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ సమక్షంలో, తుంగతుర్తి మండల పరిధిలోని వెంపటి గ్రామానికి చెందిన 20 కుటుంబాల వారు తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం పారువెల్లకి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సంగు దేవయ్యతోపాటు 50 మంది మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సమక్షంలో, కరీంనగర్ జిల్లా గంగాధర మండలం రంగరావుపల్లి సర్పంచ్ పాశం స్వప్న కుమార్‌యాదవ్, ఉపసర్పంచ్ గౌతమి మహిపాల్, వార్డు సభ్యులు, రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మర్లపేట సర్పంచ్ గుడ్ల సుకన్య, ఆ గ్రామ వార్డు సభ్యులు చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. నిజామాబాద్ జిల్లా నవీపేట మండలంలోని పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్, టీడీపీల నాయకులు టీఆర్ఎస్ రాష్ట నాయకుడు ఆర్ రాంకిషన్‌రావు సమక్షంలో, జనగామ జిల్లా జఫర్‌ఘడ్ మండలంలోని పలుగ్రామాలకు చెందిన 200 మంది స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఎమ్మెల్యే రాజయ్య సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. పాలకుర్తి, ముత్తారం, లక్ష్మీనారాయణపురం, తొర్రూరు గ్రామాలకు చెందిన 150 మంది ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలోని చిన్నచింతకుంట మండలం లాల్‌కోటకు చెందిన 50 మంది భూత్పూరు మండలం అన్నాసాగర్‌లో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం మంగళపల్లి, పోలేపల్లి, ఆకుతోటపల్లి గ్రామాలకు చెందిన 50 మంది కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు.



కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం పారువెల్లలో కాంగ్రెస్ నేతలకు కండువా కప్పి టీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లిలో ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరుతున్న మర్లపేట సర్పంచ్ సుకన్య, వార్డు సభ్యులు

8 నమస్తే తెలంగాణ కరీంనగర్
WWW.NTNEWS.COM గురువారం 24 జనవరి 2019

బ్యాంకులకు రిజిస్ట్రేషన్‌శాఖ తాఖీదులు

- స్టాంపుడ్యూటీ ఎగవేయడంపై సీరియస్
- ఆదేశాలు జారీచేయాలంటూ ఆర్బీఐకి లేఖ

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: రుణ ఒప్పందాలపై స్టాంప్‌డ్యూటీ ఎగవేతపై స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ సీరియస్‌గా స్పందించింది. స్టాంప్‌డ్యూటీని ఎగవేస్తే కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలకు నోటీసులు జారీ చేసింది. ఈ విషయంలో తగిన ఆదేశాలు జారీచేయాలని రిజిస్ట్రేషన్‌శాఖ కమిషనర్ చిరంజీవులు రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ)కు లేఖరాశారు. కంపెనీలు, వ్యక్తులకు ఇచ్చే రుణాల ఒప్పందాలు, ఆస్తుల తనాఖాలపైన ఇతర కార్యకలాపాలపైన విధిగా చెల్లించాల్సిన స్టాంప్‌డ్యూటీని పలు బ్యాంకులు ప్రత్యేకించి కార్పొరేషన్, ప్రైవేట్ బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు ఎగవేస్తున్నాయి. ఖాతాదారులను ఆకర్షించడానికి తమ వద్ద స్టాంప్‌డ్యూటీ చెల్లించాల్సిన అవసరం లేదని చెప్తూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతుండటంపై స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ ఉన్నతాధికారులు తీవ్రంగా స్పందించారు. ప్రతీ రుణ ఒప్పందం, సేఫ్టీలాకర్, వాహనాల రుణాలు వంటివాటిపై నిబంధనల ప్రకారం స్టాంప్‌డ్యూటీని వసూలు చేసి ప్రభుత్వ ఖజానాకు జమచేయాల్సిందేనని స్పష్టంచేశారు. ఇదే విషయంపై ఇటీవల సమావేశం ఏర్పాటుచేసినా కొన్ని సంస్థలు వినకపోవడంతో తాకీదులను జారీచేసినట్టు తెలిసింది. వాస్తవానికి ఇండియన్ స్టాంప్ యాక్ట్ 1899లోని ఆర్టికల్ 6(a) ప్రకారం చరాస్తులకు సంబంధించిన డాక్యుమెంట్ రూ.2 లక్షలకు మించకుండా ఉంటే రూ. 100, మించిన ఒప్పందమైతే స్టాంప్‌డ్యూటీ రూ. 200 ఉంటుందని పేర్కొన్నారు. ఎంత మొత్తం రుణ ఒప్పందమైనా స్టాంప్ డ్యూటీ రూ. 50 వేలకు మించకుండా పరిమితి ఉంది. పలువురు బ్యాంకర్లు, ఫైనాన్సర్లు తమవద్ద రుణాలు తీసుకుంటే స్టాంప్‌డ్యూటీ చెల్లించాల్సిన అవసరం లేదని చెప్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని అధికారులు పేర్కొన్నారు. వాస్తవానికి బ్యాంకులు ఫ్రాంకింగ్ మిషన్ల వాడటం ద్వారా ప్రతీ ఒప్పందంపై స్టాంప్‌డ్యూటీని తప్పనిసరిగా వసూలు చేయాల్సి ఉంటుందని సూచించారు. ఇప్పటికే కొన్ని బ్యాంకులు ఈ మిషన్ల లైసెన్స్‌లను కలిగి ఉన్నాయని.. లేనివారు లైసెన్స్‌లు పొందిన స్టాంప్ వెండర్‌ల వద్ద ఫ్రాంకింగ్ చేయించుకోవాలని కోరారు.



రేపు రెండోవిడుత పోలింగ్

- 3,342 పంచాయతీల్లో ముగిసిన ప్రచారం
- పోటీలో 10,668 మంది అభ్యర్థులు
- 26,191 వార్డుల బరిలో 63,480 మంది
- 788 గ్రామాలు ఏకగ్రీవం
- ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో మద్యం దుకాణాలు బంద్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా రెండోవిడుత ప్రచారానికి బుధవారం సాయంత్రం 5 గంటలకు తెరపడింది. రెండోవిడుతలో 4,135 గ్రామాలకు ఎన్నికలు జరుగాల్సి ఉండగా, 788 గ్రామాలు ఏకగ్రీవమయ్యాయి. ఆదిలాబాద్ జిల్లాలో 1, కుమ్రంభీం ఆసిఫాబాద్ 2, ఖమ్మం 1, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 1 గ్రామపంచాయతీలో కేటాయించిన రిజర్వేషన్లకు చెందిన సామాజికవర్గాలు లేకపోవడంతో నామినేషన్లు దాఖలుకాలేదు. దీంతో రెండోవిడుతలో 3,342 గ్రామాల్లో పోలింగ్ జరుగనున్నది. శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. రెండోవిడుతలో పోలింగ్ జరిగే ప్రాంతాల్లో సాయంత్రం 5 గంటల వరకు మద్యం దుకాణాలను బంద్ చేయనున్నారు. రెండోవిడుతలో 3,342 గ్రామపంచాయతీల్లో 10,668 మంది సర్పంచ్ అభ్యర్థులు పోటీపడుతున్నారు. ఆయా పంచాయతీల్లో మొత్తం 36,602 వార్డుస్థానాలు ఉండగా, 10,317 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మరో 94 వార్డులకు రిజర్వేషన్లు అనుకూలించకపోవడంతో నామినేషన్లు దాఖలుకాలేదు. మిగిలిన 26,191 వార్డులకు పోలింగ్ జరుగుతుండగా 63,480 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. మొదటి విడుతలో పలు కారణాలతో వాయిదాపడిన రెండు గ్రామ పంచాయతీల్లోని రెండు వార్డులకు సైతం శుక్రవారం పోలింగ్ నిర్వహించనున్నారు. ఇందులో వరంగల్ రూరల్ జిల్లా పర్వతగిరి మండలం ముంజాలకుంట రెండోవార్డు, పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం సోమన్‌పల్లి ఎనిమిదో వార్డు ఉన్నట్టు ఎన్నికల సంఘం తెలిపింది.

సోపానం

పల్లె నుంచి పార్లమెంట్‌కు



అంచెలంచెలుగా ఎదిగిన చకిలం శ్రీనివాసరావు

నల్లగొండ, నమస్తే తెలంగాణ: మాజీ ఎంపీ చకిలం శ్రీనివాసరావు సర్పంచ్‌గానే రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం రాజుపేట గ్రామానికి చెందిన చకిలం.. ఉపాధ్యాయుడిగా, పట్వారీగా, రాజకీయ నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. పీవీ నర్సింహారావు ప్రధానిగా ఉన్న సమయంలో జిల్లా రాజకీయాలనే శాసించారు. ఉన్నత కుటుంబంలో జన్మించిన ఆయన ఆది నుంచీ తనకంటూ గుర్తింపును సంపాదించుకోవడంతో పాటు సర్దార్‌గా పిలిపించుకున్నారు. చకిలం శ్రీనివాసరావు 1961లో తిప్పర్తి గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 1962లో ఆయనను నల్లగొండ సమితి అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆ తర్వాత 1967లో నల్లగొండ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1972లో మరోసారి కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన చకిలం ..1978లో జనతాపార్టీ అభ్యర్థిగా పోటీచేసి గుత్తా మోహన్‌రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. 1982 వరకు మళ్లీ డీసీసీ అధ్యక్షుడిగా పనిచేశారు. 1983లో మిర్యాలగూడ ఎమ్మెల్యేగా, 1989లో నల్లగొండ ఎంపీగా గెలుపొందారు. 1991లో నల్లగొండ ఎంపీగా పోటీచేసి ధర్మభిక్షం చేతిలో, 1994లో ఎమ్మెల్యేగా నంద్యాల నర్సింహారెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు.

ఏకగ్రీవం @ 2,130

- రికార్డు సృష్టించిన గ్రామపంచాయతీలు
- తొలివిడుతలో 769, రెండోవిడుతలో 788, తుదివిడుతలో 573 ఏకగ్రీవం
- టీఆర్‌ఎస్ ఖాతాలో 1,789 ఏకగ్రీవాలు



బాలానగర్ మండలం మోదెంపల్లి సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన శివన్న, వార్డు సభ్యులను అభినందిస్తున్న మాజీ మంత్రి, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రామపంచాయతీ ఎన్నికల్లో రికార్డుస్థాయిలో ఏకగ్రీవాలు నమోదయ్యాయి. చరిత్రలో ఇప్పటివరకు ఎప్పుడూ లేనివిధంగా ఈసారి 2,130 గ్రామ పంచాయతీలు ఏకతాటిపై నిలిచాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పంచాయతీరాజ్ చట్టంతో గ్రామాల్లో అభివృద్ధి నినాదం మారుమోగింది. ప్రధానంగా కొత్తగా ఆవిర్భవించిన గ్రామాలు ఎక్కువగా ఏకగ్రీవాల జాబితాలో చేరాయి. ఈ గ్రామాల్లో ముఖ్యంగా టీఆర్‌ఎస్ మద్దతుదారులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రభుత్వంలో ఉండి, గ్రామానికి ఎక్కువ నిధులు తీసుకొచ్చి, అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతారనే ఉద్దేశంతో టీఆర్‌ఎస్ మద్దతుదారులవైపు ప్రజలు మొగ్గుచూపారు. దీంతో ఏకగ్రీవమైన మొత్తం 2,130 పంచాయతీల్లో టీఆర్‌ఎస్ మద్దతుదారులు 1,789 మంది ఉన్నారు. స్వతంత్రులు రెండోస్థానంలో నిలిచారు. స్వతంత్రుల్లో కూడా టీఆర్‌ఎస్‌కు అనుకూలమైన వారే ఉండటం విశేషం. తొలివిడుతలో 769 గ్రామాలు ఏకగ్రీవంకాగా, వీటిలో 603 మంది సర్పంచ్‌లు టీఆర్‌ఎస్ మద్దతుదారులే ఉన్నారు. రెండోవిడుతలో 788 ఏకగ్రీవ పంచాయతీల్లో 720 మంది సర్పంచ్‌లు టీఆర్‌ఎస్ మద్దతుదారులున్నారు. ఇక తుదివిడుత గణంకాలు ఇంకా అధికారికంగా ప్రకటించాల్సి ఉన్నది. కొన్ని జిల్లాల్లో జనరల్ అబ్జర్వర్లు ఏకగ్రీవ గ్రామాలపై నివేదిక ఇవ్వకపోవడంతో ఆ జాబితాను ఇంకా ప్రకటించలేదు. దీంతో ఇప్పటివరకు తేలిన లెక్కలప్రకారం మూడోవిడుతలో మొత్తం 573 పంచాయతీలు ఏకగ్రీవమైనట్టు తెలుస్తున్నది. వీటిలో 466 టీఆర్‌ఎస్ ఖాతాలోనే ఉన్నాయి. 79 గ్రామాల్లో స్వతంత్రులు ఏకగ్రీవమవగా, మిగిలిన స్థానాల్లో వివిధ పార్టీల వారున్నారు.

ఏకగ్రీవాల్లో జడ్చర్ల సెగ్మెంట్ రికార్డ్

47 పంచాయతీలు ఏకగ్రీవం

మహబూబ్‌నగర్, నమస్తే తెలంగాణ ప్రతినిధి : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గంలో రికార్డుస్థాయిలో 47 గ్రామాల సర్పంచ్‌లు,వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నవాబ్‌పేట, మిడ్జిల్, రాజాపూర్, బాలానగర్, జడ్చర్ల, ఉర్కొండపేట మండలాల్లో మొత్తం 198 పంచాయతీలకు రెండోవిడుతలో ఎన్నికలు జరుగనున్నాయి. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చొరవ తీసుకొని ఏకగ్రీవాలపై సమావేశాలు నిర్వహించారు. పలుచోట్ల ఒకే నామినేషన్ దాఖలు కాగా మరికొన్ని చోట్ల నామినేషన్లు వేసిన పలువురు ఉపసంహరించుకోవటంతో ఏకగ్రీవాలకు మార్గం సుగమమైంది. అత్యధికంగా నవాబ్‌పేట మండలంలో 19 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. బాలానగర్‌లో 10, జడ్చర్లలో ఎనిమిది, రాజాపూర్‌లో ఆరు, మిడ్జిల్‌లో మూడు, ఉర్కొండపేటలో ఒక స్థానం ఏకగ్రీవమయింది. రాష్ట్రంలోని అత్యధిక ఏకగ్రీవాలు జరిగిన నియోజకవర్గంగా జడ్చర్ల రికార్డు సృష్టించింది. ఏకగ్రీవంగా ఎన్నికైన వారిని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అభినందించారు.

ప్రచారానికి సినీ గ్లామర్



రెండో విడుత గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారం సినీ గ్లామర్‌తో సందడిగా మారింది. మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండల కేంద్రంలో సర్పంచ్ అభ్యర్థికి మద్దతుగా గబ్బర్‌సింగ్ సినిమాలో విలన్లుగా నటించిన సాయిబాబా, ప్రవీణ్, పెద్దపులి నగేశ్, రమేశ్, నగేశ్, వినోద్‌తోపాటు టీవీ యాంకర్ మంగ్లీలు ప్రచారం చేశారు. వీరిని చూడటానికి జనం ఎగబడ్డారు. - రాజాపూర్


నవీపేటలో వార్డు స్థానానికి హిజ్రా పోటీ



హిజ్రా అంకిత

నవీపేట: నిజామాబాద్ జిల్లా నవీపేట మేజర్ గ్రామ పంచాయతీ 14 వార్డు స్థానానికి ట్రాన్స్‌జెండర్ అంకిత పోటీలో నిలిచారు. పంచాయతీ పరిధిలో 14 వార్డును జనరల్ మహిళకు కేటాయించారు. ఆ వార్డులో మహిళగా ఓటు హక్కుకలిగి ఉన్న అంకిత నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం అంకితకు గౌను గుర్తును కేటాయించగా బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తనను వార్డు స్థానానికి గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

భర్త ఎంపీటీసీ, భార్య సర్పంచ్



బానోత్ శ్రీనివాస్, సరస్వతి

ఖమ్మం రూరల్, నమస్తేతెలంగాణ : ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం గోరీలపాడుతండాకు చెందిన బానోత్ శ్రీనివాస్ పోచారం ఎంపీటీసీగా ఉన్నారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఆయన భార్య బానోత్ సరస్వతి గోరీలపాడు సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రజా సేవ చేసేందుకు తన భార్యను రాజకీయాల్లోకి తీసుకొచ్చానని ఎంపీటీసీ శ్రీనివాస్ తెలుపగా.. గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని సర్పంచ్ బానోత్ సరస్వతి చెప్తున్నారు.

భార్య సర్పంచ్.. భర్త ఉపసర్పంచ్



బాషబోయిన శైలజ, వీరన్న

తిరుమలాయపాలెం: ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం జల్లేపల్లి గ్రామపంచాయతీ ఎన్నికల్లో భార్యాభర్తలు సర్పంచ్, ఉప సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఉత్కంఠభరింతంగా జరిగిన పోరులో టీఆర్‌ఎస్ మద్దతుతో పోటీచేసిన బాషబోయిన శైలజ 171ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మూడో వార్డు నుంచి పోటీచేసిన ఆమె భర్త బాషబోయిన వీరన్న కూడా గెలుపొందారు. వీరన్నను వార్డు మెంబర్లు ఉపసర్పంచ్‌గా ఎన్నుకోవటం విశేషం.



కాళ్లు కడిగి.. ఓట్లు అడిగి..

పెద్దపల్లి జిల్లాలో ఓ సర్పంచ్ అభ్యర్థి వినూత్నంగా ప్రచారం చేస్తున్నారు. పెద్దపల్లి మండలంలోని పెద్దకల్వల పంచాయతీ బరిలో నిలిచిన కల్వల రమేశ్, తన భార్య వసంతతో కలిసి గ్రామంలోని ఓటర్ల కాళ్లు కడుగుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. - పెద్దపల్లి కలెక్టరేట్

ఎన్నికల సిబ్బందికి బకాయిల చెల్లింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బందికి ఇచ్చే గౌరవ చెల్లింపు మొత్తాలను వెంటనే చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఇతర విభాగాల హెచ్‌వోడీలకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్ బుధవారం ఆదేశాలు జారీచేశారు.

ఎన్నికల నిబంధనల అతిక్రమణపై నిఘా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తొలివిడుత గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా పూర్తిచేసిన అధికార యంత్రాంగం మిగిలిన రెండువిడుతల్లోనూ నిబంధనల అతిక్రమణపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నది. ఓటర్లను ప్రలోభపెట్టే వారిపై పోలీసులు, ఇతర విభాగాల అధికారులు దృష్టిపెడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా బుధవారంవరకు రూ.1,78,13,190 స్వాధీనం చేసుకున్నారు. ఓటర్లకు తాయిలాలు ఇచ్చేందుకు తెచ్చిన రూ.36,27,927 విలువైన వివిధ వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది. నిబంధనలు ఉల్లంఘించడంతో 288 కేసులు నమోదు చేసినట్టు ఎన్నికల సంఘం నివేదికలో వివరించింది. వీరిలో ఇప్పటివరకు 139 మందిని అరెస్ట్ చేసినట్టు తెలిపింది.

ఎన్నికల సిబ్బంది సమస్యలు పరిష్కరించండి

- రాష్ట్ర ఎన్నికల కార్యదర్శిని కోరిన పీఆర్టీయూ టీఎస్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక రకాల సమస్యలు తలెత్తుతున్నాయని, వాటిని తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర ఎన్నికల కార్యదర్శి అశోక్‌కుమార్‌ను కోరామని పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర నాయకులు సరోత్తంరెడ్డి, బీరెడ్డి కమలాకర్‌రావు తెలిపారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ఎన్నికల కార్యదర్శికి ఎమ్మెల్సీ పూల రవీందర్‌తో కలిసి వినతిపత్రం అందించామని చెప్పారు. ఇందుకు ఎన్నికల కార్యదర్శి అశోక్‌కుమార్ సానుకూలంగా స్పందించి ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేస్తామని హామీఇచ్చినట్టు తెలిపారు.

పల్లె పోరులో కాంగ్రెస్ పరార్

- తొలివిడుత ఎన్నికల్లో డీలాపడటంతో మొఖంచాటేసిన నాయకులు
- సొంత ఇమేజీపైనే బరిలో క్షేత్రస్థాయి నేతలు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పల్లెల్లో పునాదులు వేసుకుంటేనే ఏ రాజకీయ పార్టీ అయినా పటిష్ఠంగా తయారవుతుంది. గాలివాటంతో ఎన్నికల్లో గెలిస్తే అది తాత్కాలిక విజయమే అవుతుంది. ఈ విషయాన్ని గ్రహించని కాంగ్రెస్ పార్టీ పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నా పెద్దగా పట్టించుకోవడంలేదు. పల్లె పోరులో చేతులెత్తేసింది. ఈ నెల 21న జరిగిన తొలివిడుత పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఆశించినస్థాయిలో ఫలితాలు రాకపోవడంతో ఆ పార్టీ నేతలంగా డీలాపడిపోయారు. ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలై కోలుకోకముందే పంచాయతీ ఎన్నికలు రావడంతో ఏమిచేయాలో అర్థంకాని పరిస్థితి కనిపిస్తున్నది. తొలివిడుతలో 4,470 పంచాయతీలకు కాంగ్రెస్ మద్దతుదారులు కేవలం 650 గ్రామాల్లోనే గెలుపొందినట్టు చెప్తున్నారు. వీరుకూడా అధికార పార్టీవైపే మొగ్గుచూపి గ్రామాల అభివృద్ధికి బాటలు వేసుకునే ప్రయత్నాల్లో ఉన్నట్టు తెలుస్తున్నది. ఈ 650 మంది సర్పంచ్‌లు కూడా సొంత ఇమేజ్‌తోనే విజయం సాధించడం గమనార్హం. తొలివిడుతలో ఆ మాత్రం ఫలితాలు వచ్చాయంటే అది కేవలం క్షేత్రస్థాయి కాంగ్రెస్ శ్రేణుల కృషేనని, ఈ విషయాన్ని గ్రహించిన రాష్ట్రస్థాయి నేతలు సిగ్గుతో తలదించుకునే పరిస్థితి ఏర్పడిందని ఆ పార్టీ సీనియర్ నేత ఒకరు పేర్కొన్నారు. 'ఆ పంచాయతీ ఎన్నికలది ఏముంది? గెలిచిన సర్పంచ్‌లు ఏ పార్టీ అధికారంలో ఉంటే అటువైపే వెళ్తారు కదా.. మనమెందుకు అంతకష్టపడి, డబ్బులు ఖర్చుపెట్టి గెలిపించాలి?' అంటూ కాంగ్రెస్ పార్టీ నేతలు బహిరంగంగానే చెప్తున్నారు. రాష్ట్రంలో మొత్తం 12,751 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరుగుతుండగా కాంగ్రెస్ వాటిలో కనీస వాటా కోసం ప్రయత్నాలు చేయడంలేదు. తొలివిడుత ఫలితాలవల్ల తమకు క్షేత్రస్థాయిలో పెద్దగా పట్టులేదని తేలిపోయినట్టు నేతలు భావిస్తున్నారు. దీంతో వచ్చే రెండు, తుదివిడుత ఎన్నికల్లో గ్రామాలకు వెళ్లి పరువు తీసుకోవడమెందుకని నాయకులు అనుకుంటుండగా, గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు మాత్రం వారిని నడిపించే నేతలు లేని పార్టీగా కుదేలైపోతున్నారు. ఈ నెల 25, 30 తేదీల్లో 8,281 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికల్లో నడిపించే నేతలు లేకుండా క్షేత్రస్థాయిలో శ్రేణులు నానా తంటాలు పడుతున్నాయి.

ట్రాఫిక్‌పై 'షార్ట్'గా అవగాహన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రోడ్డు భద్రతపై తక్కువ నిడివిఉండే చిత్రాలను రూపొందించి పంపాలని డీజీపీ మహేందర్‌రెడ్డి ట్విట్టర్ ద్వారా కోరినదానికి విశేష స్పందన వస్తున్నది. ఇప్పటికే వందమంది వరకు ఔత్సాహికుల నుంచి స్పందన వచ్చినట్టు అధికారులు తెలిపారు. వీరితో రెండు, మూడురోజుల్లో ప్రత్యేకంగా సమావేశమై మరిన్ని అంశాలపై చర్చించనున్నట్టు చెప్పారు. ఇతర వివరాలకు 'tspitcell@gmail.com'లో సంప్రదించాలని డీజీపీ మహేందర్‌రెడ్డి సూచించారు.

జంటహత్యల కేసులో వీడిన మిస్టరీ!

- మృతులు బాలాపూర్‌లో నివసించే అక్కాచెల్లెండ్లుగా గుర్తింపు
- పరిచయస్తుడే హత్య చేసినట్టుగా అనుమానం
- చెవికమ్మల కోసం ఘర్షణ పడినట్టు సమాచారం



మృతులు సుమిత్ర, యాదమ్మ

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ / మెహిదీపట్నం: మూసీనదిలో శవాలుగా తేలిన ఇద్దరు మహిళల ఆచూకీ దొరికింది. వారు రంగారెడ్డిజిల్లా కందుకూరు మండలం దెబ్బలగూడకు చెందిన సుమిత్ర (45), యాదమ్మ (50)లు అక్కాచెల్లెండ్లు. నగరానికి వలస వచ్చిన వీరు కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలాపూర్ జనప్రియ ప్రాంతంలో నివసిస్తున్నారు. భర్త చనిపోవడంతో సుమిత్ర.. అక్క యాదమ్మ వద్ద ఉంటూ ఇండ్లల్లో పాచిపనిచేస్తూ జీవిస్తున్నది. ఇద్దరూ ఈనెల 21 సాయంత్రం డీఆర్‌డీఎల్ ధాతునగర్ కల్లు కంపౌండ్‌లో కల్లు తాగారు. రాత్రయినా ఇంటికి రాకపోవడం తో యాదమ్మ భర్త రాజు.. ఇరుగుపొరుగు వారిండ్లల్లో ఆరాతీశారు. బుధవారం మీర్‌పేట్ పోలీసులను ఆశ్రయించడంతో లంగర్‌హౌస్‌లోవెలుగుచూసిన మృతదేహాల విషయం తెలిసింది.

పాత పరిచయస్తుడే హంతకుడా?

విశ్వసనీయ సమాచారం మేరకు.. సుమిత్ర, యాదమ్మ తమకు తెలిసిన వ్యక్తి అయిన గిరితో కలిసి ధాతునగర్ కల్లు కంపౌండ్‌లో కల్లు తాగారు. అనంతరం లంగర్‌హౌస్ ఠాణా పరిధిలోని మూసీ వద్దకు వచ్చారు. అక్కాచెల్లెండ్ల చెవికమ్మలను లాక్కోవాలన్న దుర్బుద్ధితో వారితో ఘర్షణకు దిగాడు. మైకంలో ఉన్న గిరి వారిని కొట్టి హతమార్చి మూసీ కాలువలో పడేశాడు. ఇలాఉండగా కేసు ఇంకా దర్యాప్తులో ఉన్నదని, ఇప్పుడే ఏమీ చెప్పలేమని పోలీసులు చెప్తున్నారు. హత్యకోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నామని, హంతకుడు ఒక్కరేనా? హత్యలు చేసేందుకు ఎవరైనా సహకరించారా? అనే విషయాలను ఆరాతీస్తున్నట్టు పోలీసులు పేర్కొంటున్నారు. సీసీ కెమెరాలను పోలీసులు విశ్లేషిస్తున్నారు.

పల్లినూనె యంత్రం.. పిప్పిచేసే కుతంత్రం

- తక్కువ పెట్టుబడితో నెలకు రూ.20 వేల సంపాదన అంటూ ప్రకటనలు
- మోసపోయామంటూ ఉప్పల్ పోలీసులను ఆశ్రయించిన బాధితులు
- 'గ్రీన్‌గోల్డ్ బయోటెక్' ఎండీ శ్రీకాంత్‌పై కేసు నమోదు



ఉప్పల్‌లోని సంస్థ కార్యాలయం వద్ద బాధితుల ఆందోళన

ఉప్పల్: మాయమాటలతో మోసాలకు పాల్పడుతూ అమాయకులను దోపిడీ చేస్తున్న సంస్థ బాగోతం ఉప్పల్‌లో వెలుగుచూసింది. సరూర్‌నగర్‌కు చెందిన ఇంద్రకిరణ్, భార్య అనిత మార్నింగ్‌వాక్ చేస్తుండగా పల్లినూనె యంత్రంతో నెలకు రూ.20 వేలు సంపాదించవచ్చంటూ గ్రీన్‌గోల్డ్ బయోటెక్ కంపెనీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ చెప్పాడు. పల్లినూనె తీసే యంత్రం గురించి తెలుసుకొనేందుకు ఇంద్రకిరణ్ దంపతులు ఉప్పల్‌లోని గ్రీన్‌గోల్డ్ కంపెనీకి వెళ్లారు. అక్కడ సదరు కంపెనీ ఎండీ జే శ్రీకాంత్, మేనేజర్ భాస్కర్‌యాదవ్ రూ.లక్ష డిపాజిట్ చేసి యంత్రం తీసుకొని.. నూనె ఆడించి తమకే అమ్మడం ద్వారా నెలకు రూ.20 వేలు పొందవచ్చని నమ్మించాడు. యంత్రం కొనుగోలు చేసి నూనె ఆడించి అప్పగిస్తున్నా.. ఎలాంటి డబ్బు చెల్లించకపోవడంతో దంపతులు తాము మోసపోయినట్టు గ్రహించారు. ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఉప్పల్ కేంద్రంగా గ్రీన్‌గోల్డ్ బయోటెక్ సంస్థ పేరుతో పలు రాష్ట్రాలకు చెందిన వారితో గొలుసుకట్టు వ్యాపారం చేస్తున్నారని, ఇప్పటివరకు దాదాపు రూ.150 కోట్ల మేర వసూళ్లకుపాల్పడినట్టు ఆరోపణలు వస్తున్నాయి. పోలీసులు కొందరిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు.

మద్యానికి బానిసై భార్యను చంపిన భర్త

- ప్రేమించి పెండ్లి చేసుకొన్నాడు.. డబ్బుకోసం వేధించాడు
- గర్భిణిని హతమార్చాడు



సన్ని, సత్యవతి (ఫైల్)

మారేడ్‌పల్లి: ప్రేమించి కులాంతర వివాహం చేసుకొన్నాడు.. మద్యానికి బానిసై కట్టుకొన్న భార్యను గర్భిణీ అనే కనికరం లేకుండా కడతేర్చాడు. మారేడ్‌పల్లి వాల్మీకినగర్ నివాసి రాములు కూతురు సత్యవతి (27)ని ఇదే ప్రాంతానికి చెందిన సురేందర్ కుమారుడు సన్ని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. సన్ని మారేడ్‌పల్లిలోని ఓ బియ్యం దుకాణంలో పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసైన అతడు కొంత కాలంగా భార్య సత్యవతితో గొడవలు పడుతున్నాడు.ఈ నెల 21న రాత్రి కూడా మద్యం సేవించి ఇంటికొచ్చి గొడవపడ్డాడు. ఆగ్రహానికి గురై భార్యను గొంతు నులిమి చంపేశాడు. అనంతరం ఇంటికి తాళంవేసి వెళ్లిపోయాడు. తెల్లవారు ఇంటికి వచ్చి చూడగా భార్య చనిపోయి ఉండటంతో భయపడిపోయాడు. మరుసటిరోజు రాత్రి తన తల్లిదండ్రులకు విషయం చెప్పాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకొన్న పోలీసులు.. తాళం పగులకొట్టి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించారు.



గద్దర్ దంపతులను సన్మానిస్తున్న ఎంపీ మల్లికార్జున ఖర్గే. చిత్రంలో కేంద్రమాజీమంత్రి జైపాల్‌రెడ్డి, మాజీమంత్రి గీతారెడ్డి తదితరులు ఉన్నారు.

ధీరవనిత ఈశ్వరీబాయి

- శతజయంతి ఉత్సవాల్లో ఎంపీ మల్లికార్జున్ ఖర్గే
- ప్రభుత్వం అధికారికంగా నిర్వహించటం అభినందనీయం: గీతారెడ్డి
- ప్రజాగాయకుడు గద్దర్‌కు స్మారక పురస్కారం ప్రదానం

రవీంద్రభారతి/మారేడ్‌పల్లి: దళితులు, అణగారిన ప్రజల హక్కుల కోసం పోరాడిన ధీరవనిత ఈశ్వరీబాయి అని ఎంపీ మల్లికార్జున్ ఖర్గే అన్నారు. యువత ఈశ్వరీబాయిని ఆదర్శంగా తీసుకుని ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి రవీంద్రభారతిలో నిర్వహించిన ఈశ్వరీబాయి శతజయంతి ఉత్సవంలో వేదికపై ఏర్పాటుచేసిన ఈశ్వరీబాయి నిలువెత్తు విగ్రహాన్ని, ఆమె జీవిత చరిత్రపై రచయిత రామలింగం రచించిన 'అగ్నిశిఖ ఈశ్వరీబాయి' పుస్తకంతోపాటు క్యాలెండర్‌ను ఖర్గే ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. దేశ ప్రజాస్వామిక వ్యవస్థను కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉన్నదని చెప్పారు. ఈశ్వరీబాయి మెమోరియల్ ట్రస్టు చైర్‌పర్సన్ జే గీతారెడ్డి మాట్లాడుతూ.. ఈశ్వరీబాయి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించటం అభినందనీయమన్నారు. ప్రజాగాయకుడు గద్దర్ దంపతులను సత్కరించి, ఈశ్వరీబాయి స్మారక శతజయంతి పురస్కారాన్ని ప్రదానం చేశారు. కార్యక్రమంలో కేంద్ర మాజీమంత్రి జైపాల్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విరాట్‌కు విశ్రాంతి

నేపియర్: ఎడతెరిపి లేకుండా క్రికెట్ ఆడుతున్న భారత కెప్టెన్ విరాట్ కోహ్లీకి సెలెక్టర్లు విశ్రాంతి కల్పించారు. న్యూజిలాండ్‌తో జరిగే చివరి రెండు వన్డేలు, మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు అతను అందుబాటులో ఉండడని బీసీసీఐ తెలిపింది. గత కొన్ని నెలలుగా విరామం లేకుండా క్రికెట్ ఆడుతున్నందున పనిభారాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ విశ్రాంతి ఇచ్చినట్లు సెలెక్షన్ కమిటీ, టీమ్ మేనేజ్‌మెంట్ వెల్లడించింది. భారత్‌లో ఆస్ట్రేలియాతో జరిగే సిరీస్‌కు కోహ్లీ అందుబాటులో ఉండనున్నాడు. విరాట్ గైర్హాజరీతో హిట్ మ్యాన్ రోహిత్ శర్మ జట్టుకు సారథ్యం వహించనున్నాడు.

టాప్-10లోకి కోహ్లీ

వన్డేల్లో పదివేల పరుగుల టాప్-10లోకి భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ(10430) దూసుకొచ్చాడు. బుధవారం కివీస్‌తో జరిగిన మొదటి మ్యాచ్‌లో 45 పరుగులు సాధించడం ద్వారా విరాట్ పైకి ఎగబాకాడు. కోహ్లీ తర్వాత ప్రస్తుతం భారత్ నుంచి ధోనీ(10366) 12వ స్థానంలో కొనసాగుతున్నాడు. ఓవరాల్‌గా వన్డేల్లో సచిన్(18426), సంగక్కర(14234), రికీ పాంటింగ్(13704) టాప్-3లో ఉన్నారు.



మ్యాచ్‌కు సూర్యుడు అడ్డంకిగా..

సూర్యకిరణాలతో మ్యాచ్‌కు అర్ధగంట అంతరాయం

లక్ష్యాన్ని స్వల్పంగా కుదించిన అంపైర్లు

భారత్, కివీస్ మ్యాచ్‌లో అనూహ్య ఘటన



అగ్గిపుల్ల, కుక్కపిల్ల, సబ్బుబిల్ల కవితకు కాదేది అనర్హం. మహాకవి శ్రీశ్రీ చేతి నుంచి జాలువారిన కవిత ఇది. అచ్చం ఇలాగే మనం ఇప్పటి వరకు క్రికెట్‌లో వర్షం, వెలుతురులేమి, జంతువుల వల్ల మ్యాచ్‌లకు అంతరాయం కలుగడం చూశాం. కానీ కనీ వినీ ఎరుగని రీతిలో సూర్యుడు కూడా మ్యాచ్‌ను అడ్డుకున్నాడంటే ఆశ్చర్యం కలుగకమానదు. అవును భారత్, న్యూజిలాండ్ మధ్య నేపియర్‌లో బుధవారం నాటి మ్యాచ్‌లో ఇదే జరిగింది. కివీస్ నిర్దేశించిన లక్ష్యఛేదన కోసం భోజన విరామం తర్వాత మైదానంలోకి అడుగుపెట్టిన టీమ్‌ఇండియా బ్యాట్స్‌మెన్‌కు సూర్యభగవానుడు ప్రతిబంధకంగా మారాడు. నేరుగా కండ్లలోకి సూర్య కిరణాలు పడుతుండటంతో చేసేదేమి లేక ఫీల్డ్‌అంపైర్లు మ్యాచ్‌ను అర్ధగంట సేపు వాయిదా వేశారు. మ్యాచ్‌కు వేదికైన నేపియర్‌లోని మెక్‌లీన్ పార్క్ స్టేడియం నిర్మాణం మిగతా వాటికి భిన్నంగా ఉంది. సాధారణంగా అంతర్జాతీయ మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చే స్టేడియాల్లోని పిచ్‌లన్నీ కూడా ఉత్తర, దక్షిణ అభిముఖంగా ఉంటాయి. కానీ మెక్‌లీన్ పార్క్ మాత్రం తూర్పు, పశ్చిమ ముఖంగా ఉండటంతో సూర్యుడితో ఆటంకం ఏర్పడింది. అయితే సమయం వృథా కావడంతో మ్యాచ్‌లో ఒక ఓవర్‌తో పాటు పరుగు కుదిస్తూ లక్ష్యాన్ని సవరించారు.

నాలుగు సందర్భాలు

పిచ్ మధ్యలో కారు

పాలెం ఎయిర్‌ఫోర్స్ గ్రౌండ్‌లో 2017లో ఢిల్లీ, ఉత్తర్ ప్రదేశ్ మధ్య రంజీ మ్యాచ్‌లో అనూహ్య ఘటన చోటు చేసుకుంది. మ్యాచ్ జరుగుతుండగానే ఒక గుర్తుతెలియని వ్యక్తి కారులో వచ్చి నేరుగా పిచ్‌పైనే పార్కింగ్ చేశాడు. దీంతో గంభీర్, ఇషాంత్‌శర్మ, రిషబ్, రైనా క్రికెటర్లు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. జరిగిన తప్పును గుర్తించిన నిర్వాహకులు వ్యక్తిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. కారు ప్రవేశంతో మ్యాచ్‌కు ఆగిపోవడం క్రికెట్ చరిత్రలో ఇదే మొదటిసారిగా రికార్డుల్లోకెక్కింది.

క్యాండీలో!తేనెటీగల దాడి

2007లో ఇంగ్లండ్, శ్రీలంక మధ్య క్యాండీలో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో తేనెటీగలు కలకలం సృష్టించాయి. ఒక్కసారిగా తేనెటీగలు మైదానంలోకి ప్రవేశించడంతో చేసేదేమి లేక అంపైర్లతో సహా అందరూ బొక్కాబోర్లా పడుకున్నారు. కొద్దిసేపటి తర్వాత వెళ్లిపోయాయని అంపైర్లు నిర్ధారించాక గానీ లేచే సాహసం చేయలేదు.

లంచ్ ఆలస్యంగా

2017లో బంగ్లాదేశ్‌తో టెస్ట్ మ్యాచ్‌లో నిర్వాహకుల నిర్లక్ష్యం ఆతిథ్య జట్టు దక్షిణాఫ్రికా పరువు తీసింది. నిర్ణీత సమయం కంటే పది నిమిషాలు ఆలస్యంగా బంగ్లా జట్టుకు లంచ్ ఏర్పాట్లు చేశారు. కారణమేంటని ఆరా తీస్తే..పర్యాటక జట్టు ఇచ్చిన మెనూ కాకుండా మరో మెనూను తీసుకున్నట్లు తేలింది. దీంతో సఫారీల పరువు కాస్తా గంగలో కలిసింది.

లియాన్ కాల్చిన బ్రెడ్

2017లో షెఫీల్డ్ షీల్డ్ ట్రోఫీలో భాగంగా న్యూసౌత్‌వెల్స్, క్వీన్స్‌ల్యాండ్ హోరాహోరీగా తలపడుతున్నాయి. న్యూసౌత్‌వెల్స్ విజయానికి మరో 18 పరుగుల దూరంలో ఉన్నది. సరిగ్గా అదే సమయంలో ఫైర్ అలారమ్ మోగడంతో మ్యాచ్ ఆగిపోయింది. డ్రెస్సింగ్ రూమ్ కిచెన్‌లో సౌత్‌వెల్స్ క్రికెటర్ లియాన్ బ్రెడ్ ముక్కను బాగా కాల్చడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో పొగలు దట్టంగా అలుముకోవడంతో అలారమ్ మోగింది. ఆ తర్వాత జరిగిన తప్పును నిర్వాహకులు గుర్తించి ఓకే చెప్పడంతో మ్యాచ్ తిరిగి మొదలైంది.

ఆరంభం అదిరింది..

తొలి వన్డేలో భారత్ గెలుపు ▪ రాణించిన ధవన్, కోహ్లీ ▪ 8 వికెట్ల తేడాతో ఓడిన కివీస్ ▪ విలియమ్సన్ శ్రమ వృథా



ధవన్ (75★)

ఈ మధ్య విజయాలకు పర్యాయపదంగా నిలుస్తున్న భారత్.. న్యూజిలాండ్ గడ్డపై కూడా బోణీ కొట్టింది. షమీ (3/19) ఎక్స్‌ప్రెస్ వేగానికి, కుల్దీప్ (4/39) మణికట్టు మంత్రానికి తోడు.. ధవన్ (103 బంతుల్లో 75 నాటౌట్; 6 ఫోర్లు) దంచికొట్టగా, విరాట్ (59 బంతుల్లో 45; 3 ఫోర్లు) విజృంభించిన వేళ.. తొలి వన్డేలో స్వల్ప లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది. పాత చరిత్రను మైమరిపిస్తూ సాగిన పోరులో ఏ దశలోనూ కివీస్.. టీమ్‌ఇండియాను అడ్డుకునే సాహసం చేయలేక చతికిలపడింది. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో విరాట్‌సేనకు ఘనమైన ఆరంభం లభించింది.

నేపియర్: సొంతగడ్డపై ఎదురుదాడి చేస్తుందనుకున్న న్యూజిలాండ్ ప్రతిఘటన లేకుండానే చేతులెత్తేసింది. భారత్ ఆల్‌రౌండ్ షో ముందు రెక్కలు తెగిన పక్షిలా విలవిలలాడింది. ఫలితంగా మెక్‌లీన్ పార్క్‌లో బుధవారం జరిగిన తొలి వన్డేలో టీమ్‌ఇండియా 8 వికెట్ల తేడా(డక్‌వర్త్ లూయిస్)తో కివీస్‌పై గెలిచింది. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 38 ఓవర్లలో 157 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ విలియమ్సన్ (81 బంతుల్లో 64; 7 ఫోర్లు) అర్ధసెంచరీతో రాణించినా సహకారం ఇచ్చేవారు కరువయ్యారు.

విలియమ్సన్ ఒక్కడే..

పిచ్ మీద తేమను సద్వినియోగం చేసుకున్న షమీ స్వింగ్‌తో చెలరేగిపోయాడు. దీంతో తొలి ఐదు ఓవర్లలోనే ఓపెనర్లు గప్టిల్ (5), మున్రో (8) 18 పరుగులకే వెనుదిరిగారు. గతేడాది సూపర్ ఫామ్ చూపెట్టిన వెటరన్ రాస్ టేలర్ (24) క్రీజులో నిలకడగా ఆడగా... రెండోఎండ్‌లో విలియమ్సన్ తన ట్రేడ్ మార్క్ బ్యాక్‌ఫుట్ షాట్లతో కవర్స్‌లో భారీగా పరుగులు రాబట్టాడు. దీంతో పరిస్థితులు మెల్లగా కివీస్‌ను అనుకూలంగా మారాయి.ఈ జంట కుదురుకుందన్న దశలో.. 15వ ఓవర్‌లో చాహల్ (2/43) మ్యాజిక్ చేశాడు. ఓ సూపర్ గూగ్లీతో టేలర్‌ను కాటన్ బౌల్డ్ చేశాడు. విలియమ్సన్, టేలర్ మూడో వికెట్‌కు 34 పరుగులు జోడించారు. అదే తరహాలో లాథమ్ (11) వికెట్‌నూ పడగొట్టడంతో నాలుగో వికెట్‌కు 24 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కెప్టెన్‌కు తోడుగా వచ్చిన నికోలస్ (12), సాంట్నర్ (14) ఓ సిక్స్, రెండు మూడు బౌండరీలతో స్కోరును పెంచే ప్రయత్నం చేసినా.. టీమ్‌ఇండియా బౌలర్లు అవకాశం ఇవ్వలేదు. పార్ట్ టైమర్ జాదవ్.. నికోలస్‌ను, షమీ.. సాంట్నర్‌ను ఔట్ చేశాడు. ఈ ముగ్గురి మధ్య 57 పరుగులు జతయినా.. 30 ఓవర్లు ముగిసేసరికి కివీస్ స్కోరు 133/6గా మారింది. మూడు ఓవర్ల తర్వాత కుల్దీప్ డబుల్ మ్యాజిక్ చేశాడు. ఐదు బంతుల తేడాలో విలియమ్సన్, బ్రాస్‌వెల్ (7)ను ఔట్ చేయడంతో ఆతిథ్య జట్టు కోలుకోలేకపోయింది. 63 బంతుల్లో అర్ధసెంచరీ చేసిన విలియమ్సన్ లాంగాన్‌లో శంకర్ చేతికి చిక్కాడు. చివర్లో సౌతీ (9 నాటౌట్) ఓ మాదిరిగా ఆడినా.. కుల్దీప్ దెబ్బకు ఫెర్గుసన్ (0), బౌల్ట్ (1) తొందరగానే వెనుదిరగడంతో కివీస్ ఓ మోస్తరు స్కోరుకే పరిమితమైంది.

గాడిలోపడ్డ ధవన్..

స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన భారత్‌కు సూర్యుడు అడ్డంకిగా నిలిచాడు. కిరణాలు బ్యాట్స్‌మెన్ కండ్లలో నేరుగా పడుతుండటంతో తాత్కాలికంగా మ్యాచ్‌ను ఆపేసి లక్ష్యాన్ని 49 ఓవర్లలో 156 పరుగులుగా సవరించాడు. దీనిని భారత్ 34.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. గత తొమ్మిది మ్యాచ్‌ల్లో కనీసం అర్ధసెంచరీ చేయలేకపోయిన ధవన్.. ఈ మ్యాచ్‌లో చెలరేగాడు. కివీస్ పేసర్లను ఉతికి ఆరేస్తూ లయ అందుకున్నాడు. దీంతో 41/0 స్కోరుతో టీమ్‌ఇండియా డిన్నర్‌కు వెళ్లింది. విరామం నుంచి వచ్చిన భారత్‌కు సూర్యాస్తమయం అవరోధాన్ని కలిగించింది. దాదాపు అర్ధగంట సమయం వృథా కావడంతో లక్ష్యాన్ని పైవిధంగా సవరించారు. కానీ బ్రేక్ తర్వాత ఎదుర్కొన్న రెండో బంతికే రోహిత్ (11) ఔట్‌కావడంతో 41 పరుగుల వద్దే భారత్ తొలి వికెట్ కోల్పోయింది. ధవన్‌కు జత కలిసిన కోహ్లీ తన మార్క్‌ను చూపెట్టాడు. వేగంగా ఆడుతూ స్ట్రయిక్‌ను రొటేట్ చేస్తూ పరుగులు రాబట్టాడు. సహచరుడు ఇచ్చిన స్ఫూర్తితో చెలరేగిన ధవన్ కూడా వికెట్ల మధ్య వేగంగా పరుగులు తీస్తూ ఆకట్టుకున్నాడు. ఈ ఇద్దరు రెండో వికెట్‌కు 91 పరుగులు జోడించాకా ఫెర్గుసన్ విడదీశాడు. అద్భుతమైన షార్ట్ ఔట్ స్వింగర్‌ను సంధించి విరాట్‌ను బోల్తా కొట్టించాడు. రెండోఎండ్‌లో 69 బంతుల్లో ఫిఫ్టీ మార్క్‌ను అందుకున్న ధవన్‌కు కొత్తగా వచ్చిన అంబటి రాయుడు (13 నాటౌట్) చక్కని సహకారం అందించాడు. వికెట్‌ను కాపాడుకుంటూ మూడో వికెట్‌కు 24 పరుగులు జత చేసి విజయ లాంఛనం ముగించారు. షమీకి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ఇరుజట్ల మధ్య రెండో వన్డే శనివారం మౌంట్ మంగనూయ్‌లో జరుగుతుంది.

షమీ @ 100



షమీ (3/19)

నేపియర్: భారత పేసర్ మహ్మద్ షమీ సత్తాచాటాడు. వన్డేల్లో తక్కువ(56) మ్యాచ్‌ల్లో వంద వికెట్ల మైలురాయిని వేగంగా అందుకున్న భారత బౌలర్‌గా నిలిచాడు. బుధవారం న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో మూడు వికెట్లు పడగొట్టడం ద్వారా షమీ 100 వికెట్ల క్లబ్‌లో చోటు దక్కించుకున్నాడు. కివీస్ ఓపెనర్ మార్టిన్ గప్టిల్(5)ను ఔట్ చేయడం ద్వారా ఈ 28 ఏండ్ల బెంగాల్ స్పీడ్‌స్టర్ వందో వికెట్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. వన్డేల్లో తక్కువ మ్యాచ్‌ల్లో వంద వికెట్లు పడగొట్టిన వారిలో ఇర్ఫాన్ పఠాన్(59 మ్యాచ్‌లు), జహీర్‌ఖాన్(65 మ్యాచ్‌లు), అజిత్ అగర్కార్(67 మ్యాచ్‌లు), జవగళ్ శ్రీనాథ్(68 మ్యాచ్‌లు) రికార్డులు నెలకొల్పారు. తన ప్రదర్శనపై మ్యాచ్ అనంతరం షమీ మాట్లాడుతూ 'గాయం నుంచి కోలుకుని పూర్తిస్థాయి ఫిట్‌నెస్‌తో తిరిగి జట్టులోకి రావడం ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ప్రపంచస్థాయి ప్రమాణాలు కల్గిన పునరావాస కేంద్రంలో చాలా రోజులు గడిపాను. అక్కడ ఉన్నన్ని రోజులు సహాయక సిబ్బంది మద్దతుగా నిలిచారు. టీమ్ మేనేజ్‌మెంట్‌తో పాటు కెప్టెన్ కోహ్లీ నాకు అన్ని రకాలుగ అండగా ఉన్నాడు. ఇప్పటివరకు మేము సాధించినదంతా జట్టు సమిష్టి కృషి ఫలితమే. ఒకరి విజయాన్ని అందరం ఆస్వాదిస్తూ ప్రణాళికలను అమలు పరుస్తున్నాం' అని షమీ అన్నాడు.

లారా సరసన ధవన్..

భారత ఓపెనర్ శిఖర్ ధవన్ తన కెరీర్‌లో మరో మైలురాయిని అందుకున్నాడు. కోహ్లీ(114 ఇన్నింగ్స్) తర్వాత వన్డేల్లో 5వేల పరుగుల మార్క్‌ను వేగంగా(118 ఇన్నింగ్స్) అందుకున్న రెండో భారత బ్యాట్స్‌మన్‌గా రికార్డుల్లోకెక్కాడు. బుధవారం న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో అజేయ అర్ధసెంచరీ(75 నాటౌట్)తో అదరగొట్టిన ఈ ఢిల్లీ డాషర్ మ్యాచ్ ఆరో ఓవర్‌లో ఈ ఫీట్ చేరుకున్నాడు. ఈ క్రమంలో వెస్టిండీస్ దిగ్గజం బ్రియాన్ లారా(118 ఇన్నింగ్స్) సరసన నిలిచాడు. ఓవరాల్‌గా వన్డేల్లో 5వేల పరుగులను వేగంగా చేరుకున్న వారిలో హషీమ్ ఆమ్లా(101 ఇన్నింగ్స్), వీవీయన్ రిచర్డ్స్, విరాట్ కోహ్లీ(114 ఇన్నింగ్స్), విలియమ్సన్(119 ఇన్నింగ్స్), గార్డన్ గ్రినిడ్జ్(121 ఇన్నింగ్స్), డివిలీయర్స్(124 ఇన్నింగ్స్), గంగూలీ(126 ఇన్నింగ్స్) ఉన్నారు.

స్కోరు బోర్డు

న్యూజిలాండ్: గప్టిల్ (బి) షమీ 5, మున్రో (బి) షమీ 8, విలియమ్సన్ (సి) శంకర్ (బి) కుల్దీప్ 64, టేలర్ (సి అండ్ బి) చాహల్ 24, లాథమ్ (సి అండ్ బి) చాహల్ 11, నికోలస్ (సి) కుల్దీప్ (బి) జాదవ్ 12, సాంట్నర్ ఎల్బీ (బి) షమీ 14, బ్రాస్‌వెల్ (బి) కుల్దీప్ 7, సౌతీ నాటౌట్ 9, ఫెర్గుసన్ (స్టంప్) ధోనీ (బి) కుల్దీప్ 0, బౌల్ట్ (సి) రోహిత్ (బి) కుల్దీప్ 1, **ఎక్స్‌ట్రాలు:** 2, **మొత్తం:** 38 ఓవర్లలో 157 ఆలౌట్.**వికెట్లపతనం:** 1-5, 2-18, 3-52, 4-76, 5-107, 6-133, 7-146, 8-146, 9-148, 10-157.**బౌలింగ్:** భువనేశ్వర్ 5-0-20-0, షమీ 6-2-19-3, శంకర్ 4-0-19-0, చాహల్ 10-0-43-2, కుల్దీప్ 10-1-39-4, జాదవ్ 3-0-17-1.

భారత్: రోహిత్ (సి) గప్టిల్ (బి) బ్రాస్‌వెల్ 11, ధవన్ నాటౌట్ 75, కోహ్లీ (సి) లాథమ్ (బి) ఫెర్గుసన్ 45, రాయుడు నాటౌట్ 13, **ఎక్స్‌ట్రాలు:** 12, **మొత్తం:** 34.5 ఓవర్లలో 156/2. **వికెట్లపతనం:** 1-41, 2-132. **బౌలింగ్:** బౌల్ట్ 6-1-19-0, సౌతీ 6.5-0-36-0, ఫెర్గుసన్ 8-0-41-1, బ్రాస్‌వెల్ 7-0-23-1, సాంట్నర్ 7-0-32-0.

సైనా, సింధు శుభారంభం



జకార్తా: భారత స్టార్ షట్లర్లు సైనా, సింధు, శ్రీకాంత్.. ఇండోనేషియా మాస్టర్స్‌లో శుభారంభం చేశారు. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలిరౌండ్‌లో రెండోసీడ్ సింధు 22-24, 21-8, 21-17తో లీ జురుయ్ (చైనా), ఎనిమిదోసీడ్ సైనా 7-21, 21-16, 21-11తో దినార్ డయా అయుస్టిన్ (ఇండోనేషియా)పై గెలిచి రెండోరౌండ్‌లోకి ప్రవేశపెట్టారు. అయుస్టిన్‌పై గెలువడం సైనాకు ఇది మూడోసారి. పురుషుల సింగిల్స్ తొలిరౌండ్‌లో శ్రీకాంత్ 21-12, 21-8తో చోంగ్ వీ ఫెంగ్ (మలేసియా) నెగ్గాడు. ఇతర మ్యాచ్‌లో సాయి ప్రణీత్ 12-21, 16-21తో చెన్ లాంగ్ (చైనా) చేతిలో ఓడాడు.

సెరెనాకు చెక్

అమెరికా స్టార్‌ను ఓడించిన ప్లిస్కోవా

పురుషుల సింగిల్స్ సెమీస్‌లో జొకోవిచ్, పౌల్లే



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో పెను సంచలనం నమోదైంది. టైటిల్ ఫేవరెట్ హోదాతో అడుగుపెట్టిన అమెరికా నల్లకలువ సెరెనా విలియమ్స్ క్వార్టర్‌ఫైనల్లో అనూహ్య పరాజయంతో టోర్నీ నుంచి నిష్క్రమించింది. చెక్ రిపబ్లిక్ అమ్మాయి కరోలినా ప్లిస్కోవా 6-4,4-6,6-4స్కోరుతో సెరెనాపై పోరాడి విజయం సాధించి తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్ చేరింది. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో టాప్‌సీడ్, సెర్బియా స్టార్ నొవాక్ జొకోవిచ్ ..జపాన్ ఆటగాడు నిషికోరి గాయంతో రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరగడంతో ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్‌లో స్థానం ఖాయం చేసుకున్నాడు. కాగా, రవోనిక్‌తో జరిగిన మ్యాచ్‌లో ఫ్రాన్స్ నయా స్టార్ పౌల్లే విజయం అందుకుని సెమీస్ చేరుకున్నాడు. సెమీస్‌లో జొకోతో పౌల్లే తలపడనుండగా, మరో సెమీస్‌లో గ్రీస్ యువస్టార్ సిస్టిపాస్, రెండో సీడ్ రఫెల్ నాదల్ అమీతుమీ తేల్చుకోనున్నారు. మహిళల క్వార్టర్ ఫైనల్లో జపాన్ స్టార్ నమోవి ఒసాకా 6-1,6-4 స్కోరుతో రష్యా అమ్మాయి స్విటోలినాను ఓడించి సెమీస్ చేరింది.

పోరాడి గెలిచిన ప్లిస్కోవా..

టెన్నిస్ దిగ్గజం క్రిస్ ఎవర్ట్(24) గ్రాండ్‌స్లామ్ రికార్డును సమం చేయాలనుకున్న సెరెనా విలియమ్స్(23) ఆశలు ఫలించలేదు. రికార్డుస్థాయిలో ఏడుసార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్‌గా నిలిచిన సెరెనా ఈ ఏడాది కూడా ఫేవరెట్ హోదాతో బరిలోకి దిగింది. ప్రసవం కారణంగా పూర్తిస్థాయి ఫిట్‌నెస్ అందుకోని 37 ఏండ్ల సెరెనా..ప్లిస్కోవాతో బుధవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో ఒత్తిడికి లోనై చేజేతులా పరాజయం పాలైంది. తొలిసెట్‌లో ఓడినా రెండోసెట్ విజయంతో పుంజుకున్న సెరెనా మూడోసెట్ లోనూ 5-1 ఆధిక్యంతో నిలిచింది. ఈ దశలో అంతా విజయం సెరెనాదే అని భావించారు. అప్పుడే ప్లిస్కోవా అద్భుతం చేసింది. వరుసగా ఆరు పాయింట్లు గెలుచుకుని ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో పను సంచలనం నమోదు చేసింది. కాలిమడమ గాయం ఇబ్బంది పెట్టడంతో సెరెనా స్థాయికి తగిన ఆటతీరును ప్రదర్శించలేకపోయింది. కాగా, ప్లిస్కోవా అద్భుతంగా ఆడిందని, ఈ పరాజయానికి గాయాన్ని సాకుగా చూపలేనని మ్యాచ్ ముగిసిన అనంతరం సెరెనా పేర్కొనడం విశేషం. 'దాదాపు ఏడాది కాలం విశ్రాంతిలో ఉన్నాను. మళ్లీ రాకెట్ పట్టి పదినెలలు మాత్రమే గడించింది. ప్రారంభ రోజుల మాదిరిగా విజయాలను రాబట్టడం నాకు కష్టమే. కానీ విజయం సాధిస్తానో లేదంటే ఓడిపోతానన్న అంచనాలు నేను పెట్టుకోను. అలా చేస్తే గెలిచినప్పుడు ఉత్సాహం.. ఓడినప్పుడు నిరాశ కలిగిస్తుంది. అది నా తత్వం కాదు' అని సెరెనా అన్నది. మూడోసెట్లో 5-1(40-30) ఆధిక్యంలో సర్వీస్ చేస్తున్న సమయంలో మరో పాయింట్ సాధిస్తే మ్యాచ్ గెలిచే అవకాశం ఉన్నా ఓడిపోవడంపై ప్లిస్కోవాను ప్రశంసించింది. అనుభవంతో ఒత్తిడిని జయించిన ప్లిస్కోవా మ్యాచ్‌లో విజయం సాధించిందని సెరెనా తేల్చింది.



జొకోవిచ్

నిషికోరి, రవోనిక్ ఔట్

పురుషుల క్వార్టర్‌ఫైనల్లో కెనడా నయాస్టార్, 16వ సీడ్ మిలోస్ రవోనిక్ ఓటమిపాలయ్యాడు. బుధవారం ఫ్రెంచ్‌యువ ఆటగాడు లూయిస్ పౌల్లే 7-6 (7/4), 6-3, 6-7 (2/7), 6-4 స్కోరుతో రవోనిక్‌ను ఓడించి 2010లో జో విల్‌ఫ్రెడ్ సోంగా తర్వాత ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్ చేరిన తొలి ఫ్రెంచ్ ఆటగాడిగా రికార్డులకెక్కాడు. తొలిసెట్‌లో భారీ సర్వీస్‌లతో రవోనిక్‌ను టైబ్రేకర్‌లో ఓడించిన పౌల్లే..రెండో సెట్‌ను సునాయాసంగా గెలుచుకున్నాడు. ఈ సమయంలో పౌల్లే జోరుకు పగ్గం వేస్తూ మూడో సెట్‌ను రవోనిక్ కైవసం చేసుకున్నాడు. నాలుగోసెట్‌లో మాత్రం పౌల్లే ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా ఆడి సెట్‌తోపాటు మ్యాచ్‌ను కైవసం చేసుకున్నాడు. ఇటీవలే పాతకోచ్ ఇమాన్యుయెల్ స్థానంలో అమేలీ మౌరెస్మోను కొత్త కోచ్‌గా పౌల్లే నియమించుకున్నాడు. 2006 ఏడాది మహిళల సింగిల్స్‌లో మౌరెస్మో ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేతగా నిలిచింది. ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు ముందు హాప్‌మన్ కప్, సిడ్నీ ఇంటర్నేషనల్ టోర్నీ తొలిరౌండ్‌లోనే ఓడిపోవడంతో అతనిపై పెద్దగా ఎవరికీ అంచనాలు లేవు. 'గత పరాజయాలను మరిచి తాజాగా బరిలోకి దిగాడు. అమౌలీ నా ఆటతీరును సరిదిద్దింది. అందుకే రవోనిక్ తొలిసెట్‌లో 3-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లినా పెద్దగా ఆందోళన చెందలేదు. ఆడే మ్యాచ్‌పైనే దృష్టిపెట్టడం..కోర్టులో కఠినంగా శ్రమించడంతోనే సెమీస్ చేరగలిగాను' అని పౌల్లే అన్నాడు. టాప్‌సీడ్ జొకోవిచ్‌తో జరిగిన మ్యాచ్‌లో జపాన్ ఆశాకిరణం నిషికోరి పరాజయం పాలయ్యాడు. జొకో 6-1,4-1తో ఆధిక్యంలో కొనసాగుతున్న సమయంలో నిషికోరి తొడ కండరాల గాయంతో రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరగాడు. దీంతో జొకోవిచ్ సెమీఫైనల్లో ప్రవేశించాడు. రికార్డుస్థాయిలో ఏడో ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌పై గురిపెట్టిన జొకో టైటిల్‌కు రెండు అడుగుల దూరంలో నిలిచాడు. కాగా, వరుసగా మూడు మ్యాచ్‌లలో ఐదుసెట్ల పోరాటంతో నిషికోరి పూర్తిగా అలిసిపోయాడు. అందుకే క్వార్టర్‌ఫైనల్ సందర్భంగా తొడ కండరాలు పట్టేయడంతో అతను ఆటను కొనసాగించలేకపోయాడు. కేవలం 51 నిమిషాలపాటు వీరిద్దరి మ్యాచ్ కొనసాగి నిషికోరి వైదొలగడంతో ముగిసింది.

సెమీస్ పోరు

మహిళల సింగిల్స్

కరోలినా ప్లిస్కోవా(చెక్ రిపబ్లిక్)
X
నవోమి ఒసాకా(జపాన్)

పెట్రా క్విటోవా(చెక్‌రిపబ్లిక్)
X
డానియెల్ కొలిన్స్(అమెరికా)

పురుషుల సింగిల్స్

జొకోవిచ్(సెర్బియా)
X
లూయిస్ పౌల్లే(ఫ్రాన్స్)

రఫెల్ నాదల్(స్పెయిన్)
X
సిస్టిపాస్ (గ్రీస్)

అబే.. నల్లోడా!

పెహ్లుక్వాయోపై సర్ఫరాజ్ జాతివివక్ష వ్యాఖ్యలు

విచారణకు ఐసీసీ ఆదేశం



సర్ఫరాజ్

డర్బన్: పాకిస్థాన్ కెప్టెన్ సర్ఫరాజ్ అహ్మద్ చిక్కుల్లో పడ్డాడు. దక్షిణాఫ్రికాతో డర్బన్‌లో మంగళవారం జరిగిన రెండో వన్డేలో దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మన్ ఆండిలే పెహ్లుక్వాయోపై సర్ఫరాజ్ జాతివివక్ష వ్యాఖ్యలు చేశాడు. ఇవికాస్తా స్టంప్ మైక్‌లో రికార్డు కావడంతో ఈ వీడియో సామాజికమాధ్యమాల్లో వైరల్‌గా మారింది. పాకిస్థాన్ మాజీలు సహా ప్రపంచవ్యాప్తంగా సర్ఫరాజ్ వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబడుతూ అతనిపై విమర్శల వర్షం కురుస్తున్నది. దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ 37వ ఓవర్‌లో పెహ్లుక్వాయో ..పాక్ పేసర్ అఫ్రిది బౌలింగ్‌లో ఇన్నర్ ఎడ్జ్ కాగా సింగిల్ కోసం పరుగెత్తాడు. అప్పటికే పెహ్లుక్వాయో సునాయాస క్యాచ్‌ను పాక్ ఫీల్డర్ వదిలేయడంతో పాటు ఒక ఎల్బీ ఔట్‌ను అంపైర్ సమీక్ష ద్వారా బయటపడ్డాడు. అంతేకాదు ఆ పరుగుతో అతను అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. దీంతో సహనం నశించిన సర్ఫరాజ్ నోటికి పని చెప్పాడు.'అబే నల్లోడా.. మీ అమ్మ ఈరోజు ఎక్కడ కూర్చుంది? నీకోసం ఏం ప్రార్థించేందుకు ఈరోజు వచ్చింది?' అని సర్ఫరాజ్ అన్నాడు. ఈ మాటలు అన్నీ వికెట్‌కీపర్ ముందున్న స్టంప్ మైక్‌లో స్పష్టంగా రికార్డయ్యాయి. దీంతో అతనిపై సస్పెన్షన్ వేటు పడే ప్రమాదముంది. ఈ విషయాన్ని మ్యాచ్ అధికారులు, ఐసీసీ పరిశీలిస్తున్నారని, వ్యాఖ్యలపై విచారణ జరుపుతున్నట్లు దక్షిణాఫ్రికా మేనేజర్ మహ్మద్ మూసాజే తెలిపాడు. విచారణ అనంతరమే ఈ విషయంపై స్పందిస్తామని చెప్పాడు. మరోవైపు ఈ సంఘటన ఏ ఆటగాడు లేదా జట్టును ఉద్దేశించి చేయలేదని సర్ఫరాజ్ ట్విట్టర్ ద్వారా వివరణ ఇచ్చాడు. నా వ్యాఖ్యల కారణంగా ఎవరి మనోభావాలు దెబ్బతింటే వారికి బేషరతుగా క్షమాపణలు చెబుతున్నానని పాకిస్థాన్ కెప్టెన్ వెల్లడించాడు. ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికా జట్టును పెహ్లుక్వాయో (69నాటౌట్) గెలిపించిన విషయం తెలిసిందే.



వరంగల్ అర్బన్ జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ బుధవారం ముగిసింది. ఈ టోర్నీ బాలికల సబ్‌జూనియర్ విభాగంలో విజేతగా నిలిచి ట్రోఫీని కైవసం చేసుకున్న హైదరాబాద్ బాలికలజట్టు.

సెన్సెక్స్	నిఫ్టీ
36,108	10,831
336	91

ముడి చమురు (బ్రెంట్) 60.59 డాలర్లు

బంగారం ధరలు

న్యూఢిల్లీ(రూ.లలో)	
24 క్యారెట్లు	33,210
22 క్యారెట్లు	33,060
వెండి (కిలో)	40,160

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	68.40	74.90
యూరో	77.60	85.60
బ్రెయిన్ దినార్	181.70	193.70
కువైట్ దినార్	225.50	238.50
సౌదీ రియాల్	18.00	19.80
యూఏఈ దిర్హామ్	18.40	20.00

చికెన్ ధరలు (రూ.లలో)

ఫారం ధర	77.00
రిటైల్ లైవ్	99.00
డ్రెస్డ్	144.00
స్కిన్‌లెస్	163.00

నెక్ (వంద గుడ్లకు) (రూ.లలో)

హైదరాబాద్	400-00
రంగారెడ్డి	400-00
మెదక్	400-00
కరీంనగర్	402-00
వరంగల్	402-00
రిటైల్ ప్రైస్	4-60

ఈ బడ్జెట్‌కు కోరల్లేవ్



జీఎస్టీ రాకతో తగ్గిన ప్రాధాన్యం • పరోక్ష పన్నుల ఊసే లేకుండాపోయిన వైనం

శాఖాపరమైన కేటాయింపులు తప్ప పసలేని పద్దు • ఆర్థిక మంత్రి ప్రసంగంపై సన్నగిల్లిన ఆసక్తి

న్యూఢిల్లీ, జనవరి 23: స్వతంత్ర భారతావనిలో బడ్జెట్‌కున్న ప్రాముఖ్యతే వేరు. ముఖ్యంగా కేంద్ర బడ్జెట్ ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. సామాన్యుల నుంచి రాష్ర్టాల ముఖ్యమంత్రులదాకా సెంట్రల్ బడ్జెట్‌పై అమితాసక్తిని కనబరుస్తారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదంటే అతిశయోక్తి ఎంత మాత్రం కాదు. కేంద్రంలో ప్రస్తుత నరేంద్ర మోదీ సర్కారు అధికారంలోకి వచ్చిన దగ్గర్నుంచి నాలుగు వార్షిక బడ్జెట్లను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడం జరిగింది. గడిచిన 53 నెలల్లో ప్రతిసారి ఒక్కో బడ్జెట్‌కున్న ప్రాధాన్యత తగ్గుతూనే రావడం గమనార్హం. బడ్జెట్ అంటే ప్రభుత్వ ఆదాయ, వ్యయాల చిట్టా మాత్రమే కాదు.. ప్రజల జీవన రూపురేఖల్ని మార్చేది కూడా. అలాంటి బడ్జెట్.. వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) రాకతో నీరుగారిపోయింది. అవును.. ఇది నూటికి నూరుపాళ్లు నిజం. బడ్జెట్‌లో అన్నింటి కంటే కీలకమైనవి పరోక్ష పన్నులే. బడ్జెట్ ప్రసంగం మొదలైన దగ్గర్నుంచి అందరి చూపు.. పన్నులు ఎంత తగ్గాయి?.. ఏ వస్తు, సేవలపై ఎంతెంత దిగాయి?.. ఎవరికెంత లాభం చేకూరబోతున్నది? అన్నదానిపైనే ఉంటుందన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. వ్యాపార, పారిశ్రామిక వర్గాలు కూడా ఇందుకు మినహాయింపు కాదు. అయితే జీఎస్టీ రాకతో ఈ ఉత్సాహం అంతా కూడా ఆవిరైపోయింది. ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం దేశంలోనే చారిత్రక సంస్కరణగా చెప్పుకుంటున్న జీఎస్టీతో బడ్జెట్‌కు కోరల్లేకుండాపోయాయి మరి. 2017 జూలై 1 నుంచి దేశవ్యాప్తంగా జీఎస్టీ అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. ఎక్సైజ్ సుంకం, విలువ ఆధారిత పన్ను (వ్యాట్)సహా డజనుకుపైగా కేంద్ర, రాష్ట్ర పన్నులను కలిపి తెచ్చిన జీఎస్టీలో 500లకుపైగా సేవలు, 1,200లకుపైగా ఉత్పత్తులకు పన్నులు నిర్ణయించిన సంగతీ విదితమే. 0, 5, 12, 18, 28 శ్లాబుల్లో పన్ను రేట్లను ఖరారు చేయగా.. విద్య, వైద్యం, తాజా కూరగాయలు తదితర వాటికి జీఎస్టీ నుంచి మినహాయింపును కల్పించారు. వ్యాపారులు, వినియోగదారుల అభ్యర్థనలు, ఆందోళనల మధ్య నెలకోసారి సమావేశమవుతున్న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ నేతృత్వంలోని జీఎస్టీ కౌన్సిల్.. ఆయా వస్తు, సేవలపై పన్నులను తగ్గిస్తూనే ఉన్నది. వాస్తవానికి ఇదంతా కూడా జీఎస్టీ రాకముందు ఏడాదికోసారి వచ్చే బడ్జెట్‌లో ఉండే ప్రక్రియ. కానీ జీఎస్టీ రావడం.. జీఎస్టీ కౌన్సిల్ ప్రతి నెలా సమావేశమై పన్ను రేట్లను సవరిస్తుండటంతో బడ్జెట్‌పై, ఆర్థిక మంత్రి ప్రసంగంపై ఆసక్తి సన్నగిల్లిపోయింది. గతంలో బడ్జెట్‌కు ముందు మాత్రమే ప్రకటించిన పరోక్ష పన్నుల వసూలు ఆదాయం.. ఇప్పుడు నెలనెలా జీఎస్టీ వసూళ్ల పేరుతో బయటకు రావడం కూడా జరుగుతున్నది. ఇక జీఎస్టీ పరిధిలో లేని పెట్రో ఉత్పత్తుల గురించి చెప్పనక్కర్లేదు. అంతర్జాతీయ మార్కెట్ ఆధారంగా రోజుకోసారి పెట్రో ధరలను చమురు మార్కెటింగ్ సంస్థలే సవరిస్తున్నాయి. ఈ క్రమంలో గతేడాది (ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2018-19)గాను) ప్రకటించిన బడ్జెటే.. శాఖాపరమైన కేటాయింపులకు తప్ప పసలేని పద్దుగా నిలిచిందంటే, ఈసారి సార్వత్రిక ఎన్నికలుండటంతో ఓట్-ఆన్-ఎకౌంట్ బడ్జెట్ కావడం మరింత అనాసక్తిగా ఉంటుందన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.




ప్రత్యక్ష పన్నులపైనే దృష్టి

జీఎస్టీ కారణంగా బడ్జెట్‌లో పరోక్ష పన్నుల ఊసే లేకుండాపోగా, ప్రత్యక్ష పన్నులపై అందరి దృష్టి పడింది. ముఖ్యంగా ఆదాయం పన్ను (ఐటీ) పరిధిలోకి వచ్చే వేతన జీవులు బడ్జెట్‌ను కాస్త ఆసక్తిగా గమనిస్తున్నారిప్పుడు. వ్యక్తిగత ఆదాయంతోపాటు పదవీ విరమణపై నేషనల్ పెన్షన్ స్కీం (ఎన్‌పీఎస్) మొత్తాల ఉపసంహరణలు, ఈపీఎఫ్, పీపీఎఫ్‌లకు పన్ను ప్రయోజనాలు తదితర ప్రకటనల కోసం ఎదురుచూస్తున్నారు. ఇవిగాకుండా సంక్షేమ పథకాలకు కేటాయింపులు, ప్రాధాన్యతా రంగాలకు నిధులు తదితర ప్రకటనలూ కొంత ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఎన్నికల అనంతరం ఏర్పాటయ్యే ప్రభుత్వం ఈ బడ్జెట్ కేటాయింపులపై తుది నిర్ణయం తీసుకోనున్నది.

ఆర్థిక మంత్రిగా గోయల్

- అమెరికాలో జైట్లీకి శస్త్ర చికిత్స
- రెండు వారాలు విశ్రాంతి



న్యూఢిల్లీ, జనవరి 23: రైల్వేలు, బొగ్గు శాఖల మంత్రి పీయూష్ గోయల్‌కు బుధవారం ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖల అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం అమెరికాలో ఉన్న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీకి మంగళవారం న్యూయార్క్‌లోని ఓ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స జరిగింది. రెండు వారాలపాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు ఆయనకు సూచించారు. దీంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ.. గోయల్‌కు తాత్కాలికంగా ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖల్ని అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ వర్గాలు అధికారికంగా ప్రకటించాయి. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టాల్సి ఉన్న విషయం తెలిసిందే. అయితే జైట్లీ అనారోగ్యం నేపథ్యంలో ఈసారి గోయలే బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. గతంలోనూ జైట్లీకి కిడ్నీ మార్పిడి ఆపరేషన్ సందర్భంగా గోయల్ ఆర్థిక మంత్రిగా పనిచేసిన సంగతి విదితమే. ఈ నెల 13న సాఫ్ట్ టిష్యూ క్యాన్సర్ పరీక్షల నిమిత్తం జైట్లీ అమెరికాకు వెళ్లారు.

లాభాల స్వీకరణ ఉధృతం

స్టాక్‌మార్కెట్‌లో లాభాల స్వీకరణ ఉధృతం అయింది. మధ్యాహ్నం వరకు స్తబ్దుగా ట్రేడ్ మార్కెట్లు చివరి గంటన్నరలో అమ్మకాల తాకిడి ఒక్కసారిగా ఎక్కువైంది. దానికి తోడు అంతర్జాతీయ మార్కెట్ల నష్టాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. అమెరికా-చైనా వాణిజ్య చర్చలు ఇంకా ఒక కొలిక్కి రాకపోవడం మార్కెట్లన్నింటీపైనా ప్రభావం చూపింది. గత కొన్ని రోజులుగా వస్తున్న లాభాలను స్వీకరించడానికే ఇన్వెస్టర్లు మొగ్గు చూపారు. బీఎస్ఈ సెన్సెక్స్ 336.17 పాయింట్లు నష్టపోయి 36,108.47 వద్ద ముగియగా, నిఫ్టీ 81.30 పాయింట్ల నష్టంతో 10,831.50 వద్ద ముగిసింది. ఇండెక్స్ హెవీవెయిట్ ఐటీసీ ఆర్థిక ఫలితాలను ఇన్వెస్టర్లను మెప్పించలేకపోయాయి. ఇప్పటివరకు వెలువడిన ఆర్థిక ఫలితాల్లో మార్కెట్ అంచనాలకు మించి ఏవీ లేకపోవడం కూడా లాభాలకు స్వీకరణకు కారణమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. క్రూడాయిల్ పతనం నేపథ్యంలో రూపాయి మారకం రికవరీ కాస్త ఊరటను ఇచ్చినప్పటికీ మార్కెట్‌ను నష్టాల నుంచి కాపాడలేకపోయింది. బడ్జెట్, సాధారణ ఎన్నికలు, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు కొత్త కొనుగోళ్లపై ఆచితూచి వ్యవహరిస్తున్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు కూడా అమ్మకాలకు దిగడంతో సెంటిమెంట్ మరింత బలహీనంగా మారింది. ఫార్మా ఇండెక్స్ 0.60 శాతం లాభపడగా, మెటల్ 0.56 శాతం, మీడియా ఇండెక్స్ 1.30 శాతం లాభపడ్డాయి. కాగా, ఎఫ్ఎంసీజీ 1.69 శాతం, బ్యాంక్ నిఫ్టీ 0.84 శాతం, ఆటో 0.73 శాతం, ఐటీ 0.49 శాతం చొప్పున నష్టపోయాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్-100 ఇండెక్స్ 0.11శాతం, స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.28 శాతం చొప్పున నష్టపోయాయి. కేవలం నాలుగు షేర్లు మాత్రమే కొత్త 52 వారాల గరిష్ఠ స్థాయిని, 123 షేర్లు కొత్త 52 వారాల కనీస స్థాయిని నమోదు చేశాయి. మార్కెట్ బ్రెడ్త్‌కూడా నెగటివ్‌గానే ఉంది. ఎన్ఎస్ఈలో మొత్తం 1,072 షేర్లు నష్టాల్లో ముగిస్తే 676 షేర్లు మాత్రమే లాభంతో ముగిశాయి. నిఫ్టీలోనూ 31 షేర్లు నష్టాల్లోనూ, 19 షేర్లు లాభాల్లో ముగిశాయి.

ఏఐ మాజీ సీఎండీపై సీబీఐ కేసు



న్యూఢిల్లీ, జనవరి 23: ప్రభుత్వరంగ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా మాజీ సీఎండీ అరవింద్ జాధవ్‌పై సీబీఐ కేసును దాఖలు చేసింది. సంస్థ ఉద్యోగ నియామకాల్లో జరిగిన అవకతవకలపై ఆరోపణలు రావడంతో విచారణ చేపట్టిన సీబీఐ..తాజాగా ఆయనపై కేసును దాఖలు చేసింది. జాదవ్‌తోపాటు కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(వ్యక్తిగత) ఎల్‌పీ నక్వా(ఇంకా పదవీ విరమణ చేయలేదు), మాజీ అదనపు జనరల్ మేనేజర్(నిర్వహణ) ఏ కథపలియా, అబితాబ్ సింగ్, రోహిత్ భాసిన్‌లపై అవినీతి చట్టం ప్రకారం ఐపీసీ సెక్షన్‌ల ప్రకారం ఎఫ్ఐఆర్‌ను దాఖలు చేసింది. 2010లో ప్రమోట్ అధికారిని నేరుగా జనరల్ మేనేజర్(ఆపరేషన్స్) స్థాయి అధికారిగా నియమించినట్లు తమ దర్యాప్తులో వెల్లడైందని, దీంతో ఆయనపై కేసును దాఖలు చేసినట్లు సీబీఐ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

యూనిటెక్ ప్రమోటర్లకు బెయిల్ నిరాకరణ

న్యూఢిల్లీ, జనవరి 23: ఇండ్ల కొనుగోలుదారుల సొమ్మును దారి మళ్లించారన్న ఆరోపణలకు ఎదుర్కొంటున్న యూనిటెక్ ప్రమోటర్లు సంజయ్ చంద్ర, అజయ్ చంద్రలకు బుధవారం సుప్రీం కోర్టు బెయిల్ నిరాకరించింది. జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ హేమంత్‌గుప్తాలతో కూడిన బెంచ్ తాము అక్టోబర్ 30 జారీ చేసిన ఆదేశాలకు ప్రమోటర్లు కట్టుబడి లేనందున బెయిల్ తిరస్కరిస్తున్నట్టు చెప్పింది. ఆ ఆదేశంలో రూ. 750 కోట్లను కోర్టు రిజిస్ట్రార్ వద్ద డిపాజిట్ చేయాలని ఆదేశిస్తూ ఏడాదిన్నర పాటు జైలు శిక్షను విధించింది. అయితే రూ. 400 కోట్లను డిపాజిట్ చేసినందున తమకు బెయిల్ మంజూరు చేయాలంటూ యూనిటెక్ ప్రమోటర్లు చేసుకున్న విజ్ఞప్తిని కోర్టు తిరస్కరించింది. రూ. 750 కోట్లు డిపాజిట్ చేసిన తర్వాతనే బెయిల్ సాధ్యమవుతుందని స్పష్టం చేసింది.

ఐటీసీకి ఎఫ్ఎంసీజీ దన్ను

- క్యూ3లో రూ.3,209 కోట్ల లాభం

న్యూఢిల్లీ, జనవరి 23: పలు వ్యాపారాలు నిర్వహిస్తున్న ఐటీసీ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. డిసెంబర్ 31తో ముగిసిన మూడు నెలల కాలానికి గతేడాది నమోదైన రూ.3,090 కోట్ల నికర లాభంతో పోలిస్తే 3.84 శాతం పెరిగి రూ.3,209.07 కోట్లుగా నమోదైంది. ఎఫ్ఎంసీజీ, వ్యవసాయం, పేపర్‌బోర్డు, పేపర్, ప్యాకేజింగ్ రంగాలు అంచనాలకుమించి వృద్ధిని నమోదు చేసుకోవడం కంపెనీకి కలిసొచ్చింది. అక్టోబర్-డిసెంబర్ మధ్యకాలంలో కంపెనీ విక్రయాలు 15.09 శాతం పెరిగి రూ.11,340.15 కోట్లకు పెరిగాయి. నిర్వహణ ఖర్చులు కూడా 16.75 శాతం పెరిగి రూ.7,446.46 కోట్లకు చేరుకున్నాయి. గడిచిన త్రైమాసికంలో సంస్థకు వచ్చిన మొత్తం ఆదాయంలో ఎఫ్ఎంసీజీ విభాగం నుంచి రూ.8,274 కోట్లు రాగా(10.31 శాతం వృద్ధి), సిగరెట్లను విక్రయించడంతో రూ.5,073.38 కోట్లు(9.59 శాతం పెరుగుదల), ఇతర విభాగాల నుంచి రూ.3,200.98 కోట్లు, హోటళ్ల ద్వారా రూ.451.86 కోట్లు, వ్యవసాయ రంగం నుంచ ఇరూ.1,924.61 కోట్లు, పేపర్ బోర్డు, ప్యాకేజింగ్‌ల నుంచి రూ.1,542.51 కోట్ల ఆదాయం లభించింది.

మార్కెట్లోకి నిస్సాన్ కిక్స్

హైదరాబాద్, జనవరి 23: జపాన్ ఆటోమొబైల్ దిగ్గజం నిస్సాన్ తన కొత్త ఎస్‌యూవీ కిక్స్‌ను రాష్ట్ర మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. పెట్రోలు, డీజిల్ వేరియంట్లలో మొత్తం ఆరు మోడల్స్‌ను ప్రవేశపెట్టింది. ప్రారంభధర రూ. 9.55 లక్షలు కాగా గరిష్ఠ ధర రూ. 14.65 లక్షలు. 11 రంగుల్లో అనేక టెక్నాలజీ ఫీచర్స్‌తో ప్రవేశపెడుతున్న ఈ ఎస్‌యూవీని రూ. 25,000 చెల్లించి బుకింగ్ చేసుకోవచ్చు. పెట్రోల్ వేరియంట్ లీటర్‌కు 14.23 కిలోమీటర్లు, డీజిల్ వేరియంట్ 20.45 కిలోమీటర్ల మైలేజిని ఇస్తున్నదని నిస్సాన్ వైస్‌ప్రెసిడెంట్ అతుల్ షహానే తెలిపారు.

జీఎస్టీఏటీ జాతీయ ధర్మాసనం

కేంద్ర క్యాబినెట్ ఆమోదం • ఇక వివాదాల పరిష్కారం వేగవంతం

న్యూఢిల్లీ, జనవరి 23: వస్తు, సేవల పన్ను అప్పీలెట్ ట్రిబ్యునల్ (జీఎస్టీఏటీ) జాతీయ ధర్మాసనం ఏర్పాటుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. బుధవారం ఇక్కడ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో సమావేశమైన కేంద్ర మంత్రివర్గం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఓ అధికారిక ప్రకటన వెలువడింది. ఢిల్లీలో ఉండే ఈ ధర్మాసనంలో కేంద్రం నుంచి ఒకరు, రాష్ర్టాల నుంచి ఒకరు సభ్యులుగా ఉంటారు. ఓ అధ్యక్షుడు కూడా ఉండనున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సారథ్యంలోని జీఎస్టీ కౌన్సిల్.. గత నెల డిసెంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ఈ కేంద్రీకృత అప్పీలెట్ అథారిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. అందుకు అనుగుణంగానే తాజాగా క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కాగా, క్యాబినెట్ భేటీ అనంతరం కేంద్ర మంత్రి రవి శంకర్ ప్రసాద్ మాట్లాడుతూ.. జీఎస్టీ చట్టాల కింద వివాదాలను వేగవంతంగా పరిష్కరించేందుకు జీఎస్టీఏటీ నేషనల్ బెంచ్ దోహదపడగలదని అభిప్రాయపడ్డారు. జాతీయ ధర్మాసనం రాకతో ఆయా కేసుల్లో రాష్ట్ర స్థాయి ఆదేశాలపై సవాల్‌కు వీలు కలిగింది.



రూ.92.50 లక్షల ఏకకాల ప్రారంభ వ్యయంతో ఏర్పడిన జీఎస్టీఏటీ నేషనల్ బెంచ్‌కు ఏటా రూ.6.86 కోట్ల పునరావృత వ్యయం కానున్నది.

సార్క్ దేశాల కోసం..

సార్క్ దేశాల కోసం నగదు మార్పిడీ విధాన ఒప్పందంలో సవరణలను క్యాబినెట్ ఆమోదించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ), సార్క్ సభ్య దేశాల సెంట్రల్ బ్యాంక్‌ల సంప్రదింపులతో ద్వైపాక్షిక లావాదేవీలు జరుగుతాయని ఓ ప్రభుత్వ అధికారిక ప్రకటన స్పష్టం చేసింది. సార్క్ దేశాల్లో భారత్‌తోపాటు అఫ్గనిస్తాన్, పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్, మాల్దీవులున్నాయి. 2 బిలియన్ డాలర్ల పరిమాణం కలిగిన ఈ అరెంజ్‌మెంట్.. 400 మిలియన్ డాలర్ల ఆరంభ మూలధనంతో మొదలవుతున్నది.

పన్నులు తగ్గించండి: మారుతి

భారత్‌లో ఆటోమొబైల్స్‌పై పన్నులు అధికంగా ఉన్నాయని, ఇతర దేశాలతో పోల్చితే చాలా ఎక్కువగా వసూలు చేస్తున్నారని దేశీయ ఆటో రంగ దిగ్గజం మారుతి సుజుకీ ఇండియా ఎండీ, సీఈవో కెనిచీ అయుకవా అన్నారు. బుధవారం పీటీఐతో మాట్లాడిన ఆయన జీఎస్టీలో ఆటో రంగంపై పన్ను తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. గరిష్ఠంగా 28 శాతం పన్ను వేశారని, ఆపై వాహన పొడవు, ఇంజిన్ పరిమాణం, మోడల్ ఆధారంగా మళ్లీ 1 శాతం నుంచి 15 శాతం వరకు అదనపు పన్ను వసూలు చేస్తున్నారని గుర్తుచేశారు. పరిశ్రమ అభివృద్ధి కోసం ఈ పన్నుల భారాన్ని తగ్గించాలని, ఈ బరువు మోయలేకుండా ఉందని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు చెప్పారు. వాహన కొనుగోళ్లు పెరుగాలంటే పన్నులు తక్కువగా ఉండాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అమ్మకాలు పడిపోతున్న వేళ ఆటో ఇండస్ట్రీని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ఆయన వ్యాఖ్యానించారు.



పట్టణీకరణతోనే జోష్

- అదే భారత జీడీపీకి చోదక శక్తి
- నీతి ఆయోగ్ సీఈవో కాంత్

దావోస్, జనవరి 23: భారతీయ ఆర్థిక వృద్ధికి చోదక శక్తి పట్టణీకరణేనని నీతి ఆయోగ్ సీఈవో అమితాబ్ కాంత్ అన్నారు. సంస్కరణల అమలు, మౌలిక రంగ బలోపేతం వంటివి కూడా కీలకమేనని అభిప్రాయపడ్డారు. ఇక్కడ జరుగుతున్న ప్రపంచ ఆర్థిక మండలి (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సమావేశంలో పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) అంచనా 7.5 శాతం వృద్ధిరేటును భారత్ అధిగమించగలదన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగమనంలో ఉన్నా.. భారత్ దాన్ని తట్టుకుని వృద్ధిపథంలో పయనించగలదన్న ధీమాను కనబరిచారు. ఈ క్రమంలోనే దేశంలో 100కుపైగా గల స్మార్ట్ సిటీలతో భారత పట్టణీకరణకు గొప్ప ఉత్సాహం లభిస్తున్నదని చెప్పారు.

సరైన నియంత్రణ ఉండాలి: బజాజ్

నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ)కు సరైన నియంత్రణ వ్యవస్థ అవసరమని బజాజ్ ఫిన్‌సర్వ్ చీఫ్ సంజీవ్ బజాజ్ ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. అప్పుడే వినియోగదారుల్లో విశ్వాసం ఇనుమడిస్తుందన్నారు. ఇక సరైన ఉత్పత్తులు, సేవల కల్పనకు సాంకేతిక పరిజ్ఞానమే మూలమన్నారు. ఇదిలావుంటే నేడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను భారత్, చైనా వంటి దేశాలు చాలా ప్రభావితం చేస్తున్నాయని జర్మనీ చాన్స్‌లర్ ఏంజిలా మెర్కెల్ అన్నారు.

భారత్ వృద్ధిరేటు 7.4 శాతం

- ఐక్యరాజ్యసమితి అంచనా

న్యూఢిల్లీ, జనవరి 23: దేశీయ ఆర్థిక వ్యవస్థ 7.4 శాతం మేర వృద్ధి చెందుతుందని ఐక్యరాజ్యసమితి తన నివేదికలో వెల్లడించింది. ప్రపంచ ఆర్థికస్థితి, అవకాశాలు-2019 అనే నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. ఇండియా జీడీపీ 2020-21 నాటికి 7.4 శాతం పెరగనున్న ఆ నివేదికలో పేర్కొంది. అమలవుతున్న సంస్కరణలు, వినియోగం, పెరుగుతున్న ద్రవ్య వినియోగం ఫలితాలతో వృద్ధిరేటు పెరుగుతుందని అంచనా వేసింది. ప్రైవేట్ రంగ పెట్టుబడుల్లో వృద్ధి కారణంగా మధ్యకాలికంగా వృద్ధి రేటుకు దన్నుగా ఉంటుందని అభిప్రాయపడింది. సామాజిక, ఆర్థిక, పర్యావరణ సవాళ్లతో గ్లోబల్ ఆర్థిక వృద్ధి రేటు పెరుగుదలపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గట్టర్స్ ఆ నివేదికలో వ్యాఖ్యానించారు.

రోజువారి సేవల కోసం విజ్జీ యాప్



హైదరాబాద్, జనవరి 23: రోజువారి అవసరాలకోసం మరో యాప్ అందుబాటులోకి వచ్చింది. హైదరాబాద్ కేంద్రస్థానంగా టెక్నాలజీ సేవలు అందిస్తున్న విజ్జీ లాజిస్టిక్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్..'విజ్జీ' పేరుతో మొబైల్ అప్లికేషన్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా కంపెనీ ప్రమోటర్ రవి గొల్లపుడి మాట్లాడుతూ..గృహస్తులు, చిన్నస్థాయి వ్యాపారవేత్తలకు బుకింగ్ చేసుకున్న వస్తువులను సరఫరా చేయాలనే ఉద్దేశంతో ఈ అప్లికేషన్‌ను రూపొందించినట్లు చెప్పారు. ఈ యాప్ ద్వారా ఏ వస్తువైన, ఏ సమయంలోనైనా వినియోగదారుడు నుంచి పిక్-అప్ చేసుకొని అందచేయడం జరుగుతుందన్నారు. ఇందుకోసం మూడు కిలోమీటర్ల వరకు రూ.20 చార్జీ చేయనున్న సంస్థ.. ఆ తర్వాతి నుంచి ఒక్కో కిలోమీటర్‌కు రూ.10 చొప్పున వసూలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం సంస్థ 15 మంది డెలివరీ బాయ్స్ ఉండగా, ఈ ఏడాది చివరినాటికి సంఖ్యను భారీగా పెంచుకోనున్నట్లు ప్రకటించారు.

ఓరియెంట్ ఏరోస్లిమ్ ఫ్యాన్లు

న్యూఢిల్లీ, జనవరి 23: ఓరియెంట్ ఎలక్ట్రిక్ మార్కెట్‌లోకి ఏరోస్లిమ్ పేరుతో సరికొత్త స్మార్ట్ సీలింగ్ ఫ్యాన్లను తీసుకొచ్చింది. ఈ తరహా ఫ్యాన్లను దేశీయ మార్కెట్‌లోకి ప్రవేశపెట్టడం ఇదే తొలిసారి అని బుధవారం ఓ ప్రకటనలో సంస్థ తెలియజేసింది. ఈ ఏరోస్లిమ్ ప్రీమియం సీలింగ్ ఫ్యాన్లతో 40 శాతం విద్యుత్ ఆదా కాగలదని వెల్లడించింది. ఫ్యాన్ బ్లేడ్‌లు సన్నగా ఉన్నప్పటికీ వంగిపోవన్న సంస్థ.. దీన్ని రిమోట్‌తో ఆపరేట్ చేయవచ్చని పేర్కొన్నది.

హైదరాబాద్‌లో ఓలా జోరు

హైదరాబాద్, జనవరి 23: యాప్ (అప్లికేషన్) ఆధారిత క్యాబ్ సేవలదారు ఓలా.. హైదరాబాద్‌లో అటు కార్లు, ఇటు బైక్‌ల సేవలతో దూసుకెళ్తున్నది. భాగ్యనగరంలో 5 వేల బైక్ డ్రైవర్లను కలిగి ఉండటమే లక్ష్యంగా ముందుకెళ్తున్న ఓలా.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఆ లక్ష్యాన్ని చేధించాలనుకుంటున్నది. ఇందులో భాగంగానే ఓలా మూడు రోజుల బైక్ మేళా నిర్వహిస్తున్నది. ఔత్సాహికులతో మమేకమై కొత్త బైక్ డ్రైవర్లను నియమించుకుంటున్నామని ఈ సందర్భంగా సంస్థ తెలియజేసింది.


పొరుగింటి రుచుల ఫూడీబడ్డీ



హైదరాబాద్, జనవరి 23: ఇరుగు పొరుగుకు మీ చేతి వంటల రుచులు చూపించాలనుకుంటున్నారా? లేదా పొరుగింటి ఘుమఘుమలను మీరే రుచి చూడాలనుకుంటున్నారా? అయితే మీకోసం వచ్చిందో కొత్త ఫూడీబడ్డీ యాప్. వంట చేయడం హాబీగా ఉన్నవారు ఈ యాప్‌లో రిజిస్టర్ చేసుకుని తమ రుచికరమై ఆహార పదార్థాలను మీ ఇరుగుపొరుగుకు అమ్మేయవచ్చు. అలాగే పక్కింటి వంటింటి వాసనలు చూసి అయో తినలేకపోతున్నామే అని బాధపడే వారు ఆ ఇంటి నుంచి ఆర్డరు చేసి తెప్పించుకోవచ్చు. ఈ ఐడియాను యాప్ రూపంలో అమలు చేసిందో బెంగళూరుకు చెందిన తెలుగమ్మాయి రచనారావు, ఆమె భర్త అఖిల్ సేతురామన్. ఇప్పటికే బెంగళూరు అరంగేట్రం చేసి నలుమూలకు పాకుతుండగా, హైదరాబాద్‌లోనూ అడుగుపెట్టింది. ఈ యాప్‌ను బెంగళూరులో 20 వేల మంది ఉపయోగిస్తున్నారు. ఈ సక్సెస్‌ను చూసిన వారు హైదరాబాద్‌లోనూ ఆసక్తి కనిపిస్తుండడంలో ఇక్కడి మార్కెట్‌లోకి ప్రవేశించారు. త్వరలో దేశంలోని మిగతా ప్రధాన నగరాల్లోకి కూడా విస్తరించాలన్న ప్రణాళికలతో ఉన్నట్టు రచనారావు తెలిపారు. తమ యాప్ రుచికరమైన వంటలు చేసే వారికి రుచులు కోరుకునే వారికి మధ్య వారధిగా పనిచేస్తుందన్నారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం 50 నలభీములు ఇందులో రిజిస్టర్ చేసుకోగా త్వరలోనే బెంగళూరు స్థాయిని చేరుకోగలదన్న విశ్వాసాన్ని ఆమె వ్యక్తం చేశారు.

సరికొత్తగా వ్యాగన్‌ఆర్

- గరిష్ఠ ధర రూ.5.69 లక్షలు



న్యూఢిల్లీ, జనవరి 23: కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ..తన హ్యాచ్‌బ్యాక్ వ్యాగన్‌ఆర్‌ను సరికొత్తగా దేశీయ మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ కారు రూ.4.19 లక్షల నుంచి రూ.5.69 లక్షల లోపు ఢిల్లీ మార్కెట్లో లభించనున్నది. 1.2 లీటర్ పెట్రోల్ ఇంజిన్‌తోపాటు 1 లీటర్ పవర్‌ట్రైన్ ఇంజిన్ కలిగిన కారును ఎంపిక చేసుకునే అవకాశం కొనుగోలుదారులకు సంస్థ కల్పించింది. ఈ నూతన వ్యాగన్‌ఆర్ మోడల్ ఒక కుటుంబ సభ్యులే కాకుండా యువత, కొనుగోలుదారులు ఇష్టపడే కారని మారుతి ఎండీ, సీఈవో కెనిచి అయుకవా తెలిపారు. ఒక్క లీటర్ ఇంజిన్ కలిగిన కారు 22.5 కిలోమీటర్ల మైలేజ్ ఇవ్వనుండగా, 1.2 లీటర్ల ఇంజిన్ కారు 21.5 కిలోమీటర్లు ఇవ్వనున్నది.

■ ఖాన్ లతీఫ్‌ఖాన్ ఎస్టేట్‌లో అగ్నిప్రమాదం



హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని ఖాన్ లతీఫ్‌ఖాన్ ఎస్టేట్ ఐదో అంతస్తులో బుధవారం భారీఎత్తున మంటలు చెలరేగాయి. అడ్వాంటేజ్ ఐటీ సొల్యూషన్స్ సంస్థ కార్యాలయంలోని ఏసీలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి దట్టమైన పొగతోకూడిన మంటలు ఇతర అంతస్తులకు వ్యాపించాయి. సంస్థ ఉద్యోగులు.. భవనంలోని అన్ని అంతస్తుల్లో కొనసాగుతున్న కార్యాలయాల్లో పనిచేస్తున్నవారిని అప్రమత్తం చేయడంతో వారు బయటకు వచ్చారు. అగ్నిమాపకశాఖ అధికారులు 14 వాహనాల సాయంతో మంటలను అదుపుచేశారు. -బేగంబజార్

కొలువులే..కొలువులు

వచ్చే ఆరు నెలల్లో 20 శాతం వృద్ధి

నౌకరి డాట్ కామ్ సర్వేలో వెల్లడి



హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ : నూతన సంవత్సరంలో నిరుద్యోగుల పంటపండనున్నది. వచ్చే ఆర్నెళ్లలో కొలువుల జాతర సాగనున్నట్టు ప్రముఖ ఉపాధికల్పన సంస్థ నౌకరి డాట్ కామ్ తన ద్వైవార్షిక సర్వేలో వెల్లడించింది. గత ఆర్నెళ్ల(2018 జూలై నుంచి డిసెంబర్ వరకు)తో పోల్చితే వచ్చే ఆర్నెళ్ల(2019 జనవరి నుంచి జూన్)లో ఉద్యోగ అవకాశాలు 20 శాతం పెరుగనున్నాయని తెలిపింది. ప్రధానంగా ఐటీ, బీపీవో, బీఎఫ్‌ఎస్‌ఐలకు చెందిన విభాగాల్లో పెద్దఎత్తున నియామకాలు జరుగనున్నాయి. ఇందులో సేల్స్, మార్కెటింగ్‌రంగాల తర్వాత అత్యధికంగా ఐటీ, సాఫ్ట్‌వేర్‌రంగాల్లో ఉద్యోగాలు ఉండనున్నాయి. మానవ వనరులు, అకౌంట్స్, ఆపరేషన్స్ విభాగాల్లోనూ ఉద్యోగావకాశాలు పెరగనున్నాయి. దేశవ్యాప్తంగా 3310 మంది రిక్రూట్‌మెంట్ల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ సర్వేను రూపొందించింది. వీరిలో 84 శాతం మంది నియామకాల్లో 20 శాతం మేర ఉంటుందని అంచనావేయగా.. కొత్త ఉద్యోగాల సృష్టితో పాటు భర్తీల్లో పెరుగుదల అంతంత మాత్రంగానే ఉంటుందని 56 శాతం మంది అంచనా వేయగా, కేవలం ఉద్యోగాల భర్తీ మాత్రమే ఉంటుందని మరో 12 శాతం మంది అభిప్రాయాలను వెలిబుచ్చారు. వచ్చే ఆరునెలల్లో ప్రతిభావంతుల కొరత తీవ్రంగా ఉందని 42 శాతం మంది రిక్రూటర్లు భావిస్తుండగా, ఈ కొరత గత ఆరునెలల మాదిరిగానే ఉంటుందని 31 శాతం మంది అభిప్రాయపడ్డారు. ఇంక్రిమెంట్ల విషయానికొస్తే.. ఈ ఏడాది 20 శాతానికి పైగా ఉంటాయని 16 శాతం మంది అంటే, 15 నుం చి 20 శాతం మధ్య ఉంటుందని 15 శాతం రిక్రూటర్లు చెప్తున్నారు. 10 నుంచి 15 శాతం ఇంక్రిమెం ట్లు ఉండే అవకాశముందని మెజార్టీ రిక్రూటర్లు చెప్పారు.

అనుభవమున్న వారికే అవకాశాలెక్కువ..

పని అనుభవం ఎక్కువ ఉన్నవారికే ఉద్యోగావకాశాలు ఎక్కువగా లభిస్తున్నాయి. అత్యధికంగా మూడేండ్ల నుంచి ఐదేండ్ల వరకు ఉద్యోగ అనుభవం ఉన్న వారికి ఎక్కువ అవకాశాలుంటే.. ఏడాది నుంచి మూడేండ్ల అనుభవం ఉన్నవారికి తక్కువ అవకాశాలున్నాయి. ప్రస్తుతం ఉద్యోగాలు చేస్తున్నవారిలో ఒక శాతం మాత్రమే తొలిగించే పరిస్థితులు ఉండనున్నాయి. ఇదిలావుంటే.. ఉద్యోగాలు ఎక్కువగా ఉన్నప్పటికీ.. దానికి కావాల్సిన ప్రతిభ ఉన్నవారు సరైన సంఖ్యలో లేరని సర్వే తేల్చింది. వచ్చే ఆరు నెలల్లో నైపుణ్యాలున్న వారిసంఖ్య తీవ్రతరం అయ్యే అవకాశం ఉండనుంది. ప్రధానంగా ఉద్యోగం మారితే వేతనం పెరగడంతోపాటు ప్రమోషన్లు, ఉత్తమ ప్రొఫైల్ కోసం మారుతున్నట్టు రిక్రూటర్లు అభిప్రాయపడుతున్నారు. వలసలు 20 నుంచి 40 శాతంగా ఉందని 14 శాతం మంది రిక్రూటర్లు అంచనా వేస్తే, సగం మంది ఐదు నుంచి 15 శాతానికి పరిమితం చేయాలని అంచనా వేస్తున్నారు.

పంటకాలనీలకు చేయూత

■ రైతుల ఉత్పత్తులకు అధిక ధరలు: సమీక్షలో పార్థసారథి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైతుల ఆర్థిక స్వావలంబనకు, అభివృద్ధికి తోడ్పడేలా పంటలకాలనీలను ఏర్పాటుచేసి చేయూతనిచ్చేలా వ్యవసాయ అనుబంధరంగాలు సమన్వయంతో పనిచేయాలని వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి కోరారు. బుధవారం సచివాలయం నుంచి జిల్లాల వ్యవసాయాధికారులు, ఏడీఏలు, మండల వ్యవసాయాధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. పంటకాలనీల ఏర్పాటుతో రైతుల ఉత్పత్తులకు అధిక ధరలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లాల్లోని పంటల సరళి, విస్తీర్ణం, దిగుబడి అనుగుణంగా పంటలకాలనీలను ఉద్యానవన, వ్యవసాయ, ఇతర శాఖల సమన్వయంతో ఏర్పాటుచేయాలని జిల్లా వ్యవసాయాధికారులను కోరారు. సమావేశంలో ఉద్యానశాఖ కమిషనర్ ఎల్ వెంకట్రామిరెడ్డి, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి, ఫుడ్‌ప్రాసెసింగ్ డైరెక్టర్ అఖిల్, సెర్ప్ సీఈవో పౌసుమిబసు, స్త్రీనిధి ఎండీ విద్యాసాగర్‌రెడ్డి, వ్యవసాయశాఖ అదనపు కమిషనర్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆహారశుద్ధి పరిశ్రమల సందర్శనకు రాష్ట్ర అధికారుల బృందం

రాష్ట్రంలో ఆహారశుద్ధి పరిశ్రమలను ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో పార్థసారథి ఆధ్వర్యంలోని అధికారుల బృందం గురువారం హర్యానా రాష్ట్రం సోనేపట్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌ను సందర్శించనున్నది.

విత్తన సదస్సుకు భారీ ఏర్పాట్లు

అధికారులతో వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి సమీక్ష



బుధవారం సదస్సు ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : అంతర్జాతీయ విత్తన సదస్సుకు అన్ని ఏర్పాట్లు చేయాలని వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సీ పార్థసారథి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో జూన్ 26 నుంచి జూలై 3 వరకు జరిగే 32వ అంతర్జాతీయ విత్తన సదస్సు- 2019కి సంబంధించి రిజిస్ట్రేషన్, ఎగ్జిబిషన్ స్టాళ్లు, రవాణా, వసతి సౌకర్యాల ఏర్పాట్లపై బుధవారం ఆయన సమీక్షించారు. తెలంగాణ విత్తన, సేంద్రియ ధ్రువీకరణ అథారిటీ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమీక్షలో పార్థసారథి మాట్లాడుతూ.. ఈ సదస్సును మొట్టమొదటి సారిగా ఆసియాఖండంలో నిర్వహిస్తున్నారని చెప్పారు. దీని నిర్వహణకు అవసరమైన కమిటీలను వేయాలని సూచించారు. జూన్ 27న జరుగబోయే సదస్సులో వెయ్యిమంది వరకు పాల్గొనే అవకాశం ఉన్నదని, వారికి అవసరమైన రవాణా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. సుమారు 800 మంది విదేశీ ప్రతినిధులకు పోస్ట్ కాంగ్రెస్ టూర్లు ఉంటాయని, హెరిటేజ్ టూర్ 3 ప్యాకేజీలు, విత్తన పరిశ్రమ టూర్‌లో 2 ప్యాకేజీల సదుపాయం కల్పించాలని తెలిపారు. ఈ సందర్భంగా విత్తన కంపెనీలు తమ ఉత్పత్తులను ప్రదర్శించేందుకు స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఇందుకోసం స్థానిక విత్తన సంస్థల ప్రతినిధులు మే ఒకటో తేదీలోగా ఇస్టా కాంగ్రెస్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. విత్తన సదస్సు ఏర్పాట్లపై ఇస్టా కోఆర్డినేటర్ కే కేశవులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమీక్షలో ఉద్యానశాఖ డైరెక్టర్ ఎల్ వెంకట్రామిరెడ్డి, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఆర్ జగదీశ్వర్, కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే రవీందర్‌రెడ్డి తదిరుతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో పరిస్థితులు మెరుగుపడాలి

■ ఉత్తమ ప్రతిపాదనలతో రండి.. సర్కార్‌కు హైకోర్టు సూచన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రభుత్వ పాఠశాలల్లో పరిస్థితులు మెరుగుపడాల్సిన అవసరం ఉన్నదని హైకోర్టు అభిప్రాయపడింది. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసనకు సంబంధించిన ఫలితాలు రోజురోజుకూ తగ్గుతుండటంపై ఆందోళన వ్యక్తంచేసిన న్యాయస్థానం.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించడం, మంచి ఫలితాలు సాధించడం వంటి అంశాలపై శుక్రవారంనాటికి ఉత్తమ ప్రతిపాదనలతో ముందుకురావాలని ప్రభుత్వానికి సూచించింది. ప్రతిపాదనలు రూపకల్పనకు విద్యాశాఖకు చెందిన సీనియర్ అధికారి నేతృత్వంలో కమిటీ వేయాలని పేర్కొన్నది. ప్రజాప్రయోజన వ్యాజ్యంపై మంగళవారం విచారణ చేపట్టిన కోర్టు.. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

ఇబ్రహీంపట్నం ఓట్ల లెక్కింపు వివరాలివ్వండి

■ రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు సూచన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఎన్నికకు సంబంధించిన వివరాలను అందజేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు బుధవారం సూచించింది. గత ఏడాది డిసెంబర్ 11న జరిగిన ఓట్ల లెక్కింపులో భాగంగా వీవీప్యాట్ స్లిప్పులకు, ఎలక్ట్రానిక్ విధానంలో వచ్చిన ఫలితాల మధ్య తేడాలున్నాయని ఇబ్రహీంపట్నం బీఎస్పీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. తాము ఎవరికీ వ్యతిరేకంగా ఆరోపణలు చేయడంలేదని.. వీవీప్యాట్ స్లిప్పులను లెక్కించాలని కోరుతున్నామని పిటిషనర్ పేర్కొన్నారు. దీనిపై వివరాలు సమర్పించాలని ఈసీని ఆదేశించిన హైకోర్టు.. కేసు తదుపరి విచారణను ఈ నెల 30కి వాయిదా వేసింది.

కృష్ణపట్నం పోర్టు నుంచి 15.19 మిలియన్ టన్నుల సరుకు రవాణా

■ దక్షిణ మధ్య రైల్వే సమీక్షలో వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : దక్షిణ మధ్య రైల్వే ద్వారా నిర్వహిస్తున్న పోర్టుల్లో ఒకటైన కృష్ణపట్నం నుంచి 2018-19 ఆర్థిక సంవత్సరంలో 15.19 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఈ మేరకు బుధవారం రైల్‌నిలయంలో నిర్వహించిన కృష్ణపట్నం పోర్టు రవాణా వినియోగదారుల సమీక్ష సమావేశంలో ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ మధుసూదన్ రావు మాట్లాడుతూ.. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి చివరినాటికి ఇలాగే కొనసాగితే 20.25 మిలియన్ టన్నుల రవాణా లక్ష్యాన్ని చేరుకుంటామని చెప్పారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులపై రహస్య సర్వే!

■ ఈసారి మనకెన్ని వస్తాయో!

■ మెరుగైన ర్యాంకులు సాధిస్తామంటున్న పురపాలకశాఖ

■ జీహెచ్‌ఎంసీ పనితీరుపై ఢిల్లీ బృందం సంతృప్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశవ్యాప్తంగా స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల ఎంపికకోసం ఢిల్లీ ప్రతినిధుల బృందం తెలంగాణ మున్సిపాలిటీల్లో రహస్యంగా పర్యటిస్తున్నది. స్థానిక మున్సిపాలిటీలకు సమాచారం ఇవ్వకుండానే.. యాభై పట్టణాల్లో ఈ ప్రక్రియను పూర్తిచేసినట్టు సమాచారం. ర్యాంకుల ఎంపికకోసం అవసరమయ్యే సర్వేను ఈ నెల 31లోపు పూర్తి చేయాల్సిఉంటుంది. ఇప్పటికే 70శాతం సర్వే పూర్తిచేసినట్టు సమాచారం. వాస్తవిక పరిస్థితుల్ని తెలుసుకునేందుకు ఢిల్లీ బృందం రహస్య సర్వే చేస్తున్నదని పలు పట్టణ స్థానిక సంస్థలకు చెందిన అధికారులు చెప్తున్నారు. గత ఏడాది దక్షిణభారత దేశంలో మొదటి వంద పట్టణాల్లో 25 పట్టణాలు స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులను సొంతంచేసుకొన్నాయి. ఇందుకు కారణం ఆ సమయంలో పురపాలకశాఖ మంత్రిగా కే తారక రామారావు వ్యవహరించడమే. వ్యర్థాల నియంత్రణలో ఉత్తమ ఆవిష్కరణలుగా పీర్జాదిగూడ ప్రత్యేక గుర్తింపును పొందింది. ప్రజలంతా మెచ్చిన మున్సిపాలిటీగా బోడుప్పల్ ఖ్యాతినార్జించింది. ఘన వ్యర్థాల నిర్వహణలో దేశంలోని 29 రాష్ట్ర రాజధానుల్లో హైదరాబాద్ ప్రథమ ర్యాంకును సంపాదించింది. నిరుడుతో పోలిస్తే మెరుగైన ర్యాంకుల్ని సాధిస్తామని పురపాలకశాఖ ధీమాతో ఉన్నది.

సిరిసిల్లపై సంతృప్తి

సిరిసిల్ల పట్టణంలో ఇటీవల పర్యటించిన స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం సంతృప్తి వ్యక్తంచేసినట్టు సమాచారం. చెత్త సేకరణ, తాగునీటి సరఫరా, పరిశుభ్రత వంటి అంశాల్లో ప్రగతిపై ప్రజలను అడిగి తెలుసుకుని పాయింట్లు వేస్తున్నట్టు తెలిసింది.

జీహెచ్‌ఎంసీలో సర్వే మొదలు

స్వచ్ఛ సర్వేక్షణ్ బృంద సభ్యులు కొన్ని రోజులుగా జీహెచ్‌ఎంసీ పరిధిలోని పలుప్రాంతాల్ని సందర్శిస్తున్నారు. బహిరంగ మలవిసర్జనరహిత నగరంగా హైదరాబాద్ తాజా స్థితిగతులపై ఆరా తీస్తున్నారని తెలిసింది. బహిరంగ మలవిసర్జనను అరికట్టేందుకు జీహెచ్‌ఎంసీ కట్టుదిట్టమైన చర్యల్ని తీసుకుంటున్నది. ఘనవ్యర్థాల నిర్వహణను మెరుగ్గా చేపడుతున్నది. ఎక్కడికక్కడ ప్రజా మరుగుదొడ్లను ఏర్పాటుచేసింది. కొన్నిప్రాంతాల్లో కమ్యూనిటీ టాయిలెట్లకు శ్రీకారం చుట్టింది. ఘన వ్యర్థాల నిర్వహణను మెరుగ్గా నిర్వహించడానికి ప్రణాళికల్ని చేపట్టింది. వ్యర్థాలపై హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులతో అధికారులు భేటీఅయి అవగాహన తెస్తున్నారు.

నమస్తే తెలంగాణ
జిందగీ
గురువారం 24 జనవరి 2019
WWW. NTNEWS.COM
/nt.zindagi

ఆలోచనలో మార్పు రావాలి

మహిళలు అత్యాచారానికి బలవుతూనే ఉన్నారు. దీనికి కారణం.. మహిళల వస్త్రధారణ అంటూ చాలామంది అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. కానీ ఇలాంటి డ్రెస్‌లు వేస్తే కూడా అత్యాచారాలు జరుగుతాయా? అని అంటున్నదో సంస్థ. దుస్తుల విషయంలో అవగాహన పెంచుతూ ప్రజల్లో మార్పు తీసుకురావడానికి ఓ ఎగ్జిబిషన్‌ని ఏర్పాటు చేసింది.



మహిళల వస్త్రధారణే అఘాయిత్యాలకు కారణం అని నిందించే వారున్నారు. మరి నిండుగా చీర కట్టినా, పద్ధతిగా పంజాబీ డ్రెస్ వేసినా ఈ అఘాయిత్యాలు మాత్రం ఆగడం లేదు. ఇది అందరికీ ఎలా అర్థం చేయాలి. ఆడవాళ్ల తప్పు లేకున్నా నిందలు మాత్రం వారికే పడుతున్నప్పుడు ఈ మాటలకు అడ్డుకట్ట పడాలనుకున్నది ఒక సంస్థ. 'వాట్ వాజ్ షి వేరింగ్' అనే ఎగ్జిబిషన్ ద్వారా ఈ విషయాన్ని తెలియచేయాలనుకున్నది. ఈ ఎగ్జిబిషన్ 2018 జనవరిలో జరిగింది. ఈ సంవత్సరం కూడా ఈ ఎగ్జిబిషన్‌ని పెట్టారు. జనవరి రెండోవారంలో మొదలై 20 వరకు కొనసాగింది. బెల్జియంలోని మోలెన్బెక్ మారిటైమ్ కమ్యూనిటీ సెంటర్ దీనికి వేదికైంది. కేవలం పొట్టి దుస్తులే కాదు.. చిన్న పిల్లల ఫ్రాక్స్, టీ షర్ట్‌లు కూడా చూడొచ్చు. ఆ పసిపిల్లలు ఎలాంటి దుస్తులు ధరించారని ఈ అత్యాచారం జరిగిందనే ప్రశ్న అందరికీ కలిగించకమానదు. ఈ ఎగ్జిబిషన్‌ని చూడడానికి ఎంతో మంది ఈ సంవత్సరం కూడా హాజరయ్యారు. వచ్చిన ప్రతి ఒక్కరూ వారి అనుభవాలను పంచుకొని ఎంతో బాధపడ్డారు. అత్యాచారాలు ఎక్కడైనా ఎప్పుడైనా జరగొచ్చు. ముందు ప్రజల ఆలోచనలో మార్పురావాలి. అప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని సంస్థ సందేశాన్ని ఇచ్చింది.



ఆహా.. ఆకుకూరలు!

చుక్కకూర.. తోటకూర.. మెంతికూర.. కొత్తిమీర.. ఆకులు ఏవైనా ఆరోగ్యానికి మంచివే! ప్రకృతి మనకు ఇచ్చిన అద్భుతమైన వరాలు.. ఆకుకూరలు.. అతి చౌకగా దొరికే వీటిలో పోషకాలు కూడా మెండు! కానీ మామూలుగా వాటిని వండి వడ్డిస్తే తినే వాళ్లు తక్కువ.. అందుకే మరికొన్ని కూరల్లో వాటిని మిక్స్ చేస్తే.. ఆహా ఏమి రుచి అంటూ లొట్టలేస్తారు..

చుక్కకూర కోడికూర



కావాల్సినవి :

చుక్కకూర : 100 గ్రా.
చికెన్ : 200 గ్రా.
ఉల్లిగడ్డ : 1
పచ్చిమిర్చి పేస్ట్ : అర టీస్పూన్
ధనియాల పొడి : ఒక టీస్పూన్
కొత్తిమీర : ఒక కట్ట
కరివేపాకు : ఒక రెమ్మ
అల్లం, వెల్లుల్లి పేస్ట్ : అర టీస్పూన్
పసుపు : పావు టీస్పూన్
తాలింపు గింజలు : 50 గ్రా.
నూనె : 2 టేబుల్‌స్పూన్
ఉప్పు : తగినంత

తయారీ :

కడాయిలో నూనె వేసి తాలింపు గింజలు వేసి పచ్చిమిర్చి పేస్ట్, ఉల్లిపాయ వేగిన తర్వాత అల్లం, వెల్లుల్లి పేస్ట్ వేసుకొని కలుపుకోవాలి. కాస్త వేగిన తర్వాత పసుపు, కరివేపాకు, చుక్కకూర వేసుకొని రెండు నిమిషాలు సన్నని మంట మీద ఉంచాలి. దీంట్లో చికెన్, ఉప్పు వేసి పదినిమిషాలు సన్నని మంట మీద అలాగే ఉడికించాలి. చికెన్ కాస్త ఉడికిన తర్వాత ధనియాల పొడి వేసి మరికాసేపు ఉంచాలి. చివరగా కొత్తిమీర వేసి దించేయాలి. దీన్ని చపాతీ లేదా అన్నంతో కలిపి తింటే చాలా టేస్టీగా ఉంటుంది.

తోటకూర పన్నీరు వేపుడు




కావాల్సినవి :

తోటకూర : 200 గ్రా.
పన్నీర్ : 200 గ్రా.
కొత్తిమీర : ఒక కట్ట
పచ్చిమిర్చి పేస్ట్ : ఒక టీస్పూన్
ధనియాల పొడి : ఒక టీస్పూన్
గరం మసాలా : పావు టీస్పూన్
ఉల్లిగడ్డ : 1
అల్లం, వెల్లుల్లి పేస్ట్ : అర టీస్పూన్
కరివేపాకు : ఒక రెమ్మ
తాలింపు గింజలు : 50 గ్రా.
నూనె : ఒక టేబుల్‌స్పూన్
ఉప్పు : తగినంత

తయారీ :

కడాయిలో నూనె వేసి తాలింపు గింజలు వేసి వేయించాలి. అవి వేగిన తర్వాత పచ్చిమిర్చి పేస్ట్, ఉల్లిపాయ ముక్కలు వేసి వేగనివ్వాలి. ఉల్లిపాయలు రంగు మారాక.. అల్లం, వెల్లుల్లి పేస్ట్ వేసి ఒక నిమిషం పాటు కలుపాలి. దీంట్లో కరివేపాకు, తోటకూర వేసి మూత పెట్టేయాలి. బాగా ఉడికిన తర్వాత పన్నీర్ వేసి సన్నని మంట మీద రెండు నిమిషాల పాటు కలుపాలి. ఆ తర్వాత ఉప్పు, ధనియాల పొడి, కొద్దిగా గరం మసాలా వేసి ఒక నిమిషం తర్వాత కొత్తిమీర వేసి దించేయాలి. టేస్టీ కూర మీ ముందుంటుంది.



జి.యాదగిరి
కార్పొరేట్ చెఫ్
వివాహభోజనంబు రెస్టారెంట్
జూబ్లీహిల్స్, హైదరాబాద్
పార్క్‌లైన్, సికింద్రాబాద్

మెంతికూర పుట్టగొడుగుల వేపుడు



కావాల్సినవి :

మెంతికూర : 100 గ్రా.
పుట్టగొడుగులు : 200 గ్రా.
పచ్చిమిర్చి పేస్ట్ : అర టీస్పూన్
ధనియాల పొడి: ఒక టీస్పూన్
అల్లం, వెల్లుల్లి పేస్ట్ : అర టీస్పూన్
ఉల్లిగడ్డలు : 2, **కొత్తిమీర** : ఒక కట్ట
కరివేపాకు : ఒక రెమ్మ
నూనె : 2 టేబుల్‌స్పూన్స్
జీలకర్ర : పావు టీస్పూన్
వెల్లుల్లి : నాలుగు రెబ్బలు
ఎండుమిర్చి : 2, **ఉప్పు** : తగినంత

తయారీ : ముందుగా కడాయిలో నూనె వేసి అందులో జీలకర్ర, వెల్లుల్లి, ఎండుమిర్చి, కరివేపాకు వేసి వేయించాలి. ఇవి వేగాక.. పచ్చిమిర్చి పేస్ట్, ఉల్లిపాయ ముక్కలు వేసి గోల్డెన్ కలర్ వచ్చేవరకు వేయించాలి. దీంట్లో అల్లం, వెల్లుల్లి పేస్ట్ వేసి పచ్చివాసన పోయేవరకు కలుపుతుండాలి. ఇందులో మెంతికూర వేసి సన్నని మంట మీద ఉడికించాలి. కాస్త కూర దగ్గరకు అవుతున్న సమయంలో.. మష్రూమ్స్‌ని వేసి కలుపాలి. రెండు నిమిషాలు సన్నని మంట మీద ఉంచి ఉప్పు, ధనియాల పొడి వేసి డీప్ ఫ్రై అయ్యేలా చూడాలి. ఇందులో కొత్తిమీరతో గార్నిష్ చేసి వేడిగా లాగించేయాలి.

ఆకుకూరల చేపల పులుసు

కావాల్సినవి : **చేపలు** : 200 గ్రా., **చుక్కకూర** : 50 గ్రా., **తోటకూర** : 50 గ్రా., **పొనగంటి కూర** : 50 గ్రా., **గంగావాయిలి కూర** : 50 గ్రా., **మెంతికూర** : 50 గ్రా., **పచ్చిమిర్చి పేస్ట్** : 10 గ్రా., **ధనియాల పొడి** : ఒక టీస్పూన్, **జీలకర్ర పొడి** : ఒక టీస్పూన్, **చింతపండు** : 100 గ్రా., **ఉల్లిగడ్డలు** : 2, **ఆవాలు** : 20 గ్రా., **మెంతులు** : 20 గ్రా., **ఎండుమిర్చి** : 4, **నూనె** : 2 టేబుల్‌స్పూన్స్, **అల్లం, వెల్లుల్లి పేస్ట్** : ఒక టీస్పూన్ , **పసుపు** : చిటికెడు, **నూనె** : 2 టేబుల్ స్పూన్స్, **ఉప్పు** : తగినంత



తయారీ : కడాయిలో నూనె వేసి అందులో ఆవాలు, మెంతులు, ఎండుమిర్చి వేసి వేయించాలి. ఇందులో ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, పసుపు, అల్లం, వెల్లుల్లి పేస్ట్ వేసి ఒక నిమిషం పాటు కలుపాలి. దీంట్లో చుక్కకూర, పొనగంటి కూర, గంగవాయిలి కూర, తోట కూర, మెంతికూరలను కడిగి వేసి బాగా కలుపాలి. మూత పెట్టి ఒక ఐదు నిమిషాల పాటు సన్నని మంట మీద ఉడికించాలి. ఇవి ఉడికాక.. చేప ముక్కలను వేసి రెండు నిమిషాల తర్వాత చింతపండు రసం, నీళ్లు పోసి మరుగనివ్వాలి. సరిపడా ఉప్పు, ధనియాల పొడి, జీలకర్ర పొడి వేసి కాసేపు ఉంచి దించేయాలి. వేడి వేడి అన్నంలో.. ఈ పులుసు పోసుకుని తింటే ఆహా ఏమి రుచి అనకమానరు.

ఇస్త్రీ చేసే ముందు...



కాటన్ దుస్తులు ఉతకడం చాలా సులువుగా ఉంటుంది. ఉతికిన తర్వాత బట్టలపై పడిన ముడుతలు పోగొట్టడం మాత్రం కష్టమే. కొన్ని టెక్నిక్స్ ఆచరిస్తే ముడతలను తేలికగా తీయవచ్చు.


- ఐరన్ చేసేముందు కాటన్ దుస్తులపై ఉన్న లేబుల్‌ని ఒక సారి పరిశీలించాలి. సాధారణంగా కాటన్ బట్టలను ఐరన్ చేయడం కష్టమైన పనే.
- బట్టలను తిరగేసి లోపల వైపు ఐరన్ చేయడం మంచిది. ఇలా చేయడం వల్ల వేడికి పాడవ్వకుండా ఉంటుంది. కావలసిన రీతిలో బట్ట ముడుతలు తొలిగి బాగా అణుగుతుంది.
- బట్టపై కొన్ని నీళ్ళు చల్లాలి. తరువాత ఐరన్ చేస్తే ముడుతలు లేకండా ఐరన్ చేయవచ్చు.
- బట్టపై నీరు చల్లేటప్పుడు కొంచెం నీటిని ఐరన్ బాక్స్ మీద కూడా చల్లాలి.
- స్టీమ్ ఐరన్ గనుక ఉపయోగిస్తున్నట్లయితే బట్ట ఆటోమేటిక్‌గా తేమను పీల్చుకుంటుంది. వేరుగా నీరు అందించనవసరం లేదు.
- కాటన్ బట్టలను చల్లని నీటిలో ఉతికినట్లయితే వాటిని పిండకుండా ఆరేయండి. అలా చేస్తే బట్టలు కుంగకుండా ఉంటాయి.
- కాటన్ బట్టలను ఉతికిన తర్వాత డ్రైయర్‌లో వేసి పొడి చేసి కొద్దిపాటి తడి ఉండగానే ఐరన్ చేయండి. ముడుతలుపోయి ఐరన్ చేయడం తేలిక అవుతుంది.
- కాటన్ బట్టలకు గంజి పెట్టడం వల్ల దళసరిగా ఉంటాయి. ఉతికిన తర్వాత, ఐరన్ చేసేముందు గంజి పెడితే సరిపోతుంది.

ఆకట్టుకుంటున్న ఎక్కడికి ఈ పరుగు



సినిమా హీరోగా తెరపై కనిపించిన చాలాకాలం తర్వాత మళ్లీ వెబ్ సిరీస్‌తో మన ముందుకొచ్చాడు ఆర్యన్ రాజేష్. జీ5 యూట్యూబ్ చానల్‌లో టెలికాస్ట్ అవుతున్న ఎక్కడికి ఈ పరుగు వెబ్ సిరీస్‌లో తనదైన శైలిలో నటిస్తూ ఆకట్టుకుంటున్నాడు. నెటిజనుల మన్ననలు పొందుతున్న 'ఎక్కడికి ఈ పరుగు' వెబ్ సిరీస్ విశేషాలివి..

ఆర్యన్ రాజేష్, శశాంక్ ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ ఎక్కడికి ఈ పరుగు నెటిజనులను ఆకట్టుకుంటున్నది. అభయ్, అభిలాష్, నరేష్, అశ్వత్, అనిల్, రాగ్ ఈ వెబ్ సిరీస్‌ను తెరకెక్కించారు. మిగతా వారి కంటే భిన్నంగా, వినూత్నంగా హీరో నానీ ట్విట్టర్ అకౌంట్ మీద అక్కినేని నాగార్జునతో దీని ట్రైలర్ విడుదల చేశారు. అనంత విశ్వం రాక్షస వంశం. జగమెరుగని నిజం.. మనిషే ఒక మృగం.. తోడైన నీ స్నేహం.. చూపించేనా నరకం.. ఎక్కడికి ఈ పరుగు' అంటూ మొదలైన ట్రైలర్ వెబ్ సిరీస్ మీద అంచనాలు పెంచింది. చాలాకాలం తర్వాత మళ్లీ కెమెరా ముందుకొచ్చిన ఆర్యన్ రాజేష్ ఈ వెబ్‌సిరీస్‌లో పోలీస్ అధికారి పాత్రను రక్తి కట్టించాడు. జనవరి 8న విడుదలైన ఈ వెబ్ సిరీస్ వెబ్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నది. లక్షల సంఖ్యలో ఈ వెబ్ సిరీస్‌ను ప్రేక్షకులు ఫాలో అవుతున్నారు. ఎఫ్ టీవీ, జీ5 చానళ్లలో ప్రసారమవుతున్న ఈ వెబ్ సిరీస్‌కి మంచి స్పందన వస్తున్నది. జీ5 ఇండియాలో ఉదయం 8 గంటలకు, ఎఫ్ టీవీలో రాత్రి 8 గంటలకు ఈ వెబ్ సిరీస్ టెలికాస్ట్ అవుతున్నది. మైండ్ గేమ్‌ను తలపించే సినిమా రేంజ్‌లో ఈ వెబ్ సిరీను తెరకెక్కించారు. నటీనటు నటన అద్భుతంగా ఉంది.



అంతకు ముందే శశాంక్‌తో కలిసి యదార్థం అనే షార్ట్‌ఫిలిం తీసిన డైరెక్టర్ ఎక్కడికి ఈ పరుగు వెబ్ సిరీస్‌లో చేయమని ఆర్యన్ రాజేష్‌ని కలిశాడు. వెబ్ సిరీస్ అంటే చిన్న చిన్న వాళ్లు కూడా చేస్తారు. కానీ.. ఇప్పటికే పెద్ద సినిమాల్లో నటించి, హీరోగా మంచి పేరు తెచ్చుకున్న రాజేష్ ముందుగా సంకోచించాడు. ఆ తర్వాత కథ విన్నాడు. అంతే.. మరో ఆలోచనే లేకుండా ఒప్పుకున్నాడు. పేరుకు వెబ్ సిరీస్ అయినప్పటికీ ఎక్కడా తగ్గకుండా సినిమా రేంజ్‌లో తీశారు. ఒక్కో ఎపిసోడ్ చూస్తుంటే రోమాలు నిక్క పొడుచుకునేలా ఉందీ సిరీస్. ఒక్కో ఎపిసోడ్ ఇరవై నుంచి ముప్పై నిమిషాల మధ్య తీశారు. డ్రామా, మిస్టరీ, థ్రిల్లర్‌లు మేళవించి తీసిన ఈ వెబ్ సిరీస్ కు లక్షల సంఖ్యలో వ్యూస్ వస్తున్నాయి. ఇప్పటి వరకు తొలి సీజన్‌లో భాగంగా ఆరు ఎపిసోడ్‌లు విడుదలయ్యాయి. రెండో సీజన్‌లో మరిన్ని ఎపిసోడ్‌లు ఈ వెబ్ సిరీస్‌లో విడుదల చేస్తారు. ఒక్క ఎపిసోడ్ చూస్తే మిగతా ఎపిసోడ్‌లు కూడా చూడాలనిపించేలా ఈ వెబ్ సిరీస్ రూపొందించారు.

మచ్చలు మాయమిలా..!



- చెరుకు రసాన్ని ముఖానికి రాసుకొని 10 నిమిషాల తర్వాత కడిగేస్తే ముఖం కాంతివంతంగా తయారవడంతో పాటు మచ్చలు, మొటిమలు తగ్గుముఖం పడుతాయి.
- వేపాకులను నీటిలో మరిగించి ఆ నీటిలో కొద్దిగా పసుపు, పెరుగు కలిపి ముఖానికి అప్లై చేసి 40 నిమిషాల తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే మొటిమల సమస్య పోవడమే కాదు, జిడ్డుగా మారిన ముఖం కాంతివంతంగా మారుతుంది.
- పావుకప్పు పెరుగులో కొద్దిగా వంటసోడా కలిపి మొటిమలు ఉన్న ప్రదేశంలో మర్దన చేయాలి. అరగంట ఆరనిచ్చి గోరువెచ్చని నీటితో కడుక్కోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే మొటిమలు పూర్తిగా తగ్గిపోతాయి.
- కస్తూరి పసుపులో కొద్దిగా నిమ్మరసం కలిపిన పేస్ట్‌ను ముఖానికి, మెడకు రాసుకొని 20 నిమిషాల తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి. వారానికి ఒకసారి ఇలా చేయడంతో క్రమంగా మొటిమలు తగ్గడంతో పాటు ముఖంపై ఉన్న మృతకణాలు తగ్గుతాయి.

ఈ లవంగం చెట్టు వయసు.. 400 సంవత్సరాలు

ఆశ్చర్యంగా ఉందా? అవును. నిజమే. ప్రపంచంలో అత్యంత పురాతనమైనవి చాలానే ఉన్నాయి. వాటిలో ఇప్పటి వరకూ చరిత్రకు ఎక్కినవి కొన్ని అయితే.. మరికొన్ని చరిత్ర పుటల్లోకి చేరలేదు. ఇక్కడ చెప్పుకోబోయే లవంగం చెట్టు సరిగ్గా ఆ కోవకు చెందిందే!



ఇండోనేషియాలోని 'సుగంధద్రవ్యాలు పండే దీవుల' ప్రాంతంలో అత్యంత పురాతనమైన వృక్షాలు కనిపిస్తుంటాయి. ఇండోనేషియాలోనే టెర్నాటో అనే ప్రదేశం సుగంధ ద్రవ్యాలు పండే ప్రాంతంగా ప్రసిద్ధికెక్కింది. ఇక్కడ అతి పురాతనమైన లవంగం చెట్టు ఇప్పటికీ ఉన్నది. ఈ వృక్షం టెర్నాటో ప్రదేశానికి చారిత్రాత్మక గుర్తింపు కూడా వచ్చింది. ఇంతకీ ఆ లవంగం చెట్టు కాదు కాదు మహా వృక్షానికి ఎన్ని ఏండ్లో తెలుసా? అక్షరాలా నాలుగు వందల ఏండ్లు. ఏంటీ లవంగం చెట్టుకు 400సంవత్సరాలా? అని నోరు వెళ్ల బెట్టకండి. ఈ మహా వృక్షానికి ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు లభించింది. ఇండోనేషియాకు వెళ్లే పర్యాటకులు తప్పనిసరిగా చూడాల్సిన జాబితాలో ఇదే ముందు వరుసలో ఉంటుంది. ఈ ద్వీపం సముద్ర మట్టానికి 6వేల అడుగుల ఎత్తులో ఉంటుంది. ఆసియా దేశాలకు ఈ ప్రాంతం నుంచే ఎక్కువ మొత్తంలో సుగంధ ద్రవ్యాలు సరఫరా అవుతాయట. అబ్బురపరిచే ప్రపంచ పర్యాటక ప్రాంతాల్లో ఇండోనేషియాలోని టెర్నాటో ఒకటి. ఆకుపచ్చని చెట్లతోపాటు, సుగంధ ద్రవ్యాల సువాసనలతో దీవులు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటాయి.

గడియారాల ప్రదర్శన!

ఇప్పటి వరకు ప్రపంచంలో ఎన్నో ఎగ్జిబిషన్లు జరిగి ఉంటాయి. అక్కడ జరిగిన గడియారాల ప్రదర్శన అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. కొన్ని వేల రకాల అరుదైన గడియారాలు ఒకేచోట ప్రదర్శనగా ఏర్పాటుచేసి అబ్బురపరిచారు. బ్రిటిష్ క్లాక్ మేకర్‌కు ఘన నివాళి అందించేందుకు ఈ పని చేశామంటున్నారు ఆయన అభిమానులు. ఇంతకీ ఎక్కడ? ఏమిటా కథా?



ఇంగ్లాండ్‌కు చెందిన ఉత్తర లింకన్షైర్‌లో అరుదైన గడియారాలతో ప్రత్యేకంగా ఎగ్జిబిషన్‌ను ఏర్పాటుచేశారు. ఈ ప్రదర్శనలో వంద, రెండు వందల రకాల క్లాక్‌లు కాదు దాదాపు 3వేల రకాలు అక్కడ కొలువుదీరాయి. ఇంత పెద్ద గడియారాల ప్రదర్శనను ఏర్పాటు చేయడానికి ప్రత్యేక కారణం ఉంది. అదేమిటంటే గడియారాన్ని తొలిసారిగా రూపొందించిన జాన్ హ్యారిసన్ విగ్రహాన్ని ఏర్పాటుచేసి ఆయనకు ఘనంగా నివాళులందించాలనే ఉద్దేశంతో పెద్దఎత్తున ఉత్తర లింకన్షైర్‌లో క్లాక్స్ ఎగ్జిబిషన్‌ను పెట్టారు. జాన్ హ్యారిసన్ గడియారాన్ని కనుగొనడం వల్లనే నేడు అందరం క్లాక్‌ను వినియోగించగలుగుతున్నామని భావించిన కొందరు అభిమానులు కలిసి ఆయన స్మృత్యర్థం విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అందుకోసం అరుదైన గడియారాలతో కూడిన ప్రదర్శన ప్రారంభించారు. ఇందులో 3వేల క్లాక్స్‌ను ప్రదర్శన చివరి రోజున వేలం వేసి వచ్చిన మొత్తంతో జాన్ హ్యారిసన్ విగ్రహాన్ని రూపొందించేందుకు అవసరమైన నిధులు సమకూర్చారు.





ప్రపంచంలో అతిపెద్ద వాకీకార్ల మ్యూజియం

కార్లు ఎన్ని రకాలు? ఆడి.. మారుతి.. బ్రెజ్జా.. బీఎండబ్ల్యూ అని మాత్రం చెప్పకండీ. అవి అందరికీ తెలిసినవే. చాలామందికి తెలియని కార్లు కూడా కొన్ని ఉన్నాయి. వాటిలో వింతైనవి.. విశేషమైనవీ ఉన్నాయి. సిగరెట్ కారు.. టమాటా కారు.. బూటు కారు.. బ్యాగు కారు.. కంప్యూటర్ కార్లు కూడా ఉంటాయి. మీరు ఎన్ని చూశారు? ఒకవేళ చూడకపోతే ఇప్పుడు చూడాలనుకుంటున్నారా? అయితే ఓసారి ఇటు లుక్కేయండీ!



కారు ప్రియులను కట్టిపడేసి.. సిటీ రోడ్ల వెంట చిత్ర విచిత్రాలు చేయించే ఆ గమ్మత్తయిన కార్లకు అడ్డా హైదరాబాద్. అబ్బా ఎక్కితే ఇలాంటి కారే ఎక్కాలి అనేంత ఉత్సాహాన్ని.. ఏం మజా ఉంది అనే ఉల్లాసాన్ని ఇచ్చి యువతను ఉరకలు పెట్టించే ఆ కార్లే వాకీ కార్లు. ఒక రకంగా వాకీ కార్లకు కేరాఫ్ హైదరాబాద్. అలాంటి వాకీ కార్లలో.. పేరెన్నిక కన్నది.. ప్రపంచంలోనే అతి పెద్దది సుధా'కార్ల' మ్యూజియం.

కారు కారుకో అద్భుతం

ఎంతో అరుదైన వాహనాలే ఇక్కడ కనిపిస్తుంటాయి. భారతదేశంలోని అతి చిన్న సైకిల్ కూడా ఇక్కడే ఉన్నది. దీని ఎత్తు ఆరు అంగుళాలు. ఒక్క సైకిళ్ల విభాగంలోనే 50రకాల వెరైటీలున్నాయి. సింగిల్ సీటు దగ్గర నుంచి మల్టీ సీటు వరకు వాటిలో పెన్నీ ఫర్తింగ్ సైకిళ్లు, టాండెమ్ సైకిళ్లు, రికంబెంట్ బైస్కిల్స్ సుధాకార్ మ్యూజియంలో దర్శనమిస్తాయి. మోటారు సైకిల్ విభాగంలో 12రకాల డిజైన్లు కనువిందు చేస్తాయి. వీటిలో చెప్పుకోదగింది 13అంగుళాల ఎత్తు కలిగిన మోటార్ సైకిల్. ఇది గంటకు 30 కిలో మీటర్ల వేగంతో దూసుకెళుతుంది. ప్రపంచంలోనే అతి పెద్ద మూడు చక్రాల సైకిల్ అయితే ఏకంగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్ బుక్‌లోనే స్థానం సంపాదించింది. దీని ఎత్తు 41అడుగుల 7అంగుళాలు కాగా, బరువు మూడు టన్నుల వరకూ ఉంటుంది. 1930 నాటి వెలో కార్లు, రెండో ప్రపంచ యుద్ధంలో వాడిన కార్లు, జీపులు సైతం ఈ వాకీ కార్ల మ్యూజియంలో కొలువుదీరినాయి. వరల్డ్ క్రికెట్ కప్ సమయంలో క్రికెట్ బ్యాట్, క్రికెట్ బాల్, ఫుట్ బాల్ ఆకృతుల్లోను, పెన్సిల్, చాక్ మర్, ఎరేజర్ వంటి వస్తువుల రూపంలో తయారు చేసిన కార్లు చిన్నారులను ఎంతగానో అలరిస్తుంటాయి. అతిచిన్న డబుల్ డెక్కర్ బస్సు కూడా ఇక్కడే ఉన్నది.

ప్రపంచంలోని వింత ఆకృతులు

కొత్తగా ఉంటే చాలు అది ఏ రంగానికి చెందినదైనా సరే ఎప్పటికీ ఆదరణ ఉంటుంది. భిన్నంగా ఉండే వ్యక్తులు, వస్తువులకు ఆధునిక యుగమైనా ఆదరణ మాత్రం తగ్గదు. అందుకే మామూలు కార్లను తయారుచేస్తే కొత్తదనం ఏముంటుంది? ఏదైనా ఓ ప్రత్యేకత ఉండాలి అనుకున్నాడు హైదరాబాద్‌కు చెందిన సుధాకర్. అందుకోసం పట్టుదలతో సాధన చేశాడు. ప్రపంచ స్థాయిలోనే అత్యంత అరుదైన వింత ఆకృతుల్లో కార్లను తయారు చేసి తన సత్తా చాటాడు. ఆటోమొబైల్ రంగంలోనే తన వినూత్న ప్రయోగాలతో దేశ, విదేశాల్లో ప్రశంసలు అందుకుంటున్నాడు.

ఈ కార్లు అవగాహన కల్గిస్తాయి

హైదరాబాద్ నగరంలో ఏ అవగాహనా కార్యక్రమం జరిగినా సుధాకర్ కార్లే కనిపిస్తూ ఒడేవి. సామాజిక చైతన్యం కల్పించేందుకు సందర్భాన్ని బట్టి ఒక్కో రూపంలో కార్లను తయారు చేసేవాడు. ధూమపాన నిషేధం కోసం ప్రత్యేకంగా సిగరెట్ ఆకారంలో కారును తయారు చేసి ధూమపానం వల్ల కలిగే అనర్థాలను గురించి ప్రజలకు తెలియజేశాడు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'లేడీస్ హ్యాండ్ బ్యాగ్', 'లిప్‌స్టిక్', 'లేడీస్ షూ' వంటి ఆకృతుల్లో రూపొందించిన వాకీ కార్లు అప్పట్లో ఎంతగానో ఆకట్టుకున్నాయి. అంతేకాదు ఎయిడ్స్ డే రోజున పెద్ద ఎత్తున చేపట్టిన కార్యక్రమాల్లో 'కండోమ్' రూపంలో కారును తయారుచేసి ఎయిడ్స్‌పై సమర శంఖాన్ని పూరించాడు సుధాకర్. రోడ్డు భద్రతపై అందరినీ చైతన్య పరిచేందుకు సుధాకర్ ప్రత్యేకంగా రూపొందించిన 'హెల్మెట్' ఆకారంలో ఉండే వాకీ కార్ నగరంలోని రోడ్లపై చక్కర్లు కొట్టింది.


ముంబై.. గోవాల్లో కూడా..

పలు రకాల ఆకృతుల్లో రైళ్లు, బైక్‌లు, సైకిల్ వంటి వాహనాలను మలిచి ఎంతో మందితో శభాష్ అనిపించుకున్నాడు సుధాకర్. హైదరాబాద్‌లోనే కాకుండా, దేశంలో మరో రెండు మూడు చోట్ల వాకీ కార్ల మ్యూజియంలను ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నాడు. సుధా'కార్ల'కు భారతదేశంలోనే కాదు ఇతర దేశాల్లో సైతం ఆదరణ ఉంది. చెస్ బోర్డు షేప్‌లో ఉండే కారు, ఆర్నమెంట్ థీమ్‌తో ఆరు జ్యూవెలరీ కార్లు, రెండు బ్రైడల్ డ్రెస్ షేప్ కార్‌లు, షటిల్ కాక్ కార్‌లను తయారు చేసే పనిలో ఉన్నాడు. ముంబైలోని లోనవల ప్రాంతంలో మరో వాకీ కార్ల మ్యూజిమ్‌ను ఏర్పాటు చేసి మరికొన్ని రికార్డులను తిరగరాసేపనిలో ఉన్నాడు సుధాకర్. గోవాలో కూడా ఇదే తరహా ప్రదర్శన శాలను ప్రారంభించనున్నాడు.

... పసుపులేటి వెంకటేశ్వరరావు

500లకు పైగా డిజైన్లు: సుధాకర్

ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రాజెక్ట్ వర్క్ కోసం నా దగ్గరకు వస్తుంటారు. వారికి నేను అతి తక్కువ బడ్జెట్‌లో వినూత్నంగా ఉండేలా కార్లను రూపొందించడానికి సాయం చేస్తుంటాను. గతంలో టూరిజం బస్సులు, అరకులో ఉండే బుల్లిరైలు, నాంపల్లి ఎగ్జిబిషన్‌లో ప్రతి ఏటా ఏర్పాటు చేసే నుమాయిష్‌లో చక్కర్లు కొట్టే చిన్న రైలు, కోటప్ప కొండలో ఉన్న రైలు నేను తయారుచేసినవే. ఇప్పటి వరకూ ఐదువందలకు పైగా డిజైన్లు చేశాను.



కాకులతో పర్యావరణ రక్షణ!

పర్యావరణాన్ని సంరక్షించేందుకు కాకులు మేము సైతం అంటున్నాయి. మనుషులతో పాటు కాకులు కూడా పర్యావరణ కాలుష్యాన్ని నిర్మూలించేందుకు తమవంతు పాత్రను పోషిస్తున్నాయి. కాకులు కాలుష్యాన్ని నివారిస్తున్నాయా? ఎక్కడ?

ఫ్రాన్స్‌లో ఫేమస్ అయిన పుయ్ డు ఫౌ థీమ్ పార్క్‌లో కాకులకు ఓ పని చెప్పారు. ఆ పని చేసేందుకు శిక్షణ కూడా ఇచ్చారు. ఇంతకీ ఆ పనేంటంటే పార్క్‌లోపలికి వచ్చిన సందర్శకులు సిగరెట్లు తాగి కాల్చిన పీకలను అక్కడే వేస్తున్నారు. ఇలా వేయడం వల్ల చెత్తా, చెదారం పేరుకుపోయి పర్యావరణానికి ముప్పు కలుగుతుంది. అక్కడ వేసిన సిగరెట్ ముక్కలను కాకులు నోటితో కరుచుకుని, ఆయా పరిసరాల్లో ఉన్న చెత్త కుండీల్లో వేసేలా వాటికి శిక్షణ ఇచ్చారు. అలా సిగరెట్ పీకలను అందులో వేయగానే కాకుల నోటికి బఠాణి గింజలు అందే విధంగా వారు ఏర్పాటు చేశారు. ఎప్పుడో మనం చిన్నతనంలో నీటి కోసం కాకి చేసిన ప్రయత్నాన్నే దృష్టిలో ఉంచుకుని సరిగ్గా అలాంటి సూత్రంతోనే పార్క్‌లో ఓ డబ్బాను ఏర్పాటు చేశారు. కొన్నాళ్ల వరకూ ఆ కాకులకు ఎలా చేయాలో కూడాదగ్గర ఉండి తర్ఫీదు ఇచ్చారు. అప్పటి నుంచి అక్కడ సిగరెట్ పీకలను తీసి వేయడంతో పాటు తమ పొట్ట కూడా నింపుకుంటూ, స్వామి కార్యం, స్వకార్యం రెండూ ఒకే సారి కానిచ్చేస్తున్నాయి కాకులు. పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచడం అందరి బాధ్యత అని, అందుకే ఈ విషయాన్ని చెప్పేందుకు కాకులకు శిక్షణ ఇచ్చామని పార్క్ అధికారి నికోలాస్ డేవిల్లీర్ తెలిపారు. జోష్ క్లైన్ అనే శాస్త్రవేత్త 2008లో 'క్రో వెండింగ్ మెషిన్'ను కనుగొన్నాడు. ఈ విధానంలో కాకి బాక్స్‌లో కాయిన్ వేయగానే బఠాణి గింజ వస్తుంది. అలాగే కాకులకు శిక్షణ ఇస్తే ఇటువంటి పనులకు సులువుగా ఉపయోగించుకోవచ్చని ఆయన సూచించారు.



ట్వీట్

నిధి అగర్వాల్
@AgerwalNidhhi





ఈ కుక్కపిల్ల ఎంతో ముద్దొస్తుంది కదా? నాకు.. అఖిల్‌కు బాగా నచ్చేసింది. మిస్టర్ మజ్ను షూటింగ్ సెట్‌లో జరిగిన సంఘటన ఇది.

నిధి అగర్వాల్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
65,370

కామన్‌మ్యాన్ వాయిస్

కొడుకు అనే మాయా పొర తొలగేదెన్నడో? ఆడపిల్లలు కూడా తమ సంతానమే అని ఎప్పుడు గుర్తిస్తారో ఈ తల్లిదండ్రులు?
– Nasreen Khan

ఈ ప్రపంచం.. ఖాళీగా ఉన్నోడిని ఇంకా ఖాళీగా, బిజీగా ఉన్నోడిని ఇంకా బిజీగా చెయ్యాలని చూస్తుంది!
– Suresh Jai

మౌనం.. నవ్వు రెండు శక్తివంతమైన ఆయుధాలు. నవ్వు.. ఎన్నో సమస్యలను పరిష్కరిస్తుంది. మౌనం.. సమస్యలను నిరోధిస్తుంది!
– Shivanya Sharma

వైరల్ వీడియో



తెలంగాణ అందర్నీ అక్కున చేర్చుకుంటుంది. ఆదరిస్తుంది. రాయలసీమలో పగలకన్నా ప్రేమలే ఎక్కువ అంటారు. ఈ ప్రేమల మధ్య అక్కడ గడిచే జీవితాలు ఎలా ఉంటాయో తెలుసా? ఈ వీడియో చూడండి తెలుస్తుంది.

Rayalaseema | Chai Bisket Regionals
Total views : 316,218+
Premiered Jan 22, 2019

సుడోకు

డైలీ సుడోకు 45 సమాధానం

4	5	8	3	6	9	2	7	1
9	1	3	4	7	2	5	6	8
6	7	2	5	8	1	4	9	3
1	9	5	6	4	3	7	8	2
7	3	4	2	9	8	6	1	5
8	2	6	7	1	5	9	3	4
5	4	9	8	3	7	1	2	6
2	8	7	1	5	6	3	4	9
3	6	1	9	2	4	8	5	7

1. నిలువుగా, అడ్డంగా ప్రతి వరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -46

		2						
		5	8		2	9		
	8		4	6			3	
9				7		2		6
			9		1			
	6		1					
1	7			5			4	8
2			3	4	6			

నిపుణ — విద్య, ఉద్యోగ సమాచారం —

ఎన్‌టీపీసీలో ఎగ్జిక్యూటివ్ ట్రెయినీలు

న్యూఢిల్లీలోని నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌టీపీసీ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఇంజినీరింగ్ ఎగ్జిక్యూటివ్ ట్రెయినీల భర్తీకి (గేట్ 2019 స్కోర్ ద్వారా) అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



- **పోస్టు పేరు:** ఇంజినీరింగ్ ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ
- **మొత్తం ఖాళీలు:** 207

విభాగాలవారీగా..
- **ఎలక్ట్రికల్-47 పోస్టులు** (జనరల్-29, ఓబీసీ-10, ఎస్సీ-6, ఎస్టీ-2)
- **అర్హత:** ఎలక్ట్రికల్, ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్ & కంట్రోల్, పవర్ సిస్టమ్ & హై వోల్టేజ్, పవర్ ఎలక్ట్రానిక్స్, పవర్ ఇంజినీరింగ్‌లో 65 శాతం మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
- **మెకానికల్-95 పోస్టులు** (జనరల్-50, ఓబీసీ-25, ఎస్సీ-14, ఎస్టీ-6)
- **అర్హత:** మెకానికల్, ప్రొడక్షన్, ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్, ప్రొడక్షన్ & ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్, థర్మల్, మెకానికల్ & ఆటోమేషన్, పవర్ ఇంజినీరింగ్‌లో 65 శాతం మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
- **మైనింగ్-15 పోస్టులు** (జనరల్-9, ఓబీసీ-4, ఎస్సీ-1, ఎస్టీ-1)
- **అర్హత:** మైనింగ్ ఇంజినీరింగ్‌లో 65 శాతం మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
- **ఎలక్ట్రానిక్స్ & ఇన్‌స్ట్రుమెంటేషన్-50 పోస్టులు** (జనరల్-24, ఓబీసీ-16, ఎస్సీ-6, ఎస్టీ-4)
- **అర్హత:** ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ & టెలీ కమ్యూనికేషన్, పవర్, పవర్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ & ఇన్‌స్ట్రుమెంటేషన్, ఇన్‌స్ట్రుమెంటేషన్ & కంట్రోల్ ఇంజినీరింగ్‌లో 65 శాతం మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
- **పేస్కేల్:** రూ.60,000-1,80,000/-
- **వయస్సు:** 2019, జనవరి 31 నాటికి 27 ఏండ్లకు మించరాదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు, పీహెచ్‌సీలకు పదేండ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక:** గేట్-2019 స్కోర్, ఆన్‌లైన్ బిహేవియరల్/ఆప్టిట్యూడ్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్+ ఇంటర్వ్యూ
- గేట్ స్కోర్‌కు 85 శాతం, గ్రూప్ డిస్కషన్‌కు 5 శాతం, ఇంటర్వ్యూకు 10 శాతం వెయిటేజీ ఇచ్చి తుది ఫలితాలు ప్రకటిస్తారు.
- **ప్రొబేషనరీ పీరియడ్:** ఏడాది ట్రెయినింగ్ పీరియడ్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా దేశంలో ఎక్కడైనా పోస్టింగ్ ఇస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా. ఈ మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్‌తోపాటు గేట్-2019 రిజిస్ట్రేషన్ నంబర్ ఎంటర్ చేయాలి.
- **దరఖాస్తులకు చివరితేదీ:** జనవరి 31
- **వెబ్‌సైట్:** www.ntpccareers.net

ఎమ్మెస్సీ కోర్సులు

దెహ్రాడూన్‌లోని ఫారెస్ట్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఎమ్మెస్సీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ప్రకటన విడుదలైంది.




కోర్సులు- వివరాలు:
- ఎమ్మెస్సీ ఫారెస్ట్రీ
- **అర్హత:** బీఎస్సీ (అగ్రికల్చర్/ఫారెస్ట్రీ, బాటనీ, మ్యాథ్స్, కెమిస్ట్రీ, ఫిజిక్స్, జియాలజీ, జువాలజీ) ఉత్తీర్ణత.
- ఎమ్మెస్సీ ఉడ్ సైన్స్&టెక్నాలజీ
- **అర్హత:** బీఎస్సీ (ఎంపీసీ) లేదా బీఎస్సీ (ఫారెస్ట్రీ) ఉత్తీర్ణత.
- ఎమ్మెస్సీ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్
- **అర్హత:** బేసిక్ లేదా అప్లయిడ్ సైన్సెస్‌లో డిగ్రీ లేదా బీఎస్సీ ఫారెస్ట్రీ/అగ్రికల్చర్ లేదా బీఈ/బీటెక్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లో ఉత్తీర్ణత.
- ఎమ్మెస్సీ సెల్యులోజ్&పేపర్ టెక్నాలజీ
- **అర్హత:** బీఈ/బీటెక్ (కెమికల్/మెకానికల్) లేదా బీఎస్సీ (కెమిస్ట్రీ).
- **నోట్:** ఈ కోర్సు రెండో ఏడాది సీపీపీఆర్‌ఐ, సహరాన్‌పూర్‌లో నిర్వహిస్తారు.
- **ఎంపిక:** ప్రవేశపరీక్ష ద్వారా
- **దరఖాస్తు:** వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- **చివరితేదీ:** ఏప్రిల్ 8
- **ప్రవేశపరీక్ష తేదీ:** మే 19
- **వెబ్‌సైట్:** www.fridu.edu.in

నల్సార్‌లో ఎంబీఏ

హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లాకు చెందిన సెంటర్ ఫర్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఎంబీఏ ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- **కోర్సు పేరు:** ఎంబీఏ
- **కోర్సు పీరియడ్:** రెండేండ్లు
- **అర్హత:** 50 శాతం మార్కులతో ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత. ఫైనల్ ఇయర్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. క్యాట్, గ్జాట్, జీమ్యాట్, సీమ్యాట్, జీఆర్‌ఈ స్కోర్ ఉండాలి. ఈ స్కోర్ లేనివారు నల్సార్ మేనేజ్‌మెంట్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఎన్-మెట్)కు దరఖాస్తు చేయాలి.
- **ఎంపిక:** క్యాట్ స్కోర్/రాత పరీక్ష, జీడీ, ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** జనవరి 31
- **ఎన్ -మెట్ పరీక్ష:** ఫిబ్రవరి 17
- **వెబ్‌సైట్:** www.cms.nalsar.ac.in



నాటా-2019

న్యూఢిల్లీలోని కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ దేశవ్యాప్తంగా ఉన్న వివిధ ఆర్కిటెక్చర్ విద్యాసంస్థల్లో 2019-20కిగాను ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ బీఆర్క్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నాటా ప్రకటన విడుదల చేసింది.

- నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్ (నాటా)-2019
- ఈ ఏడాది నుంచి నాటాను జేఈఈ మెయిన్ తరహాలో ఈసారి నుంచి కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ప్రతి ఏటా రెండుసార్లు నిర్వహించనుంది.
- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి కెమిస్ట్రీ, ఫిజిక్స్, మ్యాథమెటిక్స్ సబ్జెక్టులతో 10+2 లేదా ఇంటర్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత.
- **పరీక్ష పేరు:** నాటా ఎంట్రెన్స్ టెస్ట్
- ఇది ఆన్‌లైన్ ఎంట్రెన్స్ టెస్ట్. ఈ పరీక్ష మొత్తం 200 మార్కులకు ఉంటుంది. పార్ట్-ఏలో ప్రతి ప్రశ్నకు రెండు మార్కుల చొప్పున మొత్తం 120 మార్కులకుగాను మ్యాథమెటిక్స్-20, జనరల్ ఆప్టిట్యూడ్-40 ప్రశ్నలను ఇస్తారు. 60 నిమిషాల్లో పూర్తిచేయాలి. పార్ట్-బీలో డ్రాయింగ్ టెస్ట్ ఉంటుంది. ప్రతి ప్రశ్నకు 40 మార్కుల చొప్పున మొత్తం 80 మార్కులకు పేపర్, పెన్సిల్ రూపంలో నిర్వహిస్తారు. 120 నిమిషాల్లో పూర్తిచేయాలి.



- **నోట్:** ఆబ్జెక్టివ్ పరీక్షలో 120కి 30, డ్రాయింగ్ పరీక్షలో 80కి 20 కనీస అర్హత మార్కులు సాధించాలి. నెగెటివ్ మార్కింగ్ విధానం లేదు.
- **అప్లికేషన్ ఫీజు:** మొదటి విడత లేదా రెండో విడత పరీక్షకు రూ.1800/-, (ఎస్సీ/ఎస్టీలకు రూ.1500/-)
- రెండు పరీక్షలు రాయడానికి రూ.3500/- (ఎస్సీ/ఎస్టీలకు రూ.2800/-)
- **పరీక్షకేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **మొదటి విడత పరీక్షతేదీ:** ఏప్రిల్ 14,
- **రెండో విడత పరీక్షతేదీ:** జూలై 7
- **చివరితేదీ:** మొదటి పరీక్షకు మార్చి 11, రెండో పరీక్షకు జూన్ 12
- **వెబ్‌సైట్:** www.nata.in

నమస్తే తెలంగాణ
రైతుబడి
[కరీంనగర్]
గురువారం 24 జనవరి 2019

raithubadi@ntnews.com

జింక్ లోప నివారణ

యాసంగిలో చాలామంది రైతులు వరి పంటను సాగు చేస్తున్నారు. వరిలో కనిపించే లోపాల్లో ప్రధానమైనది జింక్ లోపం. జింక్‌లోపం ఉంటే పైరు పెరుగుదల సరిగ్గా ఉండదు. దీంతో దిగుబడి చాలావరకు తగ్గుతుంది. కాబట్టి వరి సాగుచేసే రైతులు తప్పకుండా పంటలో జింక్‌లోపాన్ని నివారించాలి. జింక్‌లోప నివారణకు పలు సూచనలు త్రిపురారం వ్యవసాయ విస్తరణాధికారి స్వాతి సూచనలు చేశారు. ఆ వివరాలు..



మొక్కల పెరుగుదలకు అవసరమైన పోషకాల్లో నత్రజని, భాస్వరం, పొటాషియం ప్రధానమైనవి. వీటితో పాటు జింక్, కాల్షియం, మెగ్నీషియం, రాగి వంటి 16 రకాల సూక్ష్మపోషకాలు కూడా అవసరం. వీటిలో ప్రధానమైనది జింక్. ప్రధాన పోషకాలతో పోలిస్తే ఇది పంటకు చాలా తక్కువ పరిమాణంలోనే అవసరం. కాని ప్రాముఖ్యం విషయంలో ఇది ప్రధాన పోషకాలతో సమానంగా ఉంటుంది. పొలంలో జింక్ లోపం ఉంటే ఎన్ని ఎరువులు వేసినప్పటికీ వ్యర్థమే. జింక్ లోపం వల్ల మొక్కలు ఎరువులను సమర్థవంతంగా ఉపయోగించుకోలేవు. దీంతో పంటలో దిగుబడులు తగ్గుతాయి. పెరుగుదల ప్రక్రియలో జింక్ పాత్ర కీలకం. మొక్కల పెరుగుదల, పలు రసాయన ప్రక్రియల్లో అవసరమయ్యే ఎంజైముల్లోని చురుకుదనాన్ని పెంచడానికి, ఉత్తేజపరుచడానికి జింక్ ఉపయోగపడుతుంది. రసాయనిక క్రియల్లో అవసరమైన హార్మోన్ల ఉత్పత్తికి దోహదపడే రసాయనిక పదార్థాల తయారీకి కూడా జింక్ దోహదపడుతుంది.

లోపాన్ని గుర్తించాలి

వరిలో నారుమడి దశలోను, నాటిన తరువాత కూడా జింక్ లోపం కనిపిస్తుంది. సాధారణంగా నాట్లు వేశాక 2 నుంచి 4 వారాల మధ్య, 4 నుంచి 6 వ వారం వరకు జింక్ లోపం తాలూకు లక్షణాలు పంటలో కనిపిస్తాయి. జింక్‌లోపం ఉన్న పైరు ఏపుగా పెరుగదు. పిలకలు పెట్టదు. పొలంలో మొక్కలు గుంపులు గుంపులుగా చనిపోయి ఖాళీ కనిపిస్తుంది. పొలం అంతా పసుపు పచ్చగా కనిపిస్తుంది. దగ్గరగా చూస్తే మొక్కల్లో పై నుంచి



మూడు లేక నాలుగు ఆకుల మధ్య ఈనె మొదలు భాగం ఆకు పచ్చరంగు కోల్పోయి పసుపుతో కూడిన తెలుపురంగులోకి మారుతుంది. ఆకులోని మిగిలిన భాగం అంతా ఆకుపచ్చగానే ఉంటుంది. ముదురు ఆకుల్లో ఆకుల కొనల వద్ద మధ్య ఈనెకు ఇరువైపులా తుప్పు రంగు లేదా ఇటుక రంగు మచ్చలు కనిపిస్తాయి. ఆకులు చిన్నగా నూనె కండెలుగా మారి మొద్దుబారుతాయి. ఆకులు గట్టిగా మారి మధ్యకు తుంచితే శబ్దం చేస్తాయి.

నివారణ చర్యలు

వరిపైరులో ఎకరాకు 20 కిలోల జింక్‌సల్ఫేట్‌ను ఆఖరి దమ్ము అనంతరం వరి నాట్లు వేసే ముందు వేసుకోవాలి. ఏటా వరి వేసుకునే రైతులు యాసంగిలో తప్పనిసరిగా జింక్‌ను వేసుకోవాలి. సమస్యాత్మక నేలలు అంటే చవుడు, క్షార, సున్నపు నేలలైతే జింక్‌సల్ఫేట్‌ను ఎకరాకు 40 కిలోల చొప్పున వేసుకోవాలి.

– నగిరి హరీష్, త్రిపురారం



వెదురు బొంగులతో పాలీహౌజ్

రైతు వెంకటేశ్వర్‌రావు వినూత్న ప్రయోగం

తక్కువ ఖర్చు.. ఎక్కువ దిగుబడి వచ్చేలా రూపకల్పన

గ్రామీణ రైతులను దృష్టిలో ఉంచుకొని నిర్మాణం

పూర్తిగా వెదురు బొంగులు.. పైన ప్లాస్టిక్ షీట్లు.. 150 కిలోమీటర్ల వేగంతో వీచే గాలులతో పాటు భారీ వర్షాలను తట్టుకుంటూ 12 నుంచి 15 సంవత్సరాల పాటు మన్నేలా పరిమిత స్థలంలో వాతావరణ పరిస్థితులను అనుకూలంగా మార్చుకుంటూ తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందే పాలీహౌజ్‌లు వచ్చేశాయి! ఈ వినూత్న పాలీహౌజ్‌ను మొట్టమొదటగా తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలో ఒక రైతు నిర్మించాడు. అందులో వ్యవసాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.

ఆంధ్రా మూలాలున్న వెంకటేశ్వర్‌రావు పుట్టి పెరిగిందంతా తెలంగాణలోనే. డి.ఫార్మా పూర్తి చేసి ఓ వైపు ఫార్మాసిస్ట్‌గా పని చేస్తూనే మరోవైపు వ్యవసాయంపై మక్కువ పెంచుకున్నాడు. రూ.25,000 వేల జీతం వస్తున్నా 2001లో చేస్తున్న ఉద్యోగాన్ని వదిలేసి సొంతంగా ఫార్మా బిజినెస్ ప్రారంభించాడు. కిడ్నీ ప్లాంటేషన్‌కు సంబంధించిన మందులను సప్లై చేస్తూ ప్రస్తుతం సంవత్సరానికి రూ.5 కోట్ల వ్యాపారం చేస్తూనే సన్న,చిన్నకారు రైతులకు ఏదైనా చేయాలన్న తలంపుతో వ్యవసాయ రంగంలోకి దిగాడు. 2008లో యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలో ఆరు ఎకరాల వ్యవసాయ భూమి కొనుగోలు చేశారు. భిన్నమైన పద్ధతులతో సాగు చేపట్టారు. ముందుగా ఆరు ఎకరాల భూమిలో రెండున్నర ఎకరాల్లో జంబో కేసరి రకం మామిడి సాగు చేపట్టారు. పూర్తిగా సేంద్రియ పద్ధతులు అవలంబిస్తూ 5 టన్నుల దిగుబడి సాధించారు. కిలో రూ.150 చొప్పున విదేశాలకు ఎగుమతి చేశాడు.

వినూత్న సాగు పద్ధతులు..

తన వ్యవసాయ క్షేత్రంలో వినూత్న పద్ధతులతో సాగు చేపట్టాలన్న తలంపుతో ఉన్న వెంకటేశ్వర్‌రావు పాలీహౌజ్‌పై దృష్టి పెట్టారు. కానీ ప్రస్తుతం ఉన్న పాలీహౌజ్ విధానం భారీ ఖర్చుతో కూడుకున్నది కావడంతో ఆలోచనలో పడ్డాడు. స్థానిక వనరులను వినియోగించుకుంటూ తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనాలున్న పాలీహౌజ్ నిర్మాణానికి రూపకల్పనకు శ్రీకారం చుట్టాలని నిర్ణయించుకున్నాడు. వివిధ రాష్ట్రాల్లోని పాలీహౌజ్‌ల నిర్మాణాలను పరిశీలించారు. వెదురు బొంగులతో పాలీహౌజ్ నిర్మిస్తే ఖర్చుతో పాటు ఎక్కువ మన్నిక ఉంటుందని తెలుసుకొని కోల్‌కతా వెళ్లారు. అక్కడ రిటైర్డ్ ప్రొఫెసర్ అరూప్ రతన్ ఘోష్‌ను కలుసుకున్నారు. ఆయనతో చర్చలు జరిపి చివరికి ప్రధాన్ అగ్రిహార్ట్ ఎంటర్‌ప్రైజెస్‌ను ఏర్పాటు చేసి పాలీహౌజ్ నిర్మాణం చేపట్టారు.

రెండు రకాలుగా..

చంద్రశేఖర్ తన వ్యవసాయ క్షేత్రంలో చిన్న,సన్నకారు, పెద్ద రైతులను దృష్టిలోపెట్టుకొని తక్కువ స్థలంలో ఒకటి.. ఎక్కువ స్థలంలో మరొక పాలీహౌజ్ నిర్మించారు. 200 గజాల స్థలంలో నిర్మించిన పాలీహౌజ్‌కు రూ.1,50,000 ఖర్చు రాగా.. ఎకరం స్థలంలో నిర్మించిన దానికి రూ.26,00,000 వరకు ఖర్చు అయ్యింది. మరోవైపు 200 గజాల స్థలంలో నిర్మించిన పాలీహౌజ్‌లో ప్రస్తుతం క్యాప్సికం సాగు చేస్తున్నాడు.



రైతులకు ఏదైనా చేయాలన్నా ఆలోచనతో..

"చిన్నప్పటి నుంచి వ్యవసాయంపై ఆసక్తి. రైతులకు ఏదైనా సాయం చేయాలన్నా ఆలోచనతోనే ఈ రంగంలోకి దిగా. తక్కువ ఖర్చు.. ఎక్కువ దిగుబడి వచ్చే సాగు విధానాలపై దృష్టి సారించా. ఈ క్రమంలో ఇప్పుడున్న పాలీహౌస్‌లకు భిన్నంగా స్థానిక వనరులను వినియోగించుకుంటూ చిన్నరైతులకు వీలుగా భిన్నంగా నిర్మించాలని నిర్ణయించుకొని వెదురు బొంగులతో పాలీహౌజ్ నిర్మాణం చేపట్టా. ప్రస్తుతం దానిలోనే క్యాప్సికం సాగు చేపట్టా. వెదురు బొంగుల పాలీహౌజ్‌పై ఆసక్తి ఉన్న రైతులు 9848019668లో సంప్రదించవచ్చు"



–బి.వెంకటేశ్వర్‌రావు

అస్సాం నుంచి వెదురు బొంగులు..

పాలీహౌజ్‌కు అవసరమైన వెదురు బొంగులను అస్సాం నుంచి తెప్పించారు. భూమిలో పాతినప్పుడు చెదలు రాకుండా ఇక్కడి వాటికి ప్రత్యేకంగా కెమికల్ ట్రీట్‌మెంట్ చేశారు. ఈ ప్లాంట్‌నూ తన సొంత పొలంలో ఏర్పాటు చేశారు. నాటిన వెదురు బొంగులపై ప్లాస్టిక్ షీట్లు వేశారు. స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా డిజైన్‌లో మార్పులు చేశారు. భారీ వర్షాలు కురిసినా.. 150 కిలో మీటర్ల వేగంతో వచ్చే గాలులను తట్టుకునేలా 15 నుంచి 20 సంవత్సరాల పాటు మన్నేలా నిర్మించారు.

పూర్తిగా సేంద్రియమే..

200 గజాల విస్తీర్ణంలో ఉన్న పాలీహౌజ్‌లో వెంకటేశ్వర్‌రావు సేంద్రియ విధానంలో క్యాప్సికం సాగు చేస్తున్నాడు. మొదటగా పెద్ద కవర్లు తెచ్చి అందులో కొబ్బరిపీచు నింపి అందులోనే క్యాప్సికం మొక్కలు తెచ్చి నాటాడు. డ్రిప్ ద్వారా నీరు అందిస్తూ రసాయన ఎరువులు కాకుండా పూర్తిగా సేంద్రియ ఎరువులే వాడుతున్నాడు. మొత్తం 200 గజాల పాలీహౌజ్‌లో 14 వరుసల్లో 1800 మొక్కలు వచ్చాయి. ఇవి ప్రస్తుతం కాత దశలో ఉన్నాయి. మరో పది నుంచి పదిహేను రోజుల్లో కోతకు రానున్నాయి. తక్కువ తక్కువలో పది టన్నుల దిగుబడి వస్తుందని వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో క్యాప్సికానికి రూ.40లు పలుకుతుందన్నారు.

–అండెం శ్రీనివాస్‌రెడ్డి
8096677464

ఆయిల్‌పామ్ సాగు సమగ్ర వివరాలు

అధిక దిగుబడులు ఇచ్చే పంటల్లో ఆయిల్‌పామ్ ఒకటి. ప్రస్తుతం రాష్ట్రంలో ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల్లో ఈ పంట ఎక్కువ మొత్తంలో సాగు అవుతున్నది. ఆయిల్‌పామ్ పంట ఎంతో అనుకూలమైనదని ఉద్యానశాఖ అధికారులు తెలిపారు. ఆయిల్‌పామ్ చెట్టు ఫలంలో పీచు భాగాల నుంచి వంటనూనె, గింజల నుంచి కెర్నల్ నూనె దిగుబడి అవుతుంది. ఈ కెర్నల్ నూనె ఇండస్ట్రీయల్ అవసరాలకు వినియోగిస్తారు. ఆయిల్‌పామ్‌లో సాగులో తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఆశించిన దిగుబడి పొందేందుకు అవకాశం ఉన్నది. ఈ పంటకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారి జే. మరియన్నను ఈ నంబర్ 7997725142 ద్వారా సంప్రదించవచ్చు.

సరాసరి అత్యల్ప ఉష్ణోగ్రత 22-24 సెంటీగ్రేడ్ ఉండాలి. అధిక చలిని తట్టుకునే సామర్థ్యం ఉండదు. అధిక దిగుబడులకు ఉష్ణోగ్రత 20-30 సెంటీగ్రేడ్ ఉండాలి. ఎండాకాలంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అయినప్పటికీ పంటకు నష్టం ఉండదు.

సాగు వంగడం

ఆయిల్‌పామ్‌లో ఎక్కువ దిగుబడి ఇచ్చే రకం ప్రస్తుతం మార్కెట్‌లో ఒక్క రకం మాత్రమే అందుబాటులో ఉన్నది. దినేరా అనే హైబ్రీడ్ రకం విత్తనం ప్రపంచంలోనే అధికంగా సాగు చేసే విత్తనం. ఇది పలుచని పెంకు, అధిక భాగం పీచు భాగం కలిగి ఉండటం వల్ల నూనె శాతం ఎక్కువగా ఉంటుంది.

నాటే విధానం..

ఆయిల్‌పామ్ పంట అన్ని సీజన్లలో నాటుకునేందుకు అనువుగా ఉంటుంది. జూన్-జనవరి నెలల్లో సాగు చేసుకోవడం వల్ల మేలు చేకూరుతుంది. ఎండకాలంలో అధిక పీచుభాగంతో పాటు ఎక్కువ నూనె శాతం కలిగి ఉండటానికి దోహదం చేస్తుంది. ఎండకాలంలో నాటుకుంటే ఎండను తట్టుకోవడం కోసం అధికంగా





నీరు అందించాలి. 12-14 నెలల వయస్సు కలిగి 1-1.3 మీటర్ల ఎత్తు, 13 ఆకులతో ఆరోగ్యంగా ఉన్న మొక్కలను నాటుకోవచ్చు. హెక్టారుకు 143 లేదా, ఎకరానికి 57 మొక్కలు ఉండాలి. 60x60, 60x60 సెం.మీ. గుంతలు తీసుకొని వాటి మధ్య 9x9,9 x9 మీటర్లు ఉండేలా త్రిభుజాకార పద్ధతిలో గుర్తులు పెట్టుకోవాలి. ప్రతి గుంటలో 400 గ్రా, సింగిల్ సూపర్‌ఫాస్ఫేట్ లేదా, 250గ్రా డీఏపీ, 50గ్రా ఫోరెట్ గుళికలు, వేసి మట్టితో కలుపుకోవాలి, నాటిన తరువాత పాదులను చేసుకొని మొక్కలకు నీరు పెట్టుకోవాలి. నర్సరీ నుంచి తెచ్చిన తరువాత నాటకుండా నిల్వ పెట్టుకోకూడదు.

నీటి యాజమాన్యం

మంచి దిగుబడి కోసం ఎక్కువ నీరు పెట్టుకోవాలి. నీరు ఎంత సమృద్ధిగా పెట్టుకున్నా నష్టం ఉండదు. డ్రిప్, మైక్రో స్ప్రింక్లర్ల ద్వారా నీటిని ఆదా చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. దీంతో ఆదాయం పెంచుకోవడంతో పాటు, కూలీల ఖర్చు కూడా తగ్గుతుంది.

ఎరువులు వాడే విధానం

మొక్క వయస్సు	భాస్వరం	భాస్వరం	పొటాషియం	మెగ్నీషియం
మొదటి ఏడాది	400గ్రా	200గ్రా	400గ్రా	125గ్రా
రెండవ ఏడాది	800గ్రా	400గ్రా	800గ్రా	250 గ్రా
మూడవ ఏడాది	1200గ్రా	600గ్రా	1200గ్రా	500 గ్రా

ఎరువుల వాడకం

ఆయిల్‌పామ్ పంట దిగుబడుల్లో ఎరువుల పాత్ర కూడ కీలకం. సమృద్ధి పరిమాణంలో పోషకపదార్థాలను అందించాలి. నేల స్వభావాన్ని, నీరు అందించే పద్ధతిని బట్టి ఎరువులను వేసుకోవాలి. ఎనిమిదేండ్ల పైబడిన మొక్కలకు తోటలలో నేల, పత్రపోషక విశ్లేషణ ఫలితాల ఆధారంగా పోషకాలను అందించాలి. పొటాష్ ఒక్కో మొక్కకు 2,700 గ్రాముల వరకు అందించాలి. బోరాన్ లోపం కనిపించనట్లైతే బోరాక్స్ ఏడాదికి చెట్టుకు 100 గ్రాముల చొప్పున వేసుకోవాలి. కొత్తగా నాటిన మొక్కలను మొదటి దఫాగా మొక్కలు నాటిన మూడు నెలల తరువాత ఎరువులు వేసుకోవాలి. రెండో దఫాగా పచ్చిరొట్ట ఎరువు 50కిలోలు, వేపపిండి 5కిలోలు చొప్పున వేసుకోవాలి. సేంద్రియ ఎరువులను వేసినప్పుడు దానికి తగిన మోతాదులో రసాయన ఎరువుల ద్వారా నత్రజని తగ్గించుకోవాలి.

ఎరువులు వేసే విధానం

ప్రతి మూడు నెలలకు ఒకసారి చెట్టు మొదలు నుంచి 50 సెం.మీ. దూరంలో ఎరువులను సమానంగా చల్లుకోవాలి. అనంతరం మట్టితో కలుపుకొని నీరు అందించాలి. బిందు పరికరాల ద్వారా నీరు అందించినప్పుడు ఎరువులను నీటిలో కలిపి అందించవచ్చు. అయితే ఫాస్పరస్ ఎరువులను నత్రజని ఎరువులతో కరిగించకుండా వేర్వేరుగా కలుపుకోవాలి. ఒకవేళ ఫాస్పరస్ ఎరువులను నేరుగా నేలలో సైతం వేసుకోవచ్చు. ఆమ్ల భూముల్లో భాస్వరం ఎరువును రాక్ ఫాస్ఫేట్ ద్వారా క్షార భూముల్లో సూపర్ ఫాస్ఫేట్ ద్వారా వేసుకోవడం మేలు.

పాదులు చేసే పద్ధతి

ఏడాది మొక్క చుట్టు 1 మీటరు వ్యాసార్థంలో పాదులు చేసుకోవాలి. రెండేండ్ల మొక్కకు 2 మీటర్లు, మూడేండ్ల మొక్కకు 3 మీటర్ల పాదు వ్యాసార్థం పెంచుకోవాలి. పాదులో వేర్లు కేంద్రీకృతమై ఉంటాయి. కాబట్టి నీరు పోషక పదార్థాల కోసం ఆయిల్‌పామ్‌లో తోటల్లో కలుపు తీసుకొని శుభ్రంగా ఉంచుకోవాలి.

–మద్దెల లక్ష్మయ్య, 90107 23131
ఖమ్మం వ్యవసాయం

నమస్తే తెలంగాణ
చిత్రం
[కరీంనగర్]
గురువారం 24 జనవరి 2019


అఖిల్

అక్కినేని నటవారసుడిగా 'అఖిల్' చిత్రంతో తెరంగేట్రం చేశారు యంగ్ హీరో అఖిల్ అక్కినేని. తొలి సినిమా పరాజయంతో చాలా నేర్చుకున్నానని, ఎంత ఫ్యామిలీ నేపథ్యం వున్నా ప్రేక్షకులు తనని నమ్మి థియేటర్‌కు రావాలంటే కొంత సమయం పడుతుందని, తాజా చిత్రం విషయంలో మంచి నమ్మకంతో వున్నానని చెబుతున్నారాయన. అఖిల్ అక్కినేని నటించిన తాజా చిత్రం 'మిస్టర్‌మజ్ను'. వెంకీ అట్లూరి దర్శకుడు. శ్రీవెంకటేశ్వర సినీచిత్ర పతాకంపై బీవీఎస్‌ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం రేపు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో హీరో అఖిల్ అక్కినేని పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి.

నా విషయంలో అవి శత్రువులు!

ఈ సినిమా విషయంలో గట్టి నమ్మకంతో వున్నారా?
• ఇదొక ఎంటర్‌టైనర్. ప్రస్తుతం ప్రేక్షకులు ఎంటర్‌టైన్ చేసే చిత్రాలనే కోరుకుంటున్నారు. హ్యూమర్, ఫ్యామిలీ ఎమోషన్స్ వున్న చిత్రాలనే ఎక్కువగా ఆదరిస్తున్నారు. ఇవే అంశాలతో ఈ సంక్రాంతికి విడుదలైన 'ఎఫ్2' విజేతగా నిలిచింది. ఎంటర్‌టైన్‌మెంట్‌ను ఆశిస్తూ థియేటర్‌కు ఎవరైతే ప్రేక్షకులు వస్తున్నారో వారిని సంతృప్తి పరచాలన్న ఉద్దేశంతో చేసిన సినిమా 'మిస్టర్ మజ్ను'.

సినిమాలో మీ పాత్ర చిత్రణ ఎలా వుంటుంది?
• దర్శకుడు వెంకీ అట్లూరి ఓ క్లాసిక్ చిత్రాన్ని తీసుకుని తన పంథాలో ఆవిష్కరించారు. నాన్న నటించిన నిన్నే పెళ్లాడుతా, మన్మథుడు, త్రివిక్రమ్‌గారి చిత్రాల స్ఫూర్తితోనే వెంకీ ఈ చిత్రాన్ని రూపొందించాడు. అలా అని ఏ సన్నివేశాన్ని కాపీ చేయలేదు కానీ స్ఫూర్తిగా మాత్రం తీసుకున్నాడు. ఈ సినిమాకు ముందు వెంకీ మామూలుగా తెలుసు. అయితే ఈ సినిమాతో మాత్రం నాకు మంచి మిత్రుడయ్యాడు.

సినిమా విడుదలవుతోందంటే ఒత్తిడి ఏమైనా ఫీలవుతున్నారా?
• గత చిత్రాలతో పోలిస్తే ఈ సినిమా విషయంలో చాలా ఒత్తిడిగానే ఫీలవుతున్నాను. అయితే ఈ సారి మాత్రం ఫ్యాన్స్ గట్టిగా కొట్టాలని కాన్ఫిడెంట్‌గా చెబుతున్నారు.

వెంకీ మూడేళ్ల క్రితం కథ చెప్పారన్నారు. కథ నచ్చితే ఇంత కాలం ఎందుకు ఆగాల్సి వచ్చింది?
• అప్పటికే వి.వి.వినాయక్‌తో ఓ సినిమా అంగీకరించి వున్నాను. ఆ సినిమా తరువాత మా సొంత సంస్థలో మా నాన్న ఓ సినిమా ప్లాన్ చేశారు. ఈ రెండూ పూర్తి కావాలంటే మూడేళ్లు పడుతుంది. ఈ విషయం వెంకీతో అప్పుడే చెప్పాను. ఇద్దరం ఫ్రీ అయిన తరువాతే ఈ సినిమా చేద్దామన్నాడు. ఆ కారణంగానే నాతో వెంకీ సినిమా చేయడానికి ఇన్నేళ్లు ఎదురుచూడాల్సి వచ్చింది.

గత రెండు చిత్రాలతో పోలిస్తే ఈ సినిమా మీకు ఏ విషయంలో ఛాలెంజింగ్‌గా అనిపించింది?
• సినిమా తొలి భాగం మొత్తం నా పాత్ర ఆధారంగానే సాగుతుంది. ఇదొక ప్యూర్ లవ్‌స్టోరి. అయినా తొలి 30 నిమిషాల తరువాతే ప్రేమకథ మొదలవుతుంది. నా గత చిత్రాలతో పోలిస్తే అన్ని రకాల ఎమోషన్స్ వున్న సినిమా. కుటుంబ భావోద్వేగాల్ని కథలో మిళితం చేసిన తీరు నాకు బాగా నచ్చింది. నా గత చిత్రాల్లో నేను పోషించిన పాత్రలకు చాలా భిన్నంగా కొత్త పంథాలో సాగే పాత్రలో నటించాను. సినిమాలో ప్లేబాయ్ విక్కీగా కనిపిస్తాను. ఆ పాత్రను తెరపైకి మరింత ప్రభావవంతంగా తీసుకురావడానికి చాలానే శ్రమించాను. నటుడిగా నాకు ఓ ఛాలెంజ్‌గా భావించి చేశాను.

మూడవ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ సినిమాతో అఖిల్ హిట్ కొట్టాలనే అంచనాలు ఏర్పడ్డాయి? కదా?
• మితి మీరిన అంచనాలు, ఒత్తిడి అనేవి నా విషయంలో శత్రువులు. అంచనాల కోసం కాకుండా నా వంతు బెస్ట్ ఏం ఇవ్వాలో దాని గురించే ఎక్కువగా ఆలోచించాలనుకున్నాను. కెరీర్ ప్రారంభం నుంచి భారీ హిట్ కొట్టాలనే హైప్ ఎందుకు క్రియేట్ అయ్యిందో...ఎలా వచ్చిందో కానీ మొత్తానికైతే నా సినిమా అంటే భారీ స్థాయిలోనే వుంటుందనే అంచనాలు ఏర్పడ్డాయి. అది నా పొరపాటో ఏమో తెలియడం లేదు.

గత చిత్రాల ఫలితాల్ని దృష్టిలో పెట్టుకుని మీలో ఏమైనా మార్పులొచ్చాయా?
• అనుభవాన్ని బట్టే మనలో మార్పులు అనేవి చోటు చేసుకుంటాయి. నేను నటించిన తొలి సినిమా 'అఖిల్' బాక్సాఫీస్ వద్ద దారుణంగా ఫ్లాప్ అయింది. దాని నుంచి బయటికి వచ్చి 'హలో' చేయడానికి చాలా సమయం పట్టింది. రెండవ సినిమా ఫలితంతో నాపై నాకు నమ్మకం ఏర్పడింది. ఈ సినిమా విజయం ప్రేక్షకుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాననే ధైర్యాన్నిచ్చింది.

'హలో' మీరు ఆశించిన స్థాయిలోనే విజయం సాధించిందని అనుకుంటున్నారా?
• 'హలో' ఓ రేంజ్‌లో హిట్ అవుతుందని ఆశించాం కానీ ఆ స్థాయి విజయాన్ని సాధించని మాట నిజమే. నాకు ఎంత ఫ్యామిలీ సపోర్ట్ వున్నా, స్టార్ హీరో కుమారుడిని అయినా నన్ను నమ్మి ప్రేక్షకులు థియేటర్‌కు రావాలంటే నా ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ కొంత వరకే పనిచేస్తుంది. అయితే ప్రేక్షకుల్లో నమ్మకాన్ని కలిగించడానికి మాత్రం కొంత సమయం ఖచ్చితంగా పడుతుంది.

ప్రీరిలీజ్ వేడుకలో ఎన్టీఆర్ మీరు ఆత్మవిమర్శ చేసుకున్నారని చెప్పడానికి కారణం?
• ఎన్టీఆర్ సాధారణంగా ఎవరిని పొగడరు. తను చెప్పినట్టు నన్ను నేను ఆత్మవిమర్శ చేసుకుంటా. తప్పుల నుంచి చాలా నేర్చుకునే ప్రయత్నం చేస్తా. తొలి సినిమా ఫలితంతో చాలా నేర్చుకున్నాను. స్టార్ హీరోలకు ఫ్లాప్ వస్తే అందులోంచి తేరుకోవడానికి చాలా సమయం పడుతుంది. అయితే నేను స్టార్ హీరోను కాదు కాబట్టి త్వరగానే కోలుకున్నాను. తొలి సినిమా ఫ్లాప్ రావడం వల్ల నేను కొంచెం మానసికంగా దృఢంగా తయారయ్యాను. రెండవ సినిమా చేసేటప్పుడు నాలో ఆత్మ విశ్వాసం మరింత ఎక్కువైంది.

ఈ మధ్య మల్టీస్టారర్ చిత్రాలు ఎక్కువగా వస్తున్నాయి. ఆ వైపు అడుగులు వేసే ఆలోచన వుందా?
• తప్పకుండా. నాక్కూడా అలాంటి చిత్రాల్లో నటించాలని వుంది. అయితే ఇద్దరు ముగ్గురు హీరోలతో కాకుండా ఓ ఆరుగురు హీరోలతో కలిసి నటించాలని వుంది. అలా అందరితో కలిసి నటిస్తే నేర్చుకోవడానికి ఎక్కువ అవకాశం వుంటుంది.

తదుపరి సినిమా గురించి?
• రెండు మూడు కథలు విన్నాను. అందులో ఓ కథ చేయబోతున్నాను. అది ఎవరితో చేస్తాను అన్నది ఫిబ్రవరి చివరి వారంలో ప్రకటిస్తా. ఇకపై ఏడాదికి రెండు మూడు చిత్రాలు చేయాలనుకుంటున్నాను. ఆ విషయంలో స్పీడు పెంచుతా.

బాలీవుడ్‌లో దర్శకత్వం!


రాఘవ లారెన్స్

నృత్య నిర్దేశకుడిగా, నటుడిగా, దర్శకుడిగా దక్షిణాది పరిశ్రమలో రాణించిన రాఘవ లారెన్స్ త్వరలో బాలీవుడ్‌లో మెగాఫోన్ పట్టబోతున్నారు. స్వీయ దర్శకత్వంలో ఆయన నటించిన 'కాంచన' చిత్రం మంచి విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమా రీమేక్ ద్వారా ఆయన హిందీ చిత్రసీమలో దర్శకుడిగా అరంగేట్రం చేయబోతున్నారు. ఇందులో అక్షయ్‌కుమార్ కథానాయకుడిగా నటించనున్నట్లు సమాచారం. 'కాంచన' సినిమాలోని శరత్‌కుమార్ పాత్ర కోసం ప్రముఖ బాలీవుడ్ కథానాయకుడిని సంప్రదించినట్లు తెలిసింది. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాల్ని త్వరలో ప్రకటించనున్నారు.


పూరి జగన్నాథ్, రామ్, ఛార్మి, భాస్కరభట్ల, స్రవంతి రవికిషోర్

'ఇస్మార్ట్ శంకర్' షురూ

రామ్ కథానాయకుడిగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందిస్తున్న 'ఇస్మార్ట్ శంకర్' చిత్రం బుధవారం హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభమైంది. పూరి జగన్నాథ్ టూరింగ్ టాకీస్, పూరి కనెక్ట్స్ పతాకాలపై పూరి జగన్నాథ్, ఛార్మి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం రామ్‌పై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి ఛార్మి క్లాప్‌నివ్వగా ప్రముఖ నిర్మాత స్రవంతి రవికిషోర్ కెమెరా స్విఛాన్ చేశారు. గురువారం నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలుకానుంది. ఇందులో రామ్ పాత్ర చిత్రణ వైవిధ్యంగా ఉంటుందని చిత్రబృందం చెప్పింది. పునీత్ ఇస్సార్, సత్యదేవ్, మిలింద్ గునాజి, అశిష్ విద్యార్థి, గెటప్ శ్రీను, సుధాన్షు పాండే, మధు సింగంపల్లి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రాజ్ తోట, ఆర్ట్: జానీషైక్, ఎడిటర్: జునైద్ సిద్ధిఖి, పాటలు: భాస్కరభట్ల, ఫైట్స్: రియల్ సతీష్, సంగీతం: మణిశర్మ, సమర్పణ: లావణ్య, దర్శకత్వం: పూరి జగన్నాథ్.